PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 211 | విజయవాడ, మంగళవారం 4 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 7.00

Vol No | Vijayawada, Tuesday 4 March 2025 | Rs

విద్యార్థులపై కారెక్కిస్తారా?

- మంత్రి దారుణంపై భగ్గుమన్న బెంగాల్
- రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆందోళనలు

7

ఆస్కార్ విజేతలు వీరే..

8

ఉత్తరాంధ్ర టీచర్ల ఎమ్మెల్సీ 'గాదె'

గ్రాడ్యుయేట్స్ స్థానాల్లో టిడిపి ముందంజ

ప్రజాశక్తి- యంత్రాంగం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసుల నాయుడు విజేతగా నిలిచారు. ఈ స్థానానికి 20,791 ఓట్లు పోలవ్వగా, 656 ఓట్లు చెల్లలేదు. పది మంది పోటీలో ఉన్నారు. మొదటి ప్రాధాన్యతా ఓట్లు పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడుకు 7,272, టిడిపి, జనసేన మద్దతునిచ్చిన ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు 6,905, యుటిఎఫ్ మద్దతిచ్చిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి 5,900 వచ్చాయి. రెండో ప్రయార్టీ ఓట్లను లెక్కిస్తూ ఎలిమినేషన్ రౌండ్‌కు వెళ్లారు. 9వ రౌండ్ (ఆఖరి రౌండ్)లో గాదె శ్రీనివాసులనాయుడుకు 9,237, పాకలపాటి రఘువర్మకు 8,527 ఓట్లు వచ్చాయి. ఎవరికీ 50 శాతం ప్లస్ 1 (10,068) ఓట్లు రాకపోవడంతో 710 ఓట్లతో గాదె శ్రీనివాసుల నాయుడు గెలుపొందారు. తొలి రౌండ్ నుంచీ ఆయన అధిక్యంలో కొనసాగుతూ వచ్చారు. తన గెలుపును అధికారంగా ప్రకటించి ధ్రువీకరణ పత్రం అందజేయాలని కోరుతూ శ్రీనివాసులనాయుడు విశాఖలోని ఇంజనీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్ద ఉపాధ్యాయులతో కలిసి ధర్నాకు దిగారు. దీంతో, ఆయనకు అధికారులు ధ్రువీకరణ పత్రం అందజేశారు. కాగా, ఇప్పటి వరకూ ఈ స్థానానికి నాలుగుసార్లు ఆయన పోటీ చేశారు. తాజా గెలుపుతో మూడుసార్లు విజయం దక్కించుకున్నారు.

గాదె శ్రీనివాసులు నాయుడు

కృష్ణా - గుంటూరులో ఆలపాటి ఆధిక్యత

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రులు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 2,41,502 పోలయ్యాయి. 25 మంది బరిలో ఉన్నారు. ఐదో రౌండ్ పూర్తయ్యే సరికి టిడిపి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు 84,595 ఓట్లు, పిడిఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావుకు 36,723 ఓట్లు వచ్చాయి. దీంతో, ఆలపాటి 47,872 ఓట్ల ఆధిక్యతతో ఉన్నారు. ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.

ఉభయగోదావరి జిల్లాల్లో పి.రాజశేఖరం అధిక్యత

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో 35 మంది పోటీ చేశారు. మొత్తం 2,18,902 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ మొదటి రౌండ్‌లో 28 వేల ఓట్లు లెక్కించారు. టిడిపి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి 16,520 ఓట్లు, పిడిఎఫ్ అభ్యర్థి డి.వీరరాఘవులుకు 5,832 ఓట్లు పోలయ్యాయి. 10,688 అధిక్యతలో పేరాబత్తుల ఉన్నారు. ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.

ఓలా ఎలక్ట్రిక్‌లో వెయ్యి మందిపై వేటు..!

బెంగళూరు : ద్విచక్ర విద్యుత్ వాహనాల తయారీ దారు ఓలా ఎలక్ట్రిక్ మరోమారు ఉద్యోగులపై వేటుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ దఫా వెయ్యి మంది సిబ్బందికి ఉద్వాసన పలుకనుందని బ్లూమ్‌బర్గ్ ఓ నివేదికలో వెల్లడించింది. ఇందులో శాశ్వత, కాంట్రాక్టు ఉద్యోగులున్నారు. ప్రొక్యూర్‌మెంట్, కస్టమర్ రిలేషన్స్, ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహా పలు విభాగాల్లో ఉద్వాసనలు ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది నవంబర్‌లోనూ 500 మందిని రోడ్డున పడేసింది. కాగా.. ఇటీవల కంపెనీకి నష్టాలు పెరగడంతో పొదుపు చర్యలకు దిగుతోంది. ఉద్వాసనలపై మళ్లీ వార్తలు రావడంతో ఆ కంపెనీ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో ఓలా ఎలక్ట్రిక్ రూ.564 కోట్ల నికర నష్టాలను చవిచూసింది. గతేడాది ఇదే త్రైమాసికంలోని రూ.376 కోట్ల నష్టాలతో పోల్చితే మరింత పెరిగాయి. విద్యుత్ వాహన రంగంలో పెరుగుతున్న పోటీ.. మరోవైపు ఆదాయాలు తగ్గుముఖం పట్టడం, సర్వీసు లోపాలను సరిదిద్దుకునేందుకు ఇటీవల భారీ మొత్తంలో వ్యయాలు చేయడం ఆ కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌పై మరింత ఒత్తిడిని పెంచాయి. విస్తరణలో భాగంగా తన స్టోర్లను 800 నుంచి ఏకంగా 4,000కు పెంచేసింది. కొన్ని నెలలుగా ఓలా ఎలక్ట్రిక్ పలు వివాదాలతో తన బ్రాండ్ గుర్తింపును కోల్పోయే పరిస్థితి చోటు చేసుకుంది. ముఖ్యంగా అమ్మకాల తర్వాత సర్వీసింగ్‌కు సంబంధించిన కార్యకలాపాలు, సేవలపై వాహనదారుల నుంచి భారీగా ఫిర్యాదులు చేస్తున్నారు. వినియోగదారుల హక్కుల ఉల్లంఘన, తప్పుదోవ పట్టించే ప్రకటనలు, అన్యాయమైన వాణిజ్య పద్ధతులు అనుసరిస్తున్నారన్న ఆరోపణలూ వచ్చాయి. వీటిపై జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు 10వేలకు పైనే ఫిర్యాదులు రావడంతో సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విస్తరణ, కొత్త సర్వీసు సెంటర్లపై దృష్టి పెట్టింది. ఇదే క్రమంలో వ్యయాలు పెరిగాయి. దీంతో పొదుపు చర్యల్లో భాగంగా వేలాది మంది ఉద్యోగులకు ఎసరు పెడుతోందని తెలుస్తోంది.

పేదరికంలోనే...

- 9వ స్థానంలో రాష్ట్రం
- గిరిజన ప్రాంతాల్లోనే దారిద్ర్యం ఎక్కువ
- అత్యధిక పేదరిక జిల్లాగా ఉమ్మడి కర్నూలు
- సోషియా ఎకనామిక్ సర్వే నిర్ధారణ

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

పాలకవర్గాలు, ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు ఎలా ఉన్నప్పటికీ రాష్ట్రం పేదరికంలోనే కొట్టుమిట్టాడుతోంది. శాసనసభలో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నాడు ప్రవేశపెట్టిన సోషియో ఎకనామిక్ సర్వే ఈ విషయాన్ని నిర్ధారించింది. దేశ వ్యాప్తంగా పేదరికంలో రాష్ట్రం 9వ స్థానంలో ఉందని ఈ నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పేదరికపు వ్యత్యాసాలను నివేదిక వివరించింది. మిగిలిన వారితో పోలిస్తే గిరిజనుల్లో పేదరికం అత్యధికంగా ఉందని, గిరిజన ప్రాంతాల్లో దారిద్ర్య తీవ్రత స్పష్టంగా కనపడుతోందని పేర్కొంది. ఉమ్మడి కర్నూలు జిల్లా పేదరికంలో రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రణాళిక శాఖ రూపొందించిన ఈ నివేదికలో స్వర్ణాంధ్ర విజన్-2047లక్ష్యాలను వివరించారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్రం ఎన్నో పథకాలను రూపొందిస్తోందని, ముఖ్యంగా మహిళా సాధికారత, గ్రామీణ ఉపాధి కల్పన, గృహ నిర్మాణం, డిజిటల్ ఇన్‌క్లూజిన్ తదితర పథకాలతో పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు దేశంలోనే ఒక హబ్‌గా రూపొందుతోందని పేర్కొన్నారు. అయితే, పేదరికాన్ని 'సున్నా' స్థాయికి తగ్గించడానికి ఇంకా ఎంతో చేయాల్సిఉందని సర్వే పేర్కొంది. ముఖ్యంగా గ్రామీణ అభివృద్ధి, ఉపాధి కల్పన, ఆర్థిక సమ్మిళిత కార్యక్రమాల మధ్య సమన్వయం సాధించాల్సివుందని తెలిపింది

రాష్ట్రంలో పేదరికం ఇలా

ఉమ్మడి జిల్లా	హెడ్‌కౌంట్ రేషియో (శాతంలో)	తీవ్రత (శాతం)	ఎంపిఐ స్కోర్
పశ్చిమ గోదావరి	2.42	42.56	0.01
వైఎస్ఆర్ కడప	3.34	38.51	0.013
గుంటూరు	4.36	37.58	0.016
కృష్ణా	4.38	38.22	0.017
చిత్తూరు	5.66	39.2	0.022
శ్రీకాకుళం	5.20	41.83	0.022
నెల్లూరు	5.41	43.06	0.023
అనంతపురం	6.74	40.56	0.027
తూర్పు గోదావరి	6.13	43.65	0.027
ప్రకాశం	6.28	43.60	0.027
విశాఖపట్నం	7.60	40.81	0.031
విజయనగరం	8.66	40.20	0.035
కర్నూలు	12.84	42.32	0.054
రాష్ట్రం	6.06	41.12	0.025

ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా

ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా రాష్ట్రంలో పేదరికాన్ని ప్రణాళిక శాఖ లెక్కించింది. దీని ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో అతి తక్కువ పేదరికం నమోదైంది. ఆ తరువాత స్థానాల్లో వైఎస్ఆర్ కడప, గుంటూరు, కృష్ణ జిల్లాలు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో అత్యధిక పేదరికం నమోదైంది. పేదరికం అత్యధికంగా ఉన్న జిల్లాలో కర్నూలు తరువాత ఉమ్మడి విజయ నగరం, విశాఖపట్నం జిల్లాలు ఉన్నాయి. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో గిరిజనుల సంఖ్య ఎక్కువగా ఉం డటం గమనార్హం. గిరిజనులు నివసించే అన్ని ప్రాంతాల్లోనూ పేదరికం తీవ్రంగా ఉందని నివేదికలో పేర్కొన్నారు.

దేశ వ్యాప్తంగా ఇలా...

నీతి అయోగ్ రూపొందించిన మల్టీ డైమన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపిఐ) ఆధారంగా రాష్ట్ర ప్రణాళిక శాఖ ఈ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం 0.002 ఎంపిఐ స్కోర్‌తో కేరళ అతి తక్కువ పేదరికాన్ని కలిగిఉంది. పేదరిక నిర్మూలన పథకాల రూపకల్పన, అమలులో కూడా ఆ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. కేరళ తరువాత స్థానాల్లో గోవా (0.003), తమిళనాడు (0.009) రాష్ట్రాలు వరుసగా 2,3 ఉన్నాయి. తెలంగాణ 0.024 ఎంపిఐ స్కోర్‌తో పేదరికంలో 8వ స్థానంలో ఉండగా, ఆ తరువాత 9 వ స్థానంలో 0.025 ఎంపిఐ స్కోర్‌తో ఆంధ్రప్రదేశ్ ఉంది. అతి తక్కువ పేదరికంతో ఉన్న కేరళతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం పది రెట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. అయితే, ఈ తేడాను అధిగమిస్తామని, 2047నాటికి పేదరికాన్ని సున్నా స్థాయికి తీసుకుపోతామని నివేదికలో పేర్కొన్నారు. అదే విధంగా జాతీయ స్థాయిలో ప్రతి వంద మందికి (హెడ్ కౌంట్ రేషియో) 14.96 మంది పేదలు ఉండగా, రాష్ట్రంలో 6.06 మంది పేదలు ఉన్నారని పేర్కొన్నారు. పేదరిక తీవ్రత జాతీయ స్థాయిలో 44.39శాతంగా ఉండగాచ రాష్ట్ర స్థాయిలో 41.12శాతం ఉందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 19.28శాతం మంది మిగతా 7లో

స్వర్ణాంధ్ర విజన్ సాధనలో తొలి అడుగు వేశాం!

- గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు ప్రారంభంలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు ప్రారంభంతో స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనలో తొలి అడుగు వేసినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. తిరుపతిలోని రాక్‌మాన్ ఇండస్ట్రీస్‌లో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్ ప్లాంటును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం ఉండవల్లిలోని తన నివాసం నుండి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు సరికొత్త విధానంతో సాంకేతిక కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుందని, కాలుష్యనివారణలో కొత్త బెంచ్‌మార్కును నిర్దేశిస్తుందని చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో రాష్ట్రాన్ని ప్రపంచ కేంద్రంగా మార్చాలనే లక్ష్యానికి ఇది తొలి అడుగవుతుందని పేర్కొన్నారు. తిరుపతిలో పెట్టిన స్కేలబుల్ మోడల్‌ను రాష్ట్ర మంతా, దేశవ్యాప్తంగా ఇతర పరిశ్రమల్లోనూ అమలు చేయొచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని క్లీన్ ఎనర్జీలో 10 ట్రిలియన్ రూపాయల పెట్టుబడిని సాధిస్తామనే విశ్వాసం ఉందని పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ ప్లాంటుతో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ జైత్రయాత్ర మొదలు కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వాణిజ్య ఉన్న అనుకూల విధానాలు, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి హీరో ఫ్యూచర్స్‌కు సాయం అందిస్తాయని చెప్పారు. విస్తారమైన తీర ప్రాంతం, లోతైన సముద్ర ఓడరేవులు, బలమైన లాజిస్టిక్స్ నెట్‌వర్కుతో మిగతా 7లో

తన నివాసం నుండి తిరుపతిలోని గ్రీన్ హైడ్రోజన్ సంస్థను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అందుబాటులోకి టెన్త్ హాల్ టికెట్లు

- వాట్సాప్ ద్వారా పొందొచ్చు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి పాఠశాల ప్రధానోపాధ్యాయుల లాగిన్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కెవి శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాట్సాప్-మన మిత్ర ద్వారా విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునేలా తొలిసారిగా ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. అభ్యర్థులు 9552300009కు హాయ్ అని సందేశం పంపి, పుట్టిన తేది నమోదు చేసి హాల్ టికెట్‌ను పొందవచ్చని వివరించారు. పాఠశాలల ప్రధానో పాధ్యాయులు హాల్ టికెట్‌లో విద్యార్థుల వివరాలు పేరు, పుట్టిన తేదీ, మాధ్యమం, ఫోటో, సంతకం, సబ్జెక్టులు వంటి వాటిని పూర్తిగా సరిచూడాలని తెలిపారు. అభ్యర్థి వివరాల్లో సబ్జెక్టు సరిపోకపోతే సంబంధిత ప్రధానోపాధ్యాయులు dir-govex-ams@yahoo.com, dir-govex-ams@apschooledu.in మెయిల్ ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అధికారమూ, ప్రాణాలూ పోయినా

తమిళనాట హిందీని రుద్దనివ్వం

- తమిళనాడు సిఎం స్టాలిన్

చెన్నై : పార్టీ అధికారాన్ని కోల్పోయినా, జైలు శిక్షలు - హింసలు అనుభవించాల్సి వచ్చినా, చివరికి ప్రాణాలు అర్పించాల్సి వచ్చినా తమిళనాడులో హిందీని రుద్దడాన్ని డిఎంకె అనుమతించదని ఆ పార్టీ అధ్యక్షులు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ స్పష్టం చేశారు. 'హిందీపై డిఎంకె గతంలో దృఢంగా ఉంది. ఇప్పటికీ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదు. హిందీ భారతదేశ జాతీయ భాష అని, సంస్కృతం దేశ ప్రాచీన భాష అనే వాదన పూర్తిగా అబద్ధం' అని స్టాలిన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమిళులకు ఏ భాషపైనా ద్వేషం లేదని, అయితే త్రిభాషా విధానం సాకుతో హిందీ విధించడాన్ని యావత్తు రాష్ట్రం వ్యతిరేకించిందని పేర్కొన్నారు. 'బిజెపి, దాని ఏజెంట్లు మాత్రమే తమిళనాడు ప్రయోజనాలకు ద్రోహం చేస్తూ హిందీని రుద్దడానికి మద్దతు ఇస్తున్నారు. గవర్నర్ ఆర్ఎన్ రవి కూడా ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేశారు. ఆయన అభిప్రాయం కొత్తది ఏమీ లేదు. ఆయన్ను తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం కూడా లేదు' అని స్టాలిన్ అన్నారు. ద్వి భాషా విధానం వల్ల తమిళనాడు విద్యార్థులు అదనంగా దక్షిణ భారత భాషను నేర్చుకునే అవకాశాన్ని కోల్పోయారనే గవర్నర్ రవి వాదనను ముఖ్యమంత్రి ఖండించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎన్ని రాష్ట్రాలు అదనంగా ఉత్తర భారత భాషలను బోధిస్తున్నాయనే ప్రశ్నకు గవర్నర్ సమాధానం చెప్పలేరని స్టాలిన్ విమర్శించారు. 'ఈ గవర్నర్ వెనుక తీగలను లాగుతున్న వారి వద్ద కూడా ఈ ప్రశ్నకు సమాధానం లేదు' అని పేర్కొన్నారు. హిందీ అనేక ఉత్తర భారత భాషలను మింగేసిందని సోషల్ మీడియాలో తాను చేసిన పోస్టుకు భారీగా సానుకూల స్పందన వచ్చిందని స్టాలిన్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రముఖ సంస్థల్లో తమిళులు ఉత్తమ స్థానాల్లో ఉన్నారంటే అది మాజీ ముఖ్యమంత్రి సిఎన్ అన్నాదురై అనుసరించిన ద్విభాషా విధానం వల్లే అని స్టాలిన్ తెలిపారు. 'హిందీ నేర్చుకోవడం ద్వారా తమిళ యువతకు ఉత్తర భారత రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాలను మార్గం సుగమం చేస్తుందనే భావన తప్పని ఉత్తర భారత యువత తమిళనాడుకు ఉపాధి కోసం రావడంతోనే రుజువైంది. తమళనాడులోని పన్ను చెల్లింపుదారుల డబ్బుతో గవర్నర్ జీతం పొందుతున్నారు' అని స్టాలిన్ తెలిపారు. దక్షిణ భారత భాషల కోసం 'కన్నీళ్లు పెట్టుకునే' గవర్నర్ రవి దక్షిణ భారత భాషల్లో అతి ప్రాచీనమైన తమిళాన్ని గౌరవించడంలో విఫలమయ్యారని విమర్శించారు. 'తమిళుల ప్రార్థనను, తమిళ సాధువు తిరువళ్లువర్‌ను గవర్నర్ అవమానించారు' అని స్టాలిన్ పేర్కొన్నారు.

భావ ప్రకటనా స్వేచ్ఛను ఇప్పటికైనా

పోలీసులు అర్థం చేసుకోవాలి

- సుప్రీం కోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు గడిచిందని, ఇప్పటికైనా పోలీసులు భావ ప్రకటనా స్వేచ్ఛను అర్థం చేసుకోవాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టి వేయాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ పెట్టుకున్న పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం తన తీర్పును సోమవారం రిజర్వ్ చేసుకుంది. రెచ్చగొట్టే పాటను షేర్ చేశారనే ఆరోపణలపై ఆయనపై ఈ కేసు నమోదైంది. జస్టిస్ అభయ్ ఎస్.ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన బెంచ్ పిటిషన్‌ను విచారిస్తూ, రాజ్యాంగంలోని 19(1) (ఎ) కింద ప్రాథమిక హక్కైన భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. "భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించినంతవరకు దాన్ని పరిరక్షించాల్సి వుంది.' అని జస్టిస్ ఓఖా వ్యాఖ్యానించారు. అయినా ఎంపిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందుగా పోలీసులు కొంత సున్నితత్వాన్ని ప్రదర్శించాల్సిందని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని ఆ అధికరణను పోలీసులు తప్పనిసరిగా చదివి, అర్థం చేసుకోవాలని అన్నారు. అయినా ఆ షేర్ చేసింది ఒక పద్యమని, వాస్తవానికి అహింసను ప్రోత్సహిస్తోందని జస్టిస్ ఓఖా అన్నారు. బహుశా అనువాదంలో కొన్ని సమస్యలు తలెత్తినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. 'ఇది ఏ మతానికి వ్యతిరేకంగా లేదు. ఎవరైనా హింసకు పాల్పడినా మనం హింసకు దిగరాదని ఈ పద్యం పరోక్షంగా చెబుతోందని' అన్నారు. అంతేకానీ ఏ ఒక్క మతానికి ఇది వ్యతిరేకంగా లేదన్నారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో సామూహిక వివాహాల కార్యక్రమంలో ఈ పాటను అందరికీ షేర్ చేశారని ఆరోపిస్తూ జనవరి 3వ తేదీని ఎంపిపై ఎఫ్ఐఆర్ నమోదైంది.

గుజరాత్ పోలీసుల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ, ఎంపి పంపిన వీడియో సందేశం ఇక్కడ సమస్యను సృష్టించిందని అన్నారు. పైగా ఆ సందేశాన్ని పంపింది కూడా ఆయన కాదని, ఆయన బృందమని చెప్పారు. తన సోషల్ మీడియా ఖాతాలో తన బృందం ఏ సందేశం పంపినా దానికి ఆ రాజకీయ నేతే జవాబుదారీ కావాల్సి వుంటుందని అన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ తొలుత కాంగ్రెస్ ఎంపి గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయనకు అక్కడ ఊరట లభించలేదు. దాంతో ఎంపి సుప్రీంను ఆశ్రయించారు. వాదనలు విన్న అనంతరం ఈ కేసుపై తీర్పును రిజర్వ్ చేసినట్లు బెంచ్ ప్రకటించింది.

యుఎఇలో భారత మహిళకు

ఉరిశిక్ష

అబుదాబి : యుఎఇలో భారత మహిళ షెహజాది ఖాన్‌కు ఉరిశిక్ష అమలైంది. ఆమె సంరక్షణలో ఉన్న చిన్నారి మృతి కేసులో హత్య అభియోగాలు నమోదుకావడంతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని బాందా జిల్లాకు చెందిన షెహజాదికి యుఎఇ ప్రభుత్వం మరణశిక్ష విధించింది. షెహజాదిని రక్షించాలంటూ ఆమె కుటుంబం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఫిబ్రవరి 15నే ఈ శిక్ష అమలైంది. ఈ విషయాన్ని ఢిల్లీ హైకోర్టుకు కేంద్ర విదేశాంగ శాఖ తాజాగా తెలియజేసింది. ఉత్తరప్రదేశ్‌లోని బాందా జిల్లా గోయ్రా ముగ్లి గ్రామానికి చెందిన షెహజాదికి ఉజైర్ అనే వ్యక్తి యుఎఇలో జీవితం బాగుంటుందని అక్కడకు తీసుకువెళ్తానని 2021లో ఆశ పెట్టాడు. ఆమెను ఉజైర్ ఆగ్రాలోని తమ బంధువులైన ఫైజ్, నాడియా దంపతులకు విక్రయించగా, వారు అబుదాబీకి తీసుకెళ్లారు. ఈ వ్యవహారం కోర్టుకు చేరడంతో ఫైజ్-నాడియా దంపతులపై మానవ అక్రమ రవాణా కేసు నమోదు చేశారు. అదే సమయంలో వారిబిడ్డ బాగోగులు షెహజాదినే చూస్తోంది. ఆ బిడ్డ చనిపోవడంతో.. ఆ దంపతులు ఆమెపై హత్య ఆరోపణలు మోపారు. ఔషధాల విషయంలో ఆ దంపతులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే చిన్నారి ప్రాణాలు పోయినట్లు షెహజాది తెలిపింది. కానీ, కోర్టు మాత్రం ఆమెకు మరణశిక్షను విధించింది.

ఇళ్ల స్థలాల కోసం పోరుబాట

కర్నూలులో భారీగా తరలివచ్చిన పేదలు

2

గోదావరిలో బోటు మునక

- ముగ్గురు గల్లంతు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరిలో పర్యాటకులను తీసుకెళ్లే బోటు మునిగిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రాజమహేంద్రవరంలోని కోటిలింగాల రేవు నుంచి డ్రైవర్‌తో పాటు మరో 11 మంది ప్రయాణికులతో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు పిచ్చుకలంకకు బోటు బయలుదేరింది. అనంతరం రాత్రి 8.30 గంటల సమయంలో తిరిగి పయనమైంది.

ఈ సమయంలో హేవలాక్ బ్రిడ్జి 7, 8 పిల్లర్ల సమీపానికి వచ్చేసరికి బోటులోకి నీరు చేరింది. క్రమంగా మునిగిపోవడంతో తొమ్మిది మంది ప్రయాణికులు హేవలాక్ బ్రిడ్జి పిల్లర్లపైకి చేరుకున్నారు. రాజమహేంద్రవరం సింహాచలం నగర్‌కు చెందిన అన్నవరం (54), భవానిపురానికి చెందిన జాడా రాజు (23), బోటు డ్రైవర్ గల్లంతయ్యారు. పిల్లర్లపైకి చేరుకున్న తొమ్మిది మందిని గజ ఈతగాళ్లు ఒడ్డుకు చేర్చారు. ఘటనా స్థలానికి డిఎస్‌పి కె.రమేష్‌బాబు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది ప్రత్యేక బోటుతో గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత

- ఆర్‌టిజిఎస్‌పై సమీక్షలో సిఎం
- నెలాఖరుకు వాట్సాప్‌లో 300 రకాల సేవలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రతి పౌరుడూ డిజిటల్ అక్షరాస్యుడిగా మారాలని, రాష్ట్రాన్ని సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. ఆర్‌టిజిఎస్‌పై సోమవారం వెలగపూడి సచివాలయంలో పీపుల్స్, వాట్సాప్ గవర్నెన్స్ ప్రగతిని సమీక్ష చేశారు. ప్రజలకు కావాల్సిన సేవలు నేరుగా ఫోన్లలోనే పొందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. దీనిపై ఇంకా అవగాహన పెరగాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు బాధ్యత తీసుకుని సచివాలయ సిబ్బంది, ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వాట్సాప్ ద్వారా ప్రజలు ప్రభుత్వం నుండి సేవలు పొందడమే కాదని, ఫిర్యాదులు, అర్జీలు కూడా పెట్టుకోవచ్చని వివరించారు. నిరక్షరాస్యులు తమ ఫిర్యాదును వాయిస్ ద్వారా కూడా ప్రభుత్వానికి తెలిపేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం 200 రకాల సేవలు అందిస్తున్నామని, త్వరలో 350 రకాల సేవలకు పెంచుతామని, మొత్తంగా 500 రకాల సేవలు అందేలా చూస్తామని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను కూడా ఉపయోగించుకోవాలని సూచించారు.

సచివాలయంలో ఆర్‌టిజిఎస్‌పై మంత్రులు, అధికారులతో సమీక్ష సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు

అన్న క్యాంటీన్లపై సంతృప్తి వ్యక్తమైందని తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్ల కోసం భూములిచ్చిన దళితులు, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పవర్ ప్లాంటు కోసం భూములిచ్చిన నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం నేలటూరు గ్రామ దళితులు, గిరిజనులు, మత్స్యకారులు, స్థానికుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఎపిజెన్‌కో, గాయత్రి పవర్‌ప్లాంట్ల కోసం నేలటూరు గ్రామ దళితులు, గిరిజనులు, మత్స్యకారులు, స్థానికులు భూములు ఇచ్చి దాదాపు 10 సంవత్సరాలు దాటిందని తెలిపారు. అప్పటి ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ప్రతీ ఇంటికీ ఉద్యోగం ఇస్తామని కంపెనీ యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు చెప్పారని, కానీ అది 100కి 30 మందికి మాత్రమే కాంట్రాక్ట్ ఉద్యోగాలు, అరకొర ఉపాధి దక్కిందని పేర్కొన్నారు. మిగిలిన 70 శాతం మంది ప్రజానీకానికి ఉపాధిలేక, పంట పొలాలు లేక ఉపాధి కరువయ్యిందని వివరించారు. అదేవిధంగా తరలింపు గ్రామం అనే పేరుతో ఆ గ్రామం ఎలాంటి అభివృద్ధికీ నోచుకోలేదని తెలిపారు. కాలుష్యంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, రోగాల బారిన పడిన వారికి వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చాలామంది ఇళ్లు శిథిలావస్థకు చేరినా గత్యంతరం లేక ఆ ఇళ్లలోనే బతుకు వెళ్లదీస్తున్నారని లేఖలో ప్రస్తావించారు. తరలింపులో భాగంగా నేలటూరు ప్రధాన గ్రామస్తులకు ఇళ్లు కడుతూ, నేలటూరుపాలెం వారికి ప్లాట్లు చూపించి, దళిత, గిరిజనులకు ఎలాంటి ప్రత్యామ్నాయమూ చూపలేదని పేర్కొన్నారు. సంవత్సరాల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని, నేలటూరుపాలెం వారికి ఒక్కొక్క ఇంటికి, ప్రతీ నెలా రూ.2500, 25 కేజీల బియ్యం, గత ఆరేళ్లుగా అందిస్తున్నా దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వారికి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. వారికీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామం నుండి తరలించే వరకూ దళితులు, గిరిజనులకు జీవనోపాధి కల్పించాలని, నేలటూరు గ్రామ దళిత, గిరిజనులకు ఉపాధి, వైద్యం, నివాస సౌకర్యాలు కల్పించి, న్యాయం చేయాలని కోరారు. నేలటూరు గ్రామస్తులకు మూడేళ్ల క్రితం ఇళ్లు నిర్మించినా ఇంతవరకూ అప్పగించలేదని, వీటిని వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు. మిగిలిన వాళ్లకు స్థలాలు సేకరించినా గృహనిర్మాణం, మౌలిక సదుపాయాలు కల్పించలేదని, దీనిపై విచారించి సత్వర చర్యలు చేపట్టాలని శ్రీనివాసరావు కోరారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేని బడ్జెట్

- కేటాయింపు, వ్యయం మధ్య పెరుగుతున్న అగాధం
- తల్లికి వందనానికి రూ.13 వేల కోట్లకు గాను రూ.9,407కు కుదింపు
- బడ్జెట్‌పై చర్చలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. శాసన మండలిలో సోమవారం బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ... బడ్జెట్‌లో పెద్ద పెద్ద సంఖ్యలతో భ్రమలు కల్పిస్తున్నారే తప్ప పలు అంశాలపై స్పష్టత లేదన్నారు. బడ్జెట్‌లో రూ.80 వేల కోట్లు ద్రవ్య లోటుతో పూడ్చడానికి భారాలు వేస్తారా, ఆస్తులు అమ్ముతారా, మళ్లీ అప్పులు చేస్తారా అని ప్రశ్నించారు. గత ఆర్థిక సంవత్సరానికి గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా రూ.21,966 కోట్లు చూపించారని, ఇప్పుడు దీనిని అమాంతం రూ.32,384 కోట్లుకు పెంచారని, వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.1,04,382 కోట్లు అప్పులు చేస్తామని చెప్పారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ,

ఇతర ఏ పథకాలైనా ఎంత మంది లబ్ధిదారులనే విషయాన్ని బడ్జెట్‌లో స్పష్టం చేయడం లేదన్నారు. పాఠశాల విద్యకు రూ.31,805 కోట్లు కేటాయించారు. 9.86 శాతం మాత్రంగానే ఉంది. తల్లికి వందనం ఈ విద్యా సంవత్సరం అందిస్తామన్నారని, ఇందుకు రూ.13 వేల కోట్లు అవసరం అవుతుందని విద్యార్థుల సంఖ్యను బట్టి అంచనా అని, కేవలం రూ.9,407 కోట్లు మాత్రమే కేటాయించారని చెప్పారు. చదువుకునే ప్రతి విద్యార్థి తల్లికి ఈ పథకాన్ని వర్తింపజేస్తామని బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారని, బిడ్డలు అందరికీ ఇస్తారా, లేక ఒక్కరికే ఇస్తారా అనేది స్పష్టత లేదన్నారు. గత బడ్జెట్‌లో 5,387 కోట్లు కేటాయించినా ఒక్క పైసా ఖర్చు చేయలేదన్నారు. 'మన బడి - మన భవిష్యత్తు'కు రూ.500 కోట్లు కేటాయించినా ఇందులో ఒక్క రూపాయి ఖర్చు చేయలేదన్నారు. ఇప్పుడు వెయ్యి కోట్లు ప్రతిపాదించారని తెలిపారు.

2013-14 నుంచి 2024-25ల మధ్య ఏ ప్రభుత్వమైనా విద్యా రంగానికి బడ్జెట్‌లో కేవలం 10 శాతానికి కొంచెం అటు ఇటుగా మాత్రమే కేటాయిస్తున్నారని చెప్పారు. ప్రైవేటు విద్యా వ్యాపారం 40 నుంచి 45 శాతం జరుగుతుందన్నారు. మరి ఉచిత విద్య ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం రూ.2,800 కోట్లు కావాల్సి ఉండగా, రూ.1,960 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. హాస్టళ్ల నిర్వహణకు రూ.1,100 కోట్లు అవసరమైతే రూ.684 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. బడ్జెట్ కూర్పు అంటే అంకెలు మాత్రమే కాదని, ఆ ప్రభుత్వం చేయదలచిన కీలక నిర్ణయాలు స్పష్టం చేయాల్సి ఉన్నా, అలా చేయలేదన్నారు. సభ దృష్టిలో పెట్టకుండా మంత్రి మండలి నిర్ణయాలతోనే పన్నులు, ఇతర సంస్కరణలు అమలు చేయడాన్ని ఆక్షేపించారు. కేటాయింపులకు, ఖర్చులకు మధ్య అగాధం ఎక్కువగా ఉందన్నారు. ఆదాయ అంచనా నెరవేరే పరిస్థితి లేనందున ద్రవ్య లోటును పెంచేస్తున్నారని చెప్పారు. పన్ను, పన్నేతర ఆదాయం లెక్కలు ఎక్కువగా ఈ బడ్జెట్‌లో ఉన్నాయని చెప్పారు. రెవెన్యూ, ద్రవ్య లోటు, అప్పులు బాగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి బడ్జెట్ ఆదాయం సమకూర్చేది ప్రజలేనని, ప్రభుత్వాలు అప్పులు తెచ్చినా తీర్చేది ప్రజలేనని అన్నారు.

నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసం ఎదురుచూస్తున్నా... బడ్జెట్‌లో స్పష్టత లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య క్రమంగా తగ్గుతుండగా, కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య పెరుగుతుందన్నారు. వీరికి ఏళ్ల తరబడి జీతాల పెంపు లేదన్నారు. దశాబ్దాల తరబడి పని చేస్తున్నవారు రెగ్యులరైజేషన్ ఎప్పుడవుతుందా అని ఎదురు చూస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం 10,117 పోస్టులను రెగ్యులర్ చేస్తామని చెప్పి, కేవలం 4 వేల పోస్టులు మాత్రమే రెగ్యులర్ చేసిందన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. 2019కి ముందు స్కీం వర్కర్స్‌కు మినిమం టైమ్ స్కేల్ అమలు చేసిందని, గత ప్రభుత్వం ఆ విధాన్ని తొలగించిందన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీముల్లో పని చేస్తున్న వారికి మినిమం టైమ్ స్కేల్ వర్తించదని కొత్త జిఒ విడుదల చేయడం దుర్మార్గమన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు గత ప్రభుత్వం తొలగించిన పథకాల విషయం బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. 11వ పిఆర్‌సిని గత ప్రభుత్వం అమలు చేయలేదని రూ.25 వేల కోట్లకుపైగా పిఆర్‌సి బకాయిలు ఉన్నాయని చెప్పారు. 12వ పిఆర్‌సి విషయం ఈ ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. కమిటీ కూడా వేయలేదని తెలిపారు. మెరుగైన పెన్షన్ రూపొందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని ఆ ప్రస్తావన లేదన్నారు. ఉద్యోగులు మాత్రమే కచ్చితంగా పన్నులు చెల్లిస్తారని, అటువంటి వారికి పిఆర్‌సి ఇవ్వకపోవడం సరైంది కాదని అన్నారు. నీటిపారుదలకు సంబంధించి ఏ ప్రాజెక్టు ఎప్పటిలోగా పూర్తి చేస్తామనే స్పష్టత లేదన్నారు. ధరల స్థిరీకరణ రూ.300 కోట్లే చాలా తక్కువన్నారు. భవన నిర్మాణ కార్మికుల నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించిందని, ఈ ప్రభుత్వమైనా ఆ నిధులు వెనక్కి తెచ్చి గతంలో ఇచ్చిన పథకాలు అమలు చేస్తుందా అని ప్రశ్నించారు.

జూన్ నాటికి విద్యా సంస్కరణలు పూర్తి

- అమల్లో భాగస్వామ్యం వహించాలి
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్
- ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాశాఖలో జూన్ నాటికి సంస్కరణలు పూర్తిచేస్తామని, ఆ తర్వాత రాబోయే నాలుగేళ్లు లెర్నింగ్ అవుట్ కమ్స్‌పైనే దృష్టిసారిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారు. సంస్కరణలు పకడ్బందీగా అమలు చేయగలిగితే వచ్చే ఏడాది నుంచే ఫలితాలు ప్రారంభమవుతాయని, వీటిని లాజికల్‌గా ముందుకు తీసుకెళ్లాల్సి ఉందన్నారు. జివో 117 రద్దు, లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్‌ఎపి (లీప్), పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అంశాలపై టిడిపి కూటమి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో ఉండవల్లిలోని తన నివాసంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెజి టు పిజి పాఠ్యపుస్తకాల్లో మార్పులు తీసుకొస్తామని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని, తద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించవచ్చని తెలిపారు. యువగళం పాదయాత్ర చేస్తున్న సమయంలో జివో 117 దుష్ఫలితాల గురించి అనేక మంది నాయకులు తమ దృష్టికి తెచ్చారని చెప్పారు. ఈ జివో రద్దు చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎటువంటి ముందస్తు వ్యూహం లేకుండా సిబిఎస్ఇ, ఐబిల పేరుతో హడావుడి చేశారని విమర్శించారు. సిబిఎస్ఇ పాఠశాలల విద్యార్థులకు మాక్‌టెస్ట్ నిర్వహిస్తే 90శాతం మంది విద్యార్థులు ఫెయిలయ్యారని పేర్కొన్నారు. ఐబి నివేదిక పేరుతోనే రూ.5కోట్లు దుర్వినియోగం చేశారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ నిర్వాకం వల్ల ఐదేళ్లల్లో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లారని చెప్పారు. గత పాలకుల వైఫల్యాన్ని అసర్ నివేదిక తేటతెల్లం చేసిందని తెలిపారు. పిల్లల భవిష్యత్తుతో కూడుకున్న అంశమని ప్రజాప్రతినిధులంతా పాఠశాలలపై దృష్టి పెట్టాలని చెప్పారు. అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే సంస్కరణల అమలు సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి ఫలితాలను సాధించాలని చెప్పారు. ఈ నెలలోనే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటిస్తామన్నారు.

ఉత్తమ పద్ధతుల అధ్యయనానికి విదేశాలకు టీచర్లు

అంతర్జాతీయంగా వస్తున్న మార్పులపై అధ్యయనం చేసేందుకు ఎంపిక చేసిన ఉపాధ్యాయులను పోలాండ్ వంటి ఇతర దేశాలకు పంపుతామని చెప్పారు. దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో నియోజకవర్గానికి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. పాసివ్ లెర్నింగ్ నుంచి యాక్టివ్ లెర్నింగ్‌కు మారాలని చెప్పారు. రాబోయే ఐదేళ్లల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్స్, బెంచిలు, తాగునీరు, టాయ్‌లెట్లు వంటివి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు శాసనసభ్యులు నియోజకవర్గ స్థాయిలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులను సమీకరించి స్కూళ్లలో సౌకర్యాల మెరుగుదలకు కృషి చేయాలని కోరారు. స్కూల్ స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు స్పోర్ట్స్ లీగ్‌లు, సైన్స్‌ఫేర్‌లు నిర్వహిస్తామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ నివారణకు డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో పెద్దఎత్తున ప్రచారం కార్యక్రమాలు, ఈగల్ క్లబ్బులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబానికి విద్య, వైద్యం అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణ మూర్తి, వెంకటేశ్వరరావు, కొండబాబు, పార్థసారథి, బొజ్జల సుధీర్ రెడ్డి, గణబాబు, యార్లగడ్డ వెంకట్రావు, ఆరిమిల్లి రాధాకృష్ణ, జివి ఆంజనేయులు, కాల్వ శ్రీనివాసులు, కూన రవికుమార్ తదితరులు పలు అంశాలపై మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ జివో 117 ప్రత్యామ్నాయ ముసాయిదాను వివరించారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా, సర్వశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు, స్కిల్‌డెవలప్‌మెంట్ ఎండి గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

5న మున్సిపల్ కార్మికుల మహాధర్నా

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలనే డిమాండ్ సాధన కోసం ఈ నెల 5న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న మహాధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. విజయవాడలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... గత ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న హామీని తుంగలో తొక్కి లక్షలాది మంది కార్మికులను దగా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం ఆప్కాస్‌ను రద్దు చేసి లక్షలాది మంది కార్మికుల జీవితాలను ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టాలని నిర్ణయిస్తూ కార్మికులకు తీరని ద్రోహం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు టి.తిరుపతమ్మ, ఎం.విజయలక్ష్మి, పి.శ్రీనివాసరావు, టి.చిన్ని, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం పోరుబాట

- భారీగా తరలివచ్చిన పేదలు
- అడ్డుకున్న పోలీసులు
- తహశీల్దార్ హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఇళ్ల స్థలాల కోసం పేదలు పోరుబాట పట్టారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా, చంటి బిడ్డలను చంకనేసుకుని, జానెడు స్థలం కోసం ఎర్రజెండా నీడన చీమలదండై కదిలారు. ప్రభుత్వ భూమిలో జెండాలు పాతి స్థలాలను స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు జిల్లా కల్లూరు అర్బన్ మండలం పెద్దపాడు, వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన సుమారు రెండువేల మంది పేదలు ఈ పోరుబాటలో పాల్గొన్నారు. చివరికి అధికారులు వచ్చి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అంతకుముందు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, ఎమ్‌డి.ఆనంద్ బాబు, టి.రాముడు, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ నాయకత్వంలో పేదలు స్థానిక పెద్దపాడు దగ్గరలో ఉన్న తాజ్ ఫంక్షన్ హాలు నుంచి సర్వే నెంబర్ 70/2 బిలో ఉన్న ఎడబ్ల్యు ప్రభుత్వ స్థలంలోని ముళ్ల చెట్లను తొలగించి, చదును చేశారు. ఆ ప్రభుత్వ భూమిలో లేఅవుట్లు వేసిన వ్యక్తులు అక్కడికి వచ్చి 'భూమి మాది' అని పేదలను నిలువరించేందుకు ప్రయత్నించారు. ప్రజలు తిరగబడడంతో వారు పోలీసులను దించారు. 'అక్రమార్కులపై చర్యలు తీసుకోండి. మా ఇళ్ల స్థలాల కోసం వచ్చాం' అంటూ ప్రజలు నినదించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా పోలీసులు ప్రవర్తించారు. ఈ తీరును నిరసిస్తూ పోలీసులకు

స్వాధీనం చేసుకున్న భూమిలో ఎర్రజెండాలను పాతిన పేదలు

వ్యతిరేకంగా పేదలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. తమకు రెండు సెంట్ల స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళన స్థలానికి తహశీల్దార్ ఆంజనేయులు వచ్చారు. ఇది ప్రభుత్వ స్థలమేనని, వచ్చిన వాళ్లంతా అర్హులయితే ఆధార్ కార్డులతో పాటు అప్లికేషన్ ఇవ్వాలని ఆయన కోరారు. అర్హులని తేలితే ఇక్కడే లే అవుట్ వేసి రెండు సెంట్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ... ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇప్పటికే అనేక దఫాలు మూకుమ్మడిగా, వ్యక్తిగతంగా అర్జీలు ఇచ్చామని, స్థలాలు ఇవ్వలేదని తెలిపారు. తహశీల్దార్ మాట మేరకు మరోసారి అర్జీలు ఇస్తామని, వెంటనే లే అవుట్ వేసి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు గురుశేఖర్, నగేష్, ఎన్.అలివేలు, అరుణ, పేదలు పాల్గొన్నారు.

సమస్యలపై 5, 9 తేదీల్లో నిరసనలు, 11న విజయవాడ లో దీక్ష

- సమగ్ర శిక్షా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమ్మెకాలపు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఎపి సమగ్రశిక్షా కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావుకు ఫెడరేషన్ చైర్మన్ బి కాంతారావు, ప్రధాన కార్యదర్శి యు కల్యాణి సోమవారం లేఖ రాశారు. 2023 డిసెంబర్ 20వ తేది నుంచి 2024 జనవరి 10వ తేది వరకు సమ్మె నిర్వహించామని గుర్తుచేశారు. హెచ్‌ఆర్ పాలసీ అమలుకై కమిటీని ఏర్పాటు చేయాలని, మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలు, ఇతర సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని కోరుతూ వివిధ నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 5, 9వ తేదీల్లో మండల కేంద్రంలో, కెజిబివి స్కూళ్ల వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో సామూహిక నిరసన తెలియజేయాలని, 11వ తేదిన విజయవాడ కేంద్రంలో నిరసన దీక్ష చేపట్టాలని నిర్ణయించినట్లు వివరించారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు 20న పోలింగ్

- నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎంఎల్‌ఎ కోటాలోని ఐదు ఎంఎల్‌సి స్థానాలకు ఈ నెల 20వ తేది పోలింగ్ జరగుంది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ సోమవారం విడుదలైంది. ఈ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10వ తేది వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఈనెల11న నామినేషన్లపరిశీలన, 13న నామినేషన్లకు ఉపసంహరణకు గడువుగా ప్రకటించారు. ఈనెల 20న పోలింగ్ జరుగనుంది. అదే రోజు సాయంత్రం కౌటింగ్ నిర్వహిస్తారు. ప్రస్తుతం ఎంఎల్‌సిలుగా ఉన్న జంగం కృష్ణమూర్తి, దువ్వారపు రామారావు, పరుచూరి అశోక్‌బాబు, బి.తిరుమలనాయుడు(బిటినాయుడు), యనమల రామకృష్ణుడు పదవి కాలం ముగియనుండటంతో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. శాసనసభలో ప్రస్తుతం కూటమికి ఉన్న సంఖ్యా బలం ఈ ఐదు స్థానాలు కూడా ఏకగ్రీవం కానున్నాయి. వైసిపికి సంఖ్యా బలం లేని కారణంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి ఆ పార్టీకి లేదు. విశ్వసనీయ సమాచారం మేరకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన నేత నాగబాబుకు ఎమ్మెల్సీ బెర్త్ ఖరారైనట్లు సమాచారం. మిగిలిన మడూ స్థానాలకు బరిలో దింపే అభ్యర్థుల కోసం కసరత్తు జరుగుతోంది.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ భేటీ:

శాసనసభ జరుగుతున్న సమయంలో చంద్రబాబునాయుడు,పవన్‌కల్యాణ్ సభనుంచి బయటకు వెళ్లారు. అసెంబ్లీ ఆవరణలోనే వీరిద్దరూ సుమారు ఒక గంటపాటు పాటు సమావేశమయ్యారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో బరిలోకి దింపే అభ్యర్థుల గురించే వీరి మధ్య చర్చ జరిగినట్లు భావిస్తున్నారు.

పాఠశాలలు, కళాశాలల్లో వసతుల కల్పన

- ప్రభుత్వాన్ని కోరిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు
- 'ప్రత్యేక ప్రస్తావన'లో ప్రభుత్వ దృష్టికి పలు సమస్యలు
- లైవ్ ప్రసారాల నిలిపివేత సరికాదు : బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలలు, కళాశాలల్లో కనీస వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు కోరారు. శాసన మండలిలో సోమవారం నిర్వహించిన 'ప్రత్యేక ప్రస్తావన'లో ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. గత ఏడాది ఇందుకు రూ.500 కోట్లు కేటాయించినా ఒక్క రూపాయి ఖర్చు చేయలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

మున్సిపాలిటీలలో కంటింజెన్స్ ఉద్యోగులకు నెలకు కేవలం రూ.4 వేలు వేతనం చెల్లిస్తున్నారని అవి కూడా 8 నెలలుగా పెండింగ్ పెట్టిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, వీరికి జీతం బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన 9 నెలలైనా ఉద్యోగులకు ఇవ్వాల్సిన పిఆర్సీ అమలు చేయలేదని సభ్యులు ఎం.వి రామచంద్రారెడ్డి అన్నారు. ఉద్యోగులకు డిఎ, ఐఆర్, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సిఎం తనకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓట్లు వేసి గెలిపించారని చెప్పి, వారి సమస్యలనే పరిష్కరించడం లేదన్నారు.

ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల ప్రజలకు నీటిని అందించే కాలువలో గుర్రపు డెక్క నిండిపోయిందని ఫలితంగా ప్రజలకు నీరు అందని పరిస్థితి నెలకొందని సభ్యులు వంకా రవీంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. కాలువలో గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

శాసన మండలి మీడియా లైవ్ ప్రసారం నిలిపివేయడం సరికాదని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే మీడియా కమిటీ సమావేశం నిర్వహించి చర్చించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు 11వ పిఆర్సీ వెంటనే అమలు చేయాలని సభ్యులు బొర్రా గోపిమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. బకాయిలు చెల్లించాలని, కొత్త పిఆర్‌సిని ఏర్పాటు చేయాలన్నారు.

నెల్లూరు సిటీలో చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద నేషనల్ హైవేను దాటడం చాలా సమస్యగా ఉందని సభ్యులు పి.చంద్రశేఖర్ ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ జంక్షన్‌లో ఫ్లైఓవర్, సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు.

జనసేనలోకి దొరబాబు?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిప్యూటీ సిఎంపవన్‌కల్యాణ్‌తో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే దొరబాబు సోమవారం జనసేన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జనసేనలోచేరేందుకు ఆయన ఆసక్తి చూపారు. అందుకు పవన్‌కల్యాణ్ గ్రీన్ సిగ్నల్‌ఇచ్చారు. ఈనెలలో పిఠాపురంలో జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జనసేనలో చేరుతారా లేక మరొక తేదీని కేటాయిస్తారా అనేది తెలియాల్సిఉంది.

విధ్వంసం నుంచి వికాసం వైపు

- బడ్జెట్‌పై చర్చలో పలువురు ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత వైసిపి పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ప్రస్తుతం వికాసం వైపు రాష్ట్ర ప్రయాణం సాగుతోందని బడ్జెట్‌పై సోమవారం అసెంబ్లీలో జరిగిన చర్చల్లో పాల్గొన్న పలువురు ఎంఎల్‌ఏలు అన్నారు. పేదరికంలోని సమాజాన్ని రూపొందించేందుకు కృషి సాగుతోందని చెప్పారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ 2047 విజన్ డాక్యుమెంట్‌తో ప్రణాళికా బద్ధంగా సంక్షేమం- అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్లే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు .పోలవరం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.12వేలకోట్లు సహకారం అందించిందని చెప్పారు. అనకాపల్లి ఎంఎల్‌ఏ కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో కిడ్నీ, క్యాన్సర్‌తో అనేకమంది చనిపోతున్నారని, ఈ నేపథ్యంలో మరణాలను నివారించేందుకు , రోగులకు మెరుగైన వైద్య సౌకర్యం అందించేందుకు వీలుగా విజయనగరంలో క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఈ బడ్జెట్‌లో రూ.600కోట్లు ప్రతిపాదించడం శుభపరిణామమని చెప్పారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ఆదరణ పథకం చేతి వృత్తుల వారికి ఎంతో ఉపయోగపడుతుందని, టిడిపి అంటేనే బిసిల పార్టీ అని చెప్పారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవానికి ఆర్థిక పరిపుష్టి కలిగించే విధంగా బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు. బడ్జెట్‌లో బిసిసంక్షేమంతో పాటు మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు.

తెలుగు అకాడమీలో సంస్కృతాన్ని విడదీయాలి: మండలి బుద్ధప్రసాద్

తెలుగు అకాడమీలో గత ప్రభుత్వం సంస్కృతాన్నికలిపిందని, తక్షణమే తెలుగు అకాడమీ నుంచిసంస్కృతాన్ని విడదీయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రభుత్వానికిసూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరినీ దృష్టిలోపెట్టుకుని తెలుగు భాష అభివృద్ధికిచర్యలు చేపట్టాలన్నారు. . మాతృభాష తెలుగు అభివృద్ధికి బడ్జెట్‌లో తొలిసారిగా రూ.10కోట్లు కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. జగన్ హయాంలో రద్దయిన అకాడమీలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని మండలి బుద్ధప్రసాద్ కోరారు. చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. బడ్జెట్‌పైజరిగిన చర్చలో ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, రామాంజనేయులు, మాధవీరెడ్డి, నడికుదిటి ఈశ్వరరావు, ఎ.రాధాకృష్ణ , డాక్టర్ పార్థసారధి మాట్లాడారు.

అనారోగ్యంతో భర్త మృతి

- జీర్ణించుకోలేక భార్య ఆత్మహత్య

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం మండలం కొటిపిలో సోమవార విషాద ఘటన చోటు చేసుకుంది. అనారోగ్యంతో భర్త మరణించడంతో దానిని జీర్ణించుకోలేక భార్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొటిపి గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి (71), భాగ్యమ్మ (60) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. తిమ్మారెడ్డి తనకున్న మూడెకరాల భూమిలో పెద్ద కుమారుడి సహకారంతో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండో కుమారుడు బెంగళూరులోని ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. తిమ్మారెడ్డి సోమవారం నాడు ఇంటి నుంచి బయటకు వెళ్లి కొంతసేపటి తర్వాత తిరిగి ఇంటికొచ్చారు. ఇంటికి రావడంతోనే అలసటగా ఉందంటూ కింద కూర్చొన్నారు. కూర్చొన్న చోటే ఒక్కసారిగా తిమ్మారెడ్డి కుప్పకూలి మరణించారు. భర్త మరణాన్ని జీర్ణించుకోలేని భార్య భాగ్యమ్మకు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. గంటల వ్యవధిలో భార్యాభర్తలిద్దరూ మరణించడంతో ఆ ప్రాంతంలో విషాదం అలముకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు రోడ్డెక్కే పరిస్థితి తీసుకురావద్దు

- ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- నిబంధనలను సడలించి ఆదుకోవాలి : వి శ్రీనివాసరావు

సొసైటీ సిఇఒతో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కోవూరు (నెల్లూరు జిల్లా)

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి ధాన్యం గింజా కొంటామంటూ ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పిన మాటలకు, ఆచరణకు పొంతన లేకుండా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలను సడలించి రైతులను ఆదుకోవాలని కోరారు. నెల్లూరు జిల్లా కోవూరులోని పడుగుపాడు సహకార పరపతి సంఘంలో సోమవారం ఆయన రైతులతోనూ, సొసైటీ ఇన్‌ఛార్జితోనూ ఆయన ప్రత్యేకంగా చర్చించారు. అనంతరం వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినా అవి రైతులకు ఏ మాత్రమూ ఉపయోగపడడం లేదన్నారు. దీంతో, ప్రయివేట్ వారికి ధాన్యం అమ్ముకోవాల్సి వస్తోందని తెలిపారు. మిల్లర్లు కుంటిసాకులు చెప్పి ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం పుట్టి (850 కిలోలు) ధాన్యానికి రూ.19,720 చెల్లించాల్సి ఉందని తెలిపారు. మిల్లర్లకు రూ.17 వేలకే అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. దీంతో, రైతులు పుట్టి ఒక్కంటికీ రూ.2,700 చొప్పున నష్టపోతున్నారని తెలిపారు. ఎకరాకు పది వేల రూపాయలకుపైగా నష్టపోవాల్సి వస్తోందని వివరించారు. మార్కెటింగ్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద రాష్ట్ర బడ్జెట్లో రూ.300 కోట్ల మాత్రమే కేటాయించడం శోచనీయమన్నారు. ఆ మొత్తం ఏ మూలకూ చాలదని తెలిపారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు అనేక కష్టనష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే రైతు సేవా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఆ పరిస్థితి రాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలె వెంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాధానం చెప్పలేక ఎదురుదాడి

- రుషికొండలో తప్పు జరిగితే బిల్లులు ఎలా ఇచ్చారని ప్రశ్న : బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడ్జెట్‌పై శాసనమండలిలో జరిగిన చర్చలో విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఎదురుదాడికి దిగారని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. సమావేశం వాయిదా పడిన అనంతరం అసెంబ్లీ బయట మీడియా ప్రతినిధులతో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సచివాలయం, అసెంబ్లీ భవనాలు తాత్కాలికం కాదంటూనే మరోవైపు కొత్త భవనాలకు టెండర్లు పిలవడం కూటమి పార్టీల ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి అధికార పార్టీ వారికే పనిచేయాలని చెప్పిన అంశాన్ని లేవనెత్తితే వక్రీకరించమని అంటున్నారని, అదే విషయాన్ని అధికారికంగా చెప్పాలని కోరితే ముందుకు రావడం లేదని అన్నారు. స్వతంత్ర దేశంలో సిఎం స్థానంలో ఉన్న ఏ వ్యక్తీ ఇంతవరకు ఇలా మాట్లాడలేదని విమర్శించారు. అలా మాట్లాడటం భావ్యం కాదని, అన్ని పార్టీల్లోనూ లబ్ధిదారులు ఉంటారని, వారికి పార్టీలను ఆపాదించడం ఏ తరహా న్యాయమని అన్నారు. రుషికొండలో ప్రపంచ ప్రమాణాలతో అద్భుతమైన భవనాలు నిర్మిస్తే ప్రజాధనం వృథా అధికార దుర్వినియోగం అని గగ్గోలు పెట్టిన కూటమి నాయకులు ఒక్కో చదరపు అడుగుకు రూ.10,500 వెచ్చించి తాత్కాలిక భవనాలు నిర్మించడం అవినీతి చేయడం కాదా అని ప్రశ్నించారు. రుషికొండపై అవినీతి, తప్పులు ఉంటే దాని కాంట్రాక్టరుకు బిల్లులు ఎందుకు చెల్లించారని ప్రశ్నించారు. తప్పు జరిగితే విచారణ జరిపి శిక్షించాలని డిమాండు చేశామని, దీనిపై దాటవేత ధోరణితో ప్రభుత్వం వ్యవహరిస్తోందని చెప్పారు. టిడిపి అధికారంలో ఉన్న సమయంలో రూ.1.19 లక్షల కోట్లతో అమరావతి ప్లాను వేశారని, కానీ ఆరువేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. అంత పెద్ద ఖర్చుతో రాజధాని నిర్మించాలంటే సాధ్యం కాదనే ఉద్దేశంతో ఖాళీగా ఉన్న భూములను చూసి వల్లకాడు అనే నానుడి వాడినట్లు చెప్పారు.

మహా కుంభమేళాకు దీటుగా 2027 జులైలో గోదావరి పుష్కరాలు

- అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహాకుంభ మేళాకు ధీటుగా గోదావరి పుష్కరాలను 2027 జులై 23 నుండి ఆగస్టు మూడోతేదీవరకూ జరపనున్నామని, ముఖ్యమంత్రి ఆశయం కూడా అదేనని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు ఆదిరెడ్డివాసు, ముప్పిడి వెంకటేశ్వరరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చే సమయంలో మంత్రి ప్రకటన చేశారు. పుష్కరాల కోసం ఇప్పటి నుండే శాఖల మధ్య సమన్వయంతో ముందుకెళతామని పేర్కొన్నారు. 12 రోజులుపాటు జరిగే పుష్కరాల్లో స్నానం ఆచరిస్తే 12 సంవత్సరాలు పాటు 12 నదుల్లో స్నానం చేసిన పుణ్యం దక్కుతుందనేది నమ్మకమని మంత్రి తెలిపారు. దేశంలో గంగానది తరువాత అంత ప్రాసశ్త్యం ఉన్న నది గోదావరని పేర్కొన్నారు. రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ ఇటీవల రాజమండ్రిలో పుష్కరాల సన్నాహక సమావేశం నిర్వహించామని తెలిపారు. 2003, 2015లోనూ గోదావరి పుష్కరాలు చంద్రబాబునాయుడు ఆధ్వర్యానే జరిగాయని చెప్పారు. తూర్పుగోదావరిలో 3625 మీటర్ల పొడవున 145 ఘాట్లను గుర్తించినట్లు చెపేత్పారు. పశ్చిమగోదావరి జిల్లాలో 2452 మీటర్ల పొడవున 98 ఘాట్లను గుర్తించామని వివరించారు. వాటి నిర్మాణం నీటి నిర్వహణ జలవనరులశాఖ చూస్తుందని, ఇతర అంశాలన్నీ పంచాయతీరాజ్‌శాఖ చూస్తుందని అన్నారు. అలాగే హోమ్, ఎండోమెంట్, పురపాలకశాఖ, ఆర్‌అండ్‌బి, ఫిషరీస్, పౌరసరఫరాలు, పర్యాటకశాఖలు కూడా పాలు పంచుకుంటాయని పేర్కొన్నారు. రాజమండ్రిలో 1.2 కిలోమీటర్ల పొడవున్న కోటి లింగాల రేవుఘాట్లో శాశ్వత ప్రాతిపదికన పనులు చేయాలని ఆదిరెడ్డి వాసు కోరారు. పుష్కరాలను రాజమండ్రికే కాకుండా కోనసీమ ప్రాంతంలోని గోదావరి పాయలకూ విస్తరిస్తే తాకిడిని తగ్గించవచ్చని అన్నారు. కొవ్వూరు గోస్పాద క్షేత్రానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పుష్కరాలకు వెళ్లే దారులన్నీ ఇప్పటి నుండే బాగు చేయాలని కోరారు. నిడదవోలు, రాజమండ్రి రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపదికన చేయాలని కోరారు.

క్వింటాలు మిర్చికి రూ.25 వేలు ఇవ్వాల్సిందే

- కలెక్టరేట్ వద్ద ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

క్వింటాలు మిర్చికి రూ.25 వేల ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోళ్లు చేయాలని కోరుతూ ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతి బాబు మాట్లాడుతూ.. వాతావరణ అననుకూల పరిస్థితులు, చీడపీడల వల్ల మిర్చి ఎకరాకు ఐదు నుంచి పది క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాలు ధర రూ.11,781 గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదని తెలిపారు. ప్రభుత్వం ధర నిర్ణయించిన తరువాత ధరలు మరింత దిగజారాయన్నారు. రైతుకు ఎకరాకు రూ.లక్ష నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. మిర్చికి గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధర శాస్త్రీయంగా లేదన్నారు. గత ఏడాది పండించిన పంట కూడా రైతాంగం కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేశారని, ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కొనుగోలు చేస్తే వారు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు. ప్రభుత్వం చొరవ చూపి క్వింటాలు రూ.25 వేలు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతును ఆదుకునేందుకు రూ.2500 కోట్ల రూపాయలు అవసరం కాగా అన్ని పంటల రైతులకు బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించడం వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రక్రియలో భాగమని విమర్శించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం వెలుపల మీడియాతో మాట్లాడుతున్న లక్ష్మణరావు

టిడిపి అరాచకాలపై ఫిర్యాదు

- కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో అక్రమాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపును గుంటూరు ఎసి కళాశాలలో సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో లక్ష్మణరావు మాట్లాడుతూ... పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల్లోకి ఎమ్మెల్యేలు అక్రమంగా వెళ్లారని, నిబంధనల విరుద్ధంగా వారు సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. టిడిపి నాయకులు దొంగ ఓట్లు వేయించి, రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, గతంలో ఎప్పుడూ లేని విధంగా పట్టభద్రుల ఎన్నికల్లో అధికార పార్టీ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. వీటిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. టిడిపి ఎన్ని అక్రమాలకు పాల్పడినా ప్రజలు, ప్రజా సంఘాలు, పట్టభద్రుల మద్దతు తనకు ఉందని అన్నారు.

కాకినాడలో బాణసంచా పేలుడు

- ఐదుగురు కార్మికులకు గాయాలు
- వారిలో ఒకరి పరిస్థితి విషమం
- సరుకులు అన్‌లోడ్ చేస్తుండగా ఘటన

తీవ్రంగా గాయపడిన గజ్జల మద్దిలేటి

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాకినాడ వార్పు రోడ్డు ప్రాంతంలో బాలాజీ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో బాణసంచాను వ్యాన్ నుంచి అన్‌లోడ్ చేస్తుండగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మికులు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. తోటి కార్మికులు,, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... హైదరాబాద్ నుంచి సరుకులతో ఒక వ్యాన్ బాలాజీ ట్రాన్స్‌పోర్టుకు వచ్చింది. వ్యాన్ నుంచి ప్యాకింగ్‌తో ఉన్న సామగ్రిని కార్మికులు కిందికి దింపుతున్నారు. ప్యాకింగ్‌లో ఏముందో తెలియని కార్మికులు ఎప్పటిలానే వ్యాన్ నుంచి దింపి భుజంపై నుంచి కింది వేశారు. ఈ సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పెద్ద శబ్ధం రావడంతో కార్మికులు భయంతో పరుగులు తీశారు. పేలుడుకు దగ్గరగా ఉన్న కార్మికులు గజ్జల మద్దిలేటి, బొండు అశోక్, మేడిశెట్టి లోవరాజు, దారా నాగేష్, బొందల పోతురాజు గాయపడ్డారు. వారిని తోటి కూలీలు 108లో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. వీరిలో మద్దిలేటి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌పి బిందుమాధవ్, ఎస్‌డిపిఒ దేవరాజ్ పటేల్ బాలాజీ పరిశీలించి ఘటనపై వివరాలు సేకరించారు. బాణసంచా సామగ్రి వల్లే ఈ పేలుడు సంభవించినట్టు నిర్ధారణకు వచ్చి ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీపై కేసు నమోదు చేశారు. ఎస్‌పి మాట్లాడుతూ పేలుడు పదార్థాలను అనుమతి లేకుండా తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో కాకినాడ జిల్లా వ్యాప్తంగా కొరియర్, ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీల్లో తనిఖీలు చేపట్టామని చెప్పారు.

కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి : సిఐటియు

బాలాజీ ట్రాన్స్‌పోర్టులో జరిగిన పేలుడు ప్రమాదంలో గాయపడిన కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలని, నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది. కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న కార్మికులకు సిఐటియు నాయకులు మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, మెస్ కృష్ణ పరామర్శిం చారు. పేలుడు పదార్థాల పార్శిల్ బుక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తనిఖీలు నిర్వహించాలని కోరారు.

రిలయన్స్, టాటా మోటార్స్ షేర్లు డీలా

- దలాల్ స్ట్రీట్‌ను వీడని నష్టాలు
- సెన్సెక్స్ 112 పాయింట్ల పతనం
- ఏడాది కనిష్టానికి 1100 స్టాక్స్

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. ట్రంప్ టారీఫ్ దెబ్బలకు తోడు భారత మార్కెట్లు, ఆర్థిక వ్యవస్థల్లో ఎలాంటి సానుకూల అంశాలు కానరాకపోవడంతో విదేశీ సంస్థాగత మదుపర్లు తమ పెట్టుబడులను తరలించుకుపోతున్నారు. ఈ పరిణామాలతో రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్ సహా దాదాపు 1100 స్టాక్స్ ఏడాది పైగా కనిష్టానికి పడిపోవడం మార్కెట్ల తీవ్ర ప్రతికూల పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. ఎఫ్ఐఐల విక్రయాలకు తోడు దేశీయంగా జిడిపి అంచనాలు పడిపోవడం, రూపాయి విలువపై ఒత్తిడి తదితర పరిణామాలు దలాల్ స్ట్రీట్‌ను ప్రభావితం చేస్తోన్నాయి. ఈ నేపథ్యంలోనే సోమవారం సెషన్‌లోనూ అమ్మకాల పరంపర కొనసాగింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, రిలయన్స్, అదానీ పోర్ట్స్ తదితర షేర్ల ఒత్తిడితో బిఎస్ఇ సెన్సెక్స్ ఓ దశలో 73వేల దిగువకు జారుకుంది. 112 పాయింట్ల నష్టంతో 73,085కి పడిపోయింది. ఇంట్రాడేలో 73,650-72,785 మధ్య కదలాడింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 5 పాయింట్లు తగ్గి 22,119 వద్ద ముగిసింది. దీంతో ఎన్ఎస్ఇ వరుసగా తొమ్మిదో సెషన్‌లోనూ నష్టాలు చవి చూసినట్లయ్యింది. గడిచిన ఐదు నెలల్లో విదేశీ మదుపర్లు రూ.3 లక్షల కోట్ల పైగా విలువ చేసే ఈక్విటీను విక్రయించారు. సెన్సెక్స్-30లో రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, అదానీ పోర్ట్స్, మారుతి సుజుకి ఇండియా, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌యుఎల్, సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్ తదితర స్టాక్స్ అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు అల్ట్రాటెక్ సిమెంట్, భారతీ ఎయిర్‌టెల్, ఎన్‌టిపిసి, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, లార్సెన్ అండ్ టర్బో, ఎస్‌బిఐ తదితర స్టాక్స్ లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ దాదాపు 15 నెలల కనిష్టానికి పడిపోయింది. సోమవారం సెషన్‌లో ఓ దశలో 3 శాతం పతనమై రూ.1,161.40 కనిష్టానికి దిగజారింది. తుదకు 2.17 శాతం నష్టంతో రూ.1,174 వద్ద ముగిసింది. ఈ స్టాక్ ఫిబ్రవరి 10 నుంచి ఇప్పటి వరకు దాదాపు పది శాతం నష్టపోయింది. ఈ సూచీ 2023 నవంబర్ 13 నాటి కనిష్ట స్థాయి వద్ద ట్రేడింగ్ అవుతోంది. టాటా మోటార్స్, ఆసియన్ పెయింట్స్, ఎస్‌బిఐ, హెచ్‌యుఎల్, టైటన్, డిమార్ట్, డాక్టర్ రెడ్డీస్, యెస్ బ్యాంక్, బ్రిటానియా తదితర షేర్లు 52 వారాల కనిష్ట స్థాయిని తాకాయి.

అరతులం బంగారం కోసం యాచకురాలి హత్య

ప్రజాశక్తి- నరసన్నపేట (శ్రీకాకుళం జిల్లా)

వృద్ధ యాచకురాలిని హత్య చేసి ఆమె మెడలోని అర తులం బంగారాన్ని అపహరించిన ఘటన శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నరసన్నపేటలోగల కామేశ్వరి నగర్‌లోని సత్యనారాయణస్వామి ఆలయం వద్ద గున్నమ్మ పువ్వులు కోస్తూ ఆలయం వద్ద పెట్టేది. అనంతరం ఆలయం వద్ద భిక్షాటన చేస్తూ జీవనం సాగించేది. ఎప్పట్లానే సోమవారం వేకువజామున పువ్వులు కోయడానికి వెళ్లిన గున్నమ్మను అగంతకులు 200 మీటర్ల దూరం వరకు ఈడ్చుకుంటూ తీసుకెళ్లి ఆమె వద్ద ఉన్న అర తులం బంగారాన్ని లాక్కొని హత్య చేశారు. ఉదయాన్నే విగతజీవిగా పడి ఉన్న ఆమెను స్థానికులు చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించగా, డాగ్ స్క్వాడ్ బృందాల సహాయంతో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఘటనా స్థలాన్ని ఎస్‌పి కెవి.మహేశ్వరరెడ్డి, ఎఎస్‌పి కెవి.రమణ పరిశీలించారు. కేసు విచారణ వేగవంతం చేసి నిందితుడిని త్వరగా అరెస్టు చేయాలని ఆదేశించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుమారుడు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు.

మోకాళ్లపై కూర్చొని దండం పెడుతూ నిరసన తెలుపుతున్న గిరిజనులు

కల్యాణ్ బాబూ.. మా ఊరికి రోడ్డు వేయరూ..

- మోకాళ్లపై గిరిజనుల నిరసన

ప్రజాశక్తి - దేవరాపల్లి (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేట గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలంటూ సోమవారం గిరిజనులు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. మోకాళ్లపై కూర్చొని.. చేతులెత్తి దండం పెడుతూ.. 'పవన్ కల్యాణ్ బాబూ.. మా గ్రామానికి రోడ్డు వేయవూ..' అంటూ వేడుకున్నారు. వారి ఆందోళనకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మద్దతు తెలిపి మాట్లాడారు. గతంలో ఈ గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులు రోడ్డు సౌకర్యం లేక, మెరుగైన వైద్యం అందక వారం రోజుల వ్యవధిలో మృతి చెందారని తెలిపారు. వీరభద్రపేట జంక్షన్ నుంచి చింతలపూడి మెయిన్ రోడ్డు వరకూ కిలోమీటరు దూరం మేర కనీసం గ్రావెల్ రోడ్డు వేయాలని గిరిజనులు వేడుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. రోడ్డు వేయాలని గిరిజనులు గతేడాది సెప్టెంబర్‌లో బురదలో కూర్చొని నిరసన తెలపగా అధికారులు హుటాహుటిన గ్రామాన్ని సందర్శించి సిసి రోడ్లుకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలియజేశారన్నారు. నేటికీ వాటికి అతీగతీ లేదన్నారు. రోడ్డు సౌకర్యం కల్పిస్తే అనంతగిరి మండలంలోని సొలబంగి, వలసల గరువు, పాటిగరువు గ్రామాల గిరిజనులకు కష్టాలు తీరుతాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ఓట్లు కోసం హామీల వర్షం కురిపిస్తున్న నేతలు.. గెలిచాక వారిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటించి ప్రతి గ్రామానికీ రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్న మాట హామీగానే మిగిలిందన్నారు. డోలీ మోతలు నిత్యకృత్యంగా మారాయని తెలిపారు. తక్షణమే టిడిపి కూటమి ప్రభుత్వం స్పందించి వీరభద్రపేట గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆ గిరిజన గ్రామాన్ని సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జె.ఈశ్వరరావు, తామర్ల కుమార్, బచ్చల రమణ, గమ్మెల శ్రీను, దిప్పల దేముడు, గమ్మెల సింహాచలం, గమ్మెల రాజు, గమ్మెల దేముడు, కాకర గంగరాజు పాల్గొన్నారు.

హైకోర్టుకు సెబీ మాజీ చీఫ్ మాధబి

ముంబయి : స్టాక్ మార్కెట్ మోసాలు, నియంత్రణ సంబంధిత ఉల్లంఘనల కేసులో సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధబి పురి బుచ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ముంబయి ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించారు. మాధబి, సహా మరో ఐదుగురిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని ఎసిబిని ముంబయి ప్రత్యేక కోర్టు శనివారం ఆదేశించిన విషయం తెలిసిందే. దీనిపై మాధబి, సెబీ హోల్ టైమ్ సభ్యులు అశ్వని భాటియా, అనంత్ నారాయణ్ జి, కమలేష్ చంద్ర వర్ష్ణీ, బిఎస్ఇ చైర్మన్ ప్రమోద్ అగర్వాల్, సిఇఒ సుందరరామన్ రామమూర్తిలు హైకోర్టులో వ్యక్తిగతంగా పిటిషన్లు దాఖలు చేశారు. వీరు దాఖలు చేసిన పిటిషన్లను బాంబే హైకోర్టు అత్యవసర విచారణకు స్వీకరించింది. రేపు వీటిపై విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. మంగళవారం వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు న్యాయమూర్తి శివ కుమార్ డిగే ఎసిబి వర్గాలను ఆదేశించారు. మాధబి నియంత్రణకు సంబంధించిన లోపాలు జరిగినట్లు, కుమ్మక్కు అయినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని, వీటిపై న్యాయమైన, నిష్పాక్షిక దర్యాప్తు అవసరమని ప్రత్యేక కోర్టు అభిప్రాయపడిన విషయం తెలిసిందే. ఓ కంపెనీని స్టాక్ ఎక్స్చేంజ్‌లో మోసపూరితంగా లిస్టింగ్ చేశారని, ఇదంతా రెగ్యులేటరీ అథారిటీస్ చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విక్రయానికి గురైన మరో బాబు గుర్తింపు

- మహిళా, శిశు సంక్షేమ విభాగానికి అప్పగింత

ప్రజాశక్తి - విజయవాడ

పిల్లలను విక్రయించిన కేసులో ఎన్‌టిఆర్ జిల్లా పోలీసులు సోమవారం మరో బాబుని గుర్తించారు. నగర పోలీస్ కమిషనర్ ఎస్‌వి రాజశేఖర బాబుకు వచ్చిన పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎడిసిపి ఎ శ్రీనివాసరావు పర్య వేక్షణలో ఎసిపి కె లతాకుమారి, నార్త్ ఎసిపి స్రవంతి రాయ్ ఆధ్వర్యాన టాస్క్‌ఫోర్స్, నున్న ఇన్‌స్పెక్టర్ తమ సిబ్బందితో కలిసి మార్చి 1న పిల్లలను విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేశారు. ఐదుగురు మహిళలు ఓ ముఠాగా ఏర్పాడి చిన్న పిల్లలను విక్రయించడానికి పాల్పడేవారు. సులభంగా డబ్బులు సంపాదించడం కోసం పిల్లలు లేని వారిని, సంతానలేమితో బాధప డుతున్న వారిని ఈ ముఠా లక్ష్యంగా చేసుకుంది. దీంతో అందిన సమాచారం మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. వారిని అరెస్టు చేసి విచారిం చారు. అక్రమంగా విక్రయించడానికి ఉంచిన ముగ్గురు పిల్లలను శనివారం స్వాధీనం చేసుకు న్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆదివారం ఒక పాపను గుర్తించారు. సోమవారం మరో బాబును పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ప్రాంతంలో కని పెట్టారు. ఎసిపి కె లతాకుమారి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్, మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు ఈ రెస్క్యూ ఆపరేషణ నిర్వహించారు. గుర్తించిన బాబును మహిళా, శిశుసంక్షేమానికి అప్పగించారు.

హీరో మోటో అమ్మకాలు 17 శాతం పతనం

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహనాల కంపెనీ హీరో మోటో కార్ప్ అమ్మకాలు అమాంతం పడిపోయాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎగుమతులతో కలుపుకుని ఆ కంపెనీ విక్రయాలు 17 శాతం క్షీణించి 3,88,068 యూనిట్లుగా నమోదయ్యాయి. 2024 ఇదే నెలలో 4,68,410 యూనిట్లను విక్రయించింది. గడిచిన ఫిబ్రవరిలో ఈ కంపెనీ దేశీయ అమ్మకాలు 3.57 లక్షల యూనిట్లుగా నమోదు కాగా.. 2024 ఇదే నెలలో 4.45 లక్షల యూనిట్లను విక్రయించింది. ఇదే నెలలో 23,153 యూనిట్ల ఎగుమతులు జరగ్గా.. గడిచిన ఫిబ్రవరిలో 30,772 యూనిట్లకు పెరగడం ఆ కంపెనీకి కొంత ఉపశమనం కలిగించాయి.

మార్కెట్లోకి షార్ప్ కొత్త ఎసి ఆవిష్కరణలు

హైదరాబాద్ : జపాన్‌కు చెందిన ప్రముఖ గృహోపకరణాల కంపెనీ షార్ప్ బిజినెస్ సిస్టమ్స్ (ఇండియా) మార్కెట్లోకి ఎయిర్ కండీషనింగ్ టెక్నాలజీలో సరికొత్త ఆవిష్కరణలను విడుదల చేసినట్లు తెలిపింది. భారత మార్కెట్లోకి రిర్యూ, సీర్యో, ప్లాస్మా చిల్ సిరీస్‌లతో అడుగుపెడుతున్నట్లు షార్ప్ బిజినెస్ సిస్టమ్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఒసాము నరిటా వెల్లడించారు. ఈ అధునాతన ఎయిర్ కండిషనర్లు అసమానమైన శీతలీకరణ పనితీరు, శక్తి సామర్థ్యంతో వినియోగదారుల విభిన్న అవసరాలను తీర్చనున్నాయన్నారు. వీటి ప్రారంభ ధరలు రిర్యూ సీరిస్‌లో రూ.39,999, సెరియోలో రూ.32,499, ప్లాస్మా చిల్‌లో రూ.32,999గా ఉంటాయన్నారు.

సంపాదకీయం

ప్రజలకు నిరాశ

టిడిపి కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్ ప్రజల ఆశలు ఆకాంక్షలపై నీళ్లుచల్లింది. అభివృద్ధి, సంక్షేమం తమకు రెండు కళ్లని సర్కారు పేర్కొనగా బడ్జెట్ కేటాయింపులు అందుకు తగ్గట్టు లేవు. రాష్ట్ర చరిత్రలో రూ.3.22 లక్షల కోట్ల బాహుబలి బడ్జెట్ అని ఆకాశమే హద్దుగా ప్రచారం చేసినా సూపర్ సిక్స్, పోలవరం, అమరావతి సహా ముఖ్యమైన పథకాలు, కార్యక్రమాలన్నీ విదిలింపులు, విస్మరణకు లోనయ్యాయి. కార్పొరేట్ సంస్కరణలకు మాత్రం పెద్దపీట వేశారు. కూటమి వచ్చింది లగాయతు 'స్వర్ణాంధ్ర విజన్–2047' ను భుజానికెత్తుకుంది. మోడీ ప్రభుత్వ వికసిత భారత్‌కు ఇది నకలు. బిజెపి ప్రవచించే 'వికాసం' అదానీ, అంబానీలకేనన్నది బహిరంగ రహస్యం. అదే బాటన నడుస్తామని కంకణం కట్టుకున్న చంద్రబాబు ప్రభుత్వంలో లాభపడేది కార్పొరేట్లేనని బడ్జెట్‌ను చూస్తే అర్థమవుతుంది. 'విజన్' సాధనకు ఎంచుకున్న పి–4 తో సహా విధానాలన్నీ ప్రైవేటు, కార్పొరేట్ల మేలు కోసమేనని పంటల ధరల స్థిరీకరణ నిధి రూ.300 కోట్లు మాత్రమే కేటాయించి, వయబిలిటీ గ్యాప్ ఫండ్‌కు బడ్జెట్‌లో ప్రభుత్వం 2 వేల కోట్లు ప్రతిపాదించడంతోనే తెలిసిపోతుంది.

బడ్జెట్‌లో ప్రభుత్వం వేసిన ఆదాయ, వ్యయాల అంచనాలు గాలిలో మేడలు కడుతున్నాయి. 2023–24లో వాస్తవ వ్యయం 2.53 లక్షల కోట్లు. 2024–25లో 2.94 లక్షల కోట్ల బడ్జెట్ వేసి 2.74 లక్షల కోట్లకు సవరించారు. సుమారు 20 వేల కోట్లకు ఖర్చు కుదించారు. ఇప్పుడేమో ఏకంగా 3.22 లక్షల కోట్లుగా చూపించారు. గత కొన్నేళ్లల్లో ప్రతిపాదించిన మేరకు ఏనాడూ పూర్తిగా ఖర్చు చేసిన ఉదంతాల్లేవు. అలాంటప్పుడు భారీ అంకెలు కాగితాలకే. వచ్చే ఆదాయంపై వేసిన అంచనాలూ నేల విడిచి సాము చేసినట్టున్నాయి. నిరుడు వచ్చిన మొత్తం ఆదాయం 2.53 లక్షల కోట్లు కాగా ప్రస్తుత ఏడాది 2.94 లక్షల కోట్లు వస్తాయని తొలుత ఎస్టిమేట్ చేసి 2.74 లక్షల కోట్లకు సవరించారు. వచ్చే సంవత్సరం 3.22 లక్షల కోట్లు లభిస్తాయంటున్నారు. పెంచిన 48 వేల కోట్లూ ఎక్కడి నుంచి తెస్తారు? పన్ను ఆదాయం, పన్నేతర ఆదాయం భారీగా పెంచారు. ఆ విధంగా ఆదాయం పెరగాలంటే ప్రజలపై పన్నులు బాదాలి, ప్రభుత్వ ఆస్తులు అమ్మాలి. ఎక్సయిజ్ ఆదాయం 21 నుంచి 27 వేల కోట్లకు పెంచుతామన్నారు. అంటే, ప్రజలకు తాగబోయించి ఆదాయం సమకూర్చుకుంటారన్నమాట. సేల్స్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, ఎంవి ట్యాక్స్‌లతో జనం వీపు విమానం మోత మోగుతుందని చెప్పకనే చెప్పారు. అప్పులు లక్ష కోట్ల వరకు ఉన్నాయి. ఇంతా చేసినా రెవెన్యూ లోటు 33 వేల కోట్లు, ద్రవ్యలోటు 79 వేల కోట్లన్నారు. చివరాఖరుకు పెరగడం ఖాయమని గత అనుభవాన్ని బట్టి తెలుస్తుంది. ఆదాయం తగ్గితే సంక్షేమానికి కోతలు పడటం ఖాయం.

కూటమి హామీలలో ప్రధానమైనవి సూపర్ సిక్స్ పథకాలు. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు తొలేడాది సగానికి కత్తెరేశారు. వచ్చే ఏట కేటాయింపులు సరిపోను లేవు. అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం మొదటి సంవత్సరం ఎగ్గొట్టారు. వచ్చే ఏడాదికి అత్తెసరు నిధులు ప్రతిపాదించారు. మహిళలకు నెలకు 1,500, బస్సుల్లో ఉచిత ప్రయాణం, నిరుద్యోగ భృతి బడ్జెట్‌లో కనిపించలేదు. తొలి సంతకం చేసిన మెగా డిఎస్‌సిపై అయోమయమే. సూపర్ సిక్స్‌లో మూడు పథకాలను దాటవేస్తే, మేనిఫెస్టోలోని మిగిలిన వందకుపైగా హామీల పరిస్థితేంటోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ బడ్జెట్ 48 వేల కోట్లనగా, దానిలో ఉచిత విద్యుత్, ఉపాధి హామీ, ఇరిగేషన్ పద్దులు 32 వేల కోట్లు. ఇదీ 60 శాతం జనాభా ఆధారపడ్డ ప్రాథమిక రంగానికి ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యత. కౌలు రైతులకు కొత్త చట్టం తెస్తామన్నారు తప్ప ఎప్పుడో క్లారిటీ ఇవ్వలేదు. సాగునీటి ప్రాజెక్టులకు పోలవరంతో సహా చూపించింది 18 వేల కోట్లు. కేంద్రం కట్టాల్సిన పోలవరానికి 6 వేల కోట్లన్నారు. కేంద్రం 12 వేల కోట్లిస్తామన్నారని సగమే ఎందుకు చూపారో తెలీదు. నిర్వాసితుల గురించి మాట్లాడలేదు. అమరావతిలో వేలాది కోట్ల పనులకు టెండర్లు పిలవగా బడ్జెట్‌లో 6 వేల కోట్లే చూపించారు. విద్య, వైద్యం, ఉపాధి అన్నింటికీ అత్తెసరు నిధులే. మూలధన వ్యయమూ అంతంతే. కేంద్రాన్ని నిధులడగకుండా, ప్రత్యేక హోదా లేకుండా రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం, ఉద్యోగ ఉపాధిపై భారీ టార్గెట్లు చేరుకోవడం సాధ్యమా?

మహనీయుల మాట

చే గువేరా చెప్పినట్లు ప్రతి ఫ్యాక్టరీ ఒక పాఠశాల కావాలి. అక్కడ ఇనుము, అల్యూమినియం, ఇతర వస్తువులను ఉత్పత్తి చేయడంతో పాటు సరికొత్త స్త్రీపురుషులను, సరికొత్త సమాజాన్ని, సోషలిస్టు సమాజాన్ని ఉత్పత్తి చేయాలి.

- హ్యూగో చావెజ్

కోలుకోడానికి సామ్రాజ్యవాదం వ్యూహం

ప్రజా ప్రపంచం

ప్రభాత్ పట్నాయక్

ట్రంప్ ఏదో శాంతి స్థాపనాదీక్ష చేపట్టాడనుకోవద్దు. అదే వాస్తవమైతే గాజా గురించి అంత దారుణంగా ప్రకటన చేయడు. నిజానికి పెట్టుబడిదారీ విధానం స్వభావికంగానే శాంతికి వ్యతిరేకం. "మేఘాలు వర్షాన్ని ఏ విధంగా తమతో తీసుకువస్తాయో, పెట్టుబడిదారీ విధానం యుద్ధాన్ని తనతో తీసుకువస్తుంది" అని జీన్ జారెస్ అనే ఫ్రెంచి సోషలిస్టు అన్నాడు. ఇప్పుడు ట్రంప్ లక్ష్యం సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని మరింత బలమైన స్థితిలోకి తీసుకుపోవడమే తప్ప శాంతి స్థాపన కాదు. అదే విధంగా, యూరోపియన్ దేశాల రక్షణ అన్నది పూర్తిగా ఊహాజనిత సమస్య. రష్యా ఏనాడూ యూరోపియన్ భద్రతకు ముప్పు తలపెట్టలేదు. రష్యన్ సామ్రాజ్యవాదం యూరప్‌ను ఆక్రమించుకుంటోందంటూ జరిగిన ప్రచారమంతా నాటో కూటమి ఏర్పాటును సమర్థించుకోవడం కోసం ముందుకు తెచ్చినదే. అందుచేత ఇప్పుడు ట్రంప్ చేస్తున్న ఉక్రెయిన్ యుద్ధ విరమణ ప్రతిపాదన వలన యూరోపియన్ భద్రతకు వాటిల్లే ప్రమాదమేమీ లేదు.

డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విదేశాంగ విధానం రాజకీయ వ్యాఖ్యాతలను గందరగోళానికి గురిచేస్తోంది. ఉక్రెయిన్ విషయంలో వెంటనే శాంతి నెలకొనాలన్న వైఖరిని తీసుకున్న ట్రంప్ మరో వైపు గాజాలో ఏకంగా ఒక జాతి మొత్తాన్నే తుడిచిపెట్టే వైఖరిని ప్రకటించాడు. ఇలా పరస్పరం విరుద్ధంగా పైకి కనిపిస్తున్న ఈ విధానాలను చూసేవారు ట్రంప్ ప్రభావం ఈ ప్రపంచ వ్యవహారాల మీద సానుకూలంగా ఉండబోతుందా లేక ప్రతికూలంగానా అని అయోమయంలో పడతారు. ఈ అయోమయానికి కారణం ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు కావు, సామ్రాజ్యవాదం స్వభావాన్ని అర్థం చేసుకోలేక పోవడంలోనే ఉంది.

ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని మరింత ఉధృత స్థాయికి, అవసరమైతే అణుయుద్ధానికి సైతం, తీసుకుపోవడమా లేక క్రమంగా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని కోల్పోవడమా అన్న స్థితికి సామ్రాజ్యవాదం చేరుకుంది. అమెరికా ఎటూ దారి లేని ఒక మూలకు ఇరుక్కు పోయింది. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ ఆ ఇరకాటం నుండి సామ్రాజ్యవాదాన్ని తప్పించడానికి ప్రయత్నిస్తున్నాడు. అతడు శాంతిని కోరుతున్నాడా లేక యుద్ధాన్నా అన్న ప్రశ్న కాని, యూరోపియన్ దేశాల ప్రయోజనాలు అతగాడి దృష్టిలో ఉన్నాయా లేవా అన్న ప్రశ్న కాని ఇక్కడ ప్రధానం కాదు. సామ్రాజ్యవాదాన్ని ప్రస్తుత ఇరకాటం నుండి బైటకు తీసుకు రావడానికి ట్రంప్ అనుసరిస్తున్న వ్యూహం ఉపయోగ పడుతుందా లేదా అన్నదే ప్రధాన ప్రశ్న.

ఒక చేత్తో బెల్లం ముక్క, ఇంకో చేత్తో బెత్తం పట్టుకున్న వైఖరిని ఇప్పుడు ట్రంప్ చేపట్టాడు. పశ్చిమ దేశాలకు రష్యా లొంగివస్తుందని ఆశించి ఉక్రెయిన్ యుద్ధాన్ని సామ్రాజ్యవాదం రెచ్చగొట్టింది. కాని అది నెరవేరేది కాదని ఇప్పుడు వాళ్ళకి స్పష్టం అయింది. ఈ యుద్ధంతో రూబుల్‌ను పనికిరాని గులకరాయిగా చేసిపారేస్తామని అనుకున్నది కాస్తా గల్లంతై ఉక్రెయిన్ భూభాగమే అంతకంతకూ రష్యా అధీనంలోకి పోతోంది. పైగా ఆంక్షలకు ముందు డాలర్‌తో పోల్చినప్పుడు ఉండిన విలువ కన్నా రూబుల్ ఇప్పుడు మరింత బలంగా పుంజుకుంది. పైగా ఆ ఆంక్షలు ఎదురుతిరిగి ఇప్పుడు అమెరికన్ డాలర్ ఆధిపత్యానికే ఎసరు పెడుతున్నాయి.

బ్రిక్స్ దేశాల కజన్ శిఖరాగ్ర సమావేశం డాలర్–రహిత వాణిజ్యాన్ని వాస్తవ రూపం ధరించేట్టు చేయడం ఎలా అన్నది తీవ్రంగానే చర్చించింది. సామ్రాజ్యవాదుల ఆంక్షలు చిన్న చిన్న దేశాల మీద, అది కూడా కొద్ది దేశాలమీద పనిచేయవచ్చు. కాని రష్యా వంటి ఒక పెద్ద దేశం మీద, అందునా చాలా వనరులను కలిగి వున్న దేశం మీద, దానితోబాటు అనేక దేశాల మీద ఏకకాలంలో ఆంక్షలను అమలు చేయడానికి పూనుకున్నప్పుడు అవి పనిచేయడం లేదు. పైగా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని ఎదిరించేందుకు ఒక కూటమిగా పలు దేశాలు ఏర్పడడానికి ఆ ఆంక్షలు పురికొల్పాయి. సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయంగా ఇంకొక వాణిజ్య ఏర్పాటు రూపొందే పరిస్థితి వచ్చింది.

ట్రంప్ అధికారం చేపట్టేనాటికి ఇదీ పరిస్థితి. ట్రంప్ బెత్తాన్ని ఏవిధంగా చూపించి బెదిరిస్తున్నదీ మనకు తెలుస్తూనే వుంది. డాలర్–రహిత వ్యాపారం కోసం ప్రయత్నించే దేశాలన్నింటిపైనా భారీ సుంకాలను విధిస్తానని ట్రంప్ బెదిరిస్తున్నాడు. ఇది పెట్టుబడిదారీ నియమాలను సైతం అడ్డగోలుగా కాలదన్నడమే. పెట్టుబడిదారీ వ్యాపార నియమాల ప్రకారం ఏ దేశమైనా మరో దేశంతో వాణిజ్య ఒప్పందానికి సిద్ధపడినప్పుడు పరస్పరమూ అంగీకరించిన పక్షంలో, ఏ కరెన్సీనైనా మారకానికి ఉపయోగించవచ్చు. అదే విధంగా తన దగ్గర విదేశీ కరెన్సీని దేన్నైనా నిల్వ ఉంచుకోవచ్చు. పెట్టుబడిదారీ వాణిజ్యంలో ఉన్న ఈ స్వేచ్ఛను నిరాకరించి అధిక సుంకాలను విధించడం అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థను తనకు తోచినట్టు మెలితిప్పి మెడలు వంచేందుకు ప్రయత్నించడమే ఔతుంది. దీనిని ఏ అంతర్జాతీయ వ్యవస్థ అంగీకరించదు. కాని బహిరంగంగానే తన పొగరును ప్రదర్శించడానికి వెనుకాడని ట్రంప్ వంటి వారికి ఈ విషయంలో ఏ మాత్రమూ ఖాతరు లేదు.

ఉక్రెయిన్ యుద్ధాన్ని వెంటనే ముగించేందుకు ప్రయత్నించడం ట్రంప్ చూపుతున్న బెల్లం ముక్క. అమెరికాకు, పాశ్చాత్య సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయంగా ఒక శక్తివంతమైన కూటమి ఏర్పడకుండా నివారించడం, రష్యాకు అభ్యంతరం లేని విధంగా యుద్ధ విరమణ షరతులు ఉండేలా చూడడం ద్వారా ఆ ప్రత్యామ్నాయ కూటమికి రష్యాను దూరంగా ఉంచడం ఈ ప్రయత్నం వెనుక ఉద్దేశ్యం. దాని వలన సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సవాలు చేసే ప్రయత్నాలు బలహీనపడతాయి.

ఉక్రెయిన్ యుద్ధం ముగియడం అనేది అందరూ స్వాగతించాల్సి విషయమే. కాని ఇదేదో శాంతి కాముకత నుంచి వచ్చిన పరిణామం అనో లేక అమెరికా యూరోపియన్ దేశాల భద్రతా ప్రయోజనాలను సైతం బలిచేసి తన స్వంత ప్రయోజనాలను నెరవేర్చుకోడానికి చూస్తోందనో అనుకుంటే పొరపాటు. ట్రంప్ ఏదో శాంతి స్థాపనాదీక్ష చేపట్టాడనుకోవద్దు. అదే వాస్తవమైతే గాజా గురించి అంత దారుణంగా ప్రకటన చేయడు. నిజానికి పెట్టుబడిదారీ విధానం స్వభావికంగానే శాంతికి వ్యతిరేకం. "మేఘాలు వర్షాన్ని ఏ విధంగా తమతో తీసుకువస్తాయో, పెట్టుబడిదారీ విధానం యుద్ధాన్ని తనతో తీసుకువస్తుంది" అని జీన్ జారెస్ అనే ఫ్రెంచి సోషలిస్టు అన్నాడు. ఇప్పుడు ట్రంప్ లక్ష్యం సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని మరింత బలమైన స్థితిలోకి తీసుకుపోవడమే తప్ప శాంతి స్థాపన కాదు. అదే విధంగా, యూరోపియన్ దేశాల రక్షణ అన్నది పూర్తిగా ఊహాజనిత సమస్య. రష్యా ఏనాడూ యూరోపియన్ భద్రతకు ముప్పు తలపెట్టలేదు. రష్యన్ సామ్రాజ్యవాదం యూరప్‌ను ఆక్రమించుకుంటోందంటూ జరిగిన ప్రచారమంతా నాటో కూటమి ఏర్పాటును సమర్థించుకోవడం కోసం ముందుకు తెచ్చినదే. అందుచేత ఇప్పుడు ట్రంప్ చేస్తున్న ఉక్రెయిన్ యుద్ధ విరమణ ప్రతిపాదన వలన యూరోపియన్ భద్రతకు వాటిల్లే ప్రమాదమేమీ లేదు.

ఇంతవరకూ సామ్రాజ్యవాదం అనుసరించిన వ్యూహం ఒకలా ఉంది. రష్యా మీదకు దూకుడుగా పోయి దానిని లొంగదీయడమే ఆ వ్యూహం. బైడెన్ మొదలుపెట్టిన ఆ వ్యూహం పని చేయకపోగా సామ్రాజ్యవాదాన్నే ఇరుకున పెట్టింది. ఇప్పుడు ట్రంప్ ముందుకు తెస్తున్న ప్రత్యామ్నాయ వ్యూహం ఉక్రెయిన్ యుద్ధాన్ని వెంటనే ముగించి రష్యాను సామ్రాజ్యవాద వ్యతిరేక కూటమి వైపు పోకుండా పక్కకు తప్పించడం. యూరోపియన్ దేశాల పాలకులు ఇంకా పాత వ్యూహానికే కట్టుబడి వున్నారు. ట్రంప్ ప్రత్యామ్నాయ వ్యూహంతో వ్యవహరిస్తున్నాడు. ఈ వ్యూహం పట్ల జర్మనీ లోని ఎ.ఎఫ్.డి అనే నయా నాజీ పార్టీ అచ్చంగా ట్రంప్ మాదిరిగానే స్పందించి ఉక్రెయిన్ యుద్ధాన్ని వెంటనే నిలుపు చేయాలని అంటోంది. అదే సమయంలో పాలస్తీనా విషయంలో పూర్తిగా ఇజ్రాయిల్‌ను బలపరిచింది. ఏ వ్యూహంతో ఇప్పుడు తిరిగి సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవలన్నదే ఇప్పుడు అసలు సమస్య.

సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని బలపరిచేలా ఇప్పుడున్న చిక్కు పరిస్థితి నుండి దానిని తప్పించడం ఒక్కటే ట్రంప్ లక్ష్యం కాదు. దానితోబాటు సామ్రాజ్యవాద కూటమిపై అమెరికా పెత్తనాన్ని కూడా బలంగా నెలకొల్పాలని ట్రంప్ కోరుకుంటున్నాడు. "అమెరికాను మళ్ళీ గొప్పగా చేద్దాం" అన్న ట్రంప్ నినాదం పాశ్చాత్య సామ్రాజ్యవాద ఆధిపత్యంలో తిరుగులేని విధంగా ప్రపంచాన్ని మార్చడం, దానితోబాటు ఆ సామ్రాజ్యవాదానికి తిరుగులేని నాయకుడిగా అమెరికాను నిలబెట్టడం అనే లక్ష్యాన్ని కలిగివుంది. యూరప్ దేశాలు అమెరికన్ ఇంధన వనరులమీద ఆధారపడాల్సిన పరిస్థితిని కల్పించడం, అందుకోసం రష్యా నుండి సహజ వాయువును యూరప్‌కు సరఫరా చేసే నార్డ్ స్ట్రీమ్–2 పైప్‌లైన్‌ను పేల్చివేయడానికి అమెరికన్ గూఢచర్య సంస్థలను ఉనయోగించడం ఈ లక్ష్య సాధన కోసమే.

అయితే ట్రంప్ వ్యూహంలో ఒక ప్రధానమైన వైరుధ్యం ఉంది. నాయకత్వ స్థానాన్ని పొందాలనుకునేవారు అందుకోసం తగిన మూల్యాన్ని చెల్లించాల్సి వుంటుంది. కాని ట్రంప్ ఎటువంటి మూల్యాన్నీ చెల్లించకుండానే నాయకత్వాన్ని చెలాయించాలనుకుంటున్నాడు. నాయకత్వ స్థానాన్ని కలిగి వుండాలనుకునే అమెరికా తక్కిన ప్రధాన పెట్టుబడిదారీ దేశాలతో జరిపే వాణిజ్యంలో ఆ దేశాల ఆకాంక్షలకు అనుగుణంగా దిగుమతులను ఎక్కువగా చేసుకుని సహకరించాలి. తద్వారా సంక్షోభం ముదరకుండా నివారించాలి. దాని వలన అమెరికా కొంత వాణిజ్య లోటును అదనంగా భరించాల్సి వుంటుంది. గతంలో నాయకత్వ స్థానంలో ఉన్న బ్రిటన్ కాని, ఇటీవలి కాలం వరకూ అమెరికా కాని ఇదే చేస్తూ వచ్చాయి. యూరప్ ఖండంలోని తక్కిన పెట్టుబడిదారీ దేశాలతోను, అమెరికా తోను నడిపిన వాణిజ్యంలో లోటును బ్రిటన్ భరిస్తూ వచ్చింది. ఆ లోటును తన ఆధీనంలోని వలస దేశాలను కొల్లగొట్టి తెచ్చిన సంపద ద్వారా భర్తీ చేసుకుంది.

రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం సామ్రాజ్యవాద శిబిరానికి నాయకత్వ స్థానంలోకి వచ్చిన అమెరికా కు అటువంటి అవకాశం లేదు (వలస విధానం అంతమైంది). అందుచేత తక్కిన సంపన్న పెట్టుబడివారీ దేశాలతో అది నడిపిన వాణిజ్యం అమెరికాను అంతకంతకూ ఎక్కువగా రుణాల ఊబిలోకి నెట్టింది. మరింత లోతుల్లోకి దిగజారిపోకుండా ఆపడానికే ట్రంప్ "అమెరికాను మళ్ళీ గొప్పగా చేద్దాం" అన్న నినాదం ఎత్తుకుని తన వాణిజ్య భాగస్వాముల మీద అధికంగా సుంకాలు విధించడానికి పూనుకున్నాడు.

ఒకవైపు ద్రవ్య లోటు పెరగకూడదంటూ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి తెస్తున్న ఒత్తిడి ఫలితంగా పెట్టుబడిదారీ ప్రపంచంలో డిమాండ్ పడిపోయింది. ప్రభుత్వ వ్యయాన్ని పెంచడానికి సంపన్నులపై అధిక పన్నులు వేయకూడదని కూడా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పట్టుబడుతోంది. దీని ఫలితంగా ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఇప్పుడు ట్రంప్ విధించే అధిక సంకాలు ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేయకమానవు. దాని భారం అమెరికా మినహా తక్కిన పెట్టుబడిదారీ దేశాలమీద ఎక్కువగా పడుతుంది.

"రొట్టె రొట్టెలానే ఉండాలి, అదే సమయంలో కడుపు కూడా నిండిపోవాలి" అన్న తీరున ఉంది ట్రంప్ వైఖరి. పెట్టుబడిదారీ ప్రపంచం మీద నాయకత్వాన్ని కోరుకుంటూనే తన వాణిజ్య భాగస్వాముల మీదనే అధిక సుంకాలు విధించడం తాత్పర్యం అదే. తన మిత్ర దేశాల మార్కెట్లను తాను లాగేసుకునే ఈ విధానం సామ్రాజ్యవాద ఆధిపత్యానికి నష్టదాయకంగా పరిణమిస్తుంది. ఒక మూలకు ఇరుక్కుపోయిన సామ్రాజ్యవాదాన్ని ట్రంప్ విధానాలు ఇంకో మూలకు నెట్టి ఇరుకున పెడతాయి.

(స్వేచ్ఛానుసరణ)

మూఢ నమ్మకాల్లో మునకలేస్తున్నాం

విశ్లేషణ

అమెరికా చాట్ జిపిటి, చైనా డీప్ సీక్‌లో మునిగి తేలుతుంటే మనం గంగలో మునకలేస్తున్నాం. మన వారు డీప్ సీక్ రూపొందించలేక పోవటానికి మన దేశాన్ని విదేశీ పాలకులు ఆక్రమించుకోవటమేనంటూ ఆర్ఎస్ఎస్ పత్రిక ఆర్గనైజర్‌లో మత కోణాన్ని జోడించి విశ్లేషణ చేశారు. వేదాల్లోనే అన్నీ ఉన్నాయష అని లొట్టలు వేసుకుంటూ చెబుతారు. గత పది సంవత్సరాలుగా పురాణాల్లో చెప్పిన పుక్కిటి కబుర్లను వల్లె వేస్తున్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని మన రాజ్యాంగం నిర్దేశించగా దానికి విరుద్ధంగా సిలబస్ నుంచి డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించారు. మనుషులు బ్రహ్మ ముఖం, కాళ్లు చేతులు, ఇతర భాగాల నుంచి పుట్టారని టీచర్లు చెప్పాలన్నమాట. ఎలాంటి వారి చేతుల్లో చిక్కుకున్నాం!

ఎం. కోటేశ్వరరావు



జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగ్ రాజ్ (అలహాబాద్)లో మహా కుంభమేళా, ఫిబ్రవరి 28న జాతీయ సైన్సు దినోత్సవం జరిగింది. మీడియా దేనికి ఎంత ప్రచారమిచ్చింది? కుంభమేళాకు ఇచ్చిన ప్రచారంలో వెయ్యో వంతైనా శాస్త్ర విజ్ఞానం, మూఢవిశ్వాసాలు సంబంధిత లాభనష్టాల గురించి పాఠకులు, వీక్షకులకు చెప్పిందా? కుంభమేళా స్నానాలకు– ప్రవచనాలకు ఎక్కడలేని ప్రాధాన్యత ఇచ్చారు. ప్రభుత్వం చెబుతున్నదాని ప్రకారం 66 కోట్ల మంది గంగ, యమున, అంతర్వాహిని అని చెబుతున్న సరస్వతి నది త్రివేణి సంగమంలో మునకలేసి స్నానాలు చేశారు.

అమెరికా చాట్ జిపిటి, చైనా డీప్ సీక్‌లో మునిగి తేలుతుంటే మనం గంగలో మునకలేస్తున్నాం. మన వారు డీప్ సీక్ రూపొందించలేక పోవటానికి మన దేశాన్ని విదేశీ పాలకులు ఆక్రమించుకోవటమేనంటూ ఆర్ఎస్ ఎస్ పత్రిక ఆర్గనైజర్‌లో మత కోణాన్ని జోడించి విశ్లేషణ చేశారు. వేదాల్లోనే అన్నీ ఉన్నాయష అని లొట్టలు వేసుకుంటూ చెబుతారు. గత పది సంవత్సరాలుగా పురాణాల్లో చెప్పిన పుక్కిటి కబుర్లను వల్లె వేస్తున్నారు. మన దేశంలో ఎప్పుడో అవయవ మార్పిడి జరిగిందనటానికి వినాయకుడికి ఏనుగు తొండం అమర్చటమనీ, కృత్రిమ గర్భం ద్వారా జన్మించిన పిల్లలకు ఉదాహరణ కౌరవులనీ, ఎంత మంది ఎక్కినా ఒకరికి చోటుండే పుష్పక విమానాలను రూపొందించారని కాకమ్మ కబుర్లు చెబుతున్నారు తప్ప వేదాల్లో ఉన్నవాటిని వెలికి తీసింది లేదు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని మన రాజ్యాంగం నిర్దేశించగా దానికి విరుద్ధంగా సిలబస్ నుంచి డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించారు. మనుషులు బ్రహ్మ ముఖం, కాళ్లు చేతులు, ఇతర భాగాల నుంచి పుట్టారని టీచర్లు చెప్పాలన్నమాట. ఎలాంటి వారి చేతుల్లో చిక్కుకున్నాం! రాజ్యాంగాన్ని దెబ్బ తీయటం అంటే ఇదే. ఇలాంటి పాలకులు సైన్సు గురించి జనానికి ఎందుకు బోధిస్తారు? పరిశోధనలకు నిధులు ఎందుకు కేటాయిస్తారు?

నేషనల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రిసర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు చేయాలని 2005లో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు జాతీయ సైన్సు సలహా మండలి సిఫార్సు చేసింది. 2008లో ఆమోదం తెలిపారు. ఆ మేరకు ఒక చట్టాన్ని చేశారు. తరువాత మోడీ సర్కార్ అనుసంధాన్ నేషనల్ రిసర్చ్ ఫౌండేషన్ (ఎన్.ఆర్.ఎఫ్) పేరుతో 2023లో ఒక చట్టాన్ని తెచ్చింది. అంతకు ముందు ఎన్ని కబుర్లు చెప్పినా ఇక చూడండి అంటూ 2023 నుంచి 2028 కాలంలో 50 వేల కోట్ల రూపాయలతో పరిశోధనలు చేపడతామని చెప్పారు. ఈ మొత్తాన్ని సమీకరించేందుకు ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహిస్తామన్నారు. 70 శాతం నిధులు ప్రైవేట్ రంగం నుంచి సేకరిస్తామన్నారు. దీనికి ప్రధాన మంత్రే అధ్యక్షత వహిస్తారు. త్వరలో దేశాన్ని అమెరికా, చైనాల సరసన నిలబెడతామంటున్నారు. మహానుభావులు ఊరికే కబుర్లు చెప్పకూడదు కదా! ఆ స్థాయికి చేరటానికి ఒక మార్గం పరిశోధనా రంగానికి పెద్ద మొత్తంలో కేటాయించాలి. ప్రపంచంలో ఈ కేటాయింపు జిడిపిలో సగటున రెండు శాతం ఉంది. మన దేశంలో 2009–10లో గరిష్టంగా 0.82 శాతం ఉండగా అది మోడీ అధికారానికి వచ్చేనాటికి 0.7 శాతానికి తరువాత 2024–25 ఆర్థిక సర్వే పేర్కొన్నదాని ప్రకారం 0.64 శాతానికి దిగజారింది. ఎన్.ఆర్.ఎఫ్ ద్వారా ఐదేళ్లలో ఏడాదికి పదివేల కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉండగా 2023–24లో రూ.2,000 కోట్లు కేటాయించి తరువాత దాన్ని కేవలం రూ.258.6 కోట్లకు సవరించారు. వీరు దేశాన్ని ఉద్ధరిస్తారు, యువ పరిశోధకులను ప్రోత్సహిస్తారని ఆశించి భజన చేయాలి.

చైనాను త్వరలో అధిగమిస్తామని, ప్రపంచ వస్తు ఉత్పత్తిదారుగా మారతామని కొంత మంది చెబుతుంటారు. మంచిదే, కానీ ఆచరణ ఏమిటన్నది ప్రశ్న. 1990 దశకంలో భారత్–చైనా రెండూ కూడా పరిశోధనలకు జిడిపిలో కేటాయించిన మొత్తం 0.7 శాతమే. కానీ నేడు చైనా 2024లో 2.68 శాతం ఖర్చు చేసింది. 2025–26 మన కేంద్ర బడ్జెట్ డాలర్లలో 584 బిలియన్లు కాగా 2024లో చైనా ఒక్క పరిశోధనకు ఖర్చు చేసిన మొత్తమే 496 బిలియన్ డాలర్లు. అర్థం అవుతోందా! కేంద్ర ప్రభుత్వం 2024 నవంబరు 29న పార్లమెంటులో వెల్లడించిన సమాచారం ప్రకారం పది సంవత్సరాలలో మన పరిశోధన ఖర్చు జిడిపిలో 0.6–0.7 శాతం మధ్య ఉండగా ఇజ్రాయిల్ 5.4, అమెరికా 3.5 శాతాల చొప్పున ఖర్చు చేస్తున్నాయి. మా తాతలు నేతులు తాగారు. కావాలంటే మా మూతులు వాసన చూడండి అన్నట్లు కబుర్లు చెబితే దేశం ముందుకు పోదు. అన్నీ నెహ్రూయే చేశారు అని చెప్పే పెద్దలు పరిశోధనకు నిధులు పెంచకుండా ఎవరు అడ్డుకున్నారు?

పోనీ మన దేశం పరిశోధనలకు దూరంగా ఉందా అంటే లేదు. గోమూత్రంలో బంగారం ఎంతుంది, పేడలో ఏముంది అంటూ శోధిస్తున్నారు. సంఘపరివార్ భావజాలానికి అనుగుణంగా ప్రోత్సహిస్తున్నారు. ఉదాహరణకు జన్యు పరిశోధనలు చేసి దేశంలో ఉన్న జనాభాలో 'శుద్ధమైన జాతి' ఏదో తేల్చేందుకు 2022లో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ నిధులు ఇస్తున్నదనే వార్తలు వచ్చాయి. ఇది ప్రమాదకరమని, విరమించాలని జన్యుశాస్త్ర నిపుణులు, చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు 120 మంది నాడు కేంద్రానికి లేఖ రాశారు. జన్యు చరిత్రను తెలుసుకోవటం అనే కారణాన్ని ప్రభుత్వం చెప్పింది. వివిధ ప్రజా సమూహాల నుంచి గతంలో డిఎన్ఏలను సేకరించి చేసిన విశ్లేషణ ప్రకారం అనేకవాటి సమ్మిళితం అని తేలింది. ఫలానా జన్యువులు ఉన్నవారు పరిశుద్ధులు అంటే మిగతావారిని అవమానించే తీర్పు తప్ప సైన్సు కాదు.

ఇలాంటి గురువుల శిష్యులు చేస్తున్నదేమిటి? సంఘపరివార్ ఏర్పాటు చేసిన అనేక సంస్థలలో ఆరోగ్యభారతి ఒకటి. అది గర్భ విజ్ఞాన సంస్కార్ పేరుతో ఒక ప్రాజెక్టు నడుపుతున్నది. ఆజానుబాహులు, మంచి రంగు, రూపుతో ఉండే పిల్లలను పుట్టిస్తామని అబద్ధాలు చెప్పుకుంది. గుజరాత్‌లో మొదలెట్టి దేశమంతటా దీన్ని విస్తరించేందుకు తలపెట్టారు. అనేక చోట్ల ఈ మేరకు సభలు, సమావేశాలు కూడా నిర్వహిస్తుంటారు. జర్మన్ హిట్లర్ ఆర్య జాతి ఉత్తమమైనదని చెప్పినట్లుగానే ఉత్తమ హిందూజాతిని, హిందూ దేశభక్తులను రూపొందించేందుకు ఈ ప్రయత్నాలని జనాలను నమ్మిస్తున్నారు. జర్మన్ కాని సైన్సు పుస్తకాలను 1933లో నాజీలు తగులబెట్టారు. వాటిలో నాజీల భావజాలానికి వ్యతిరేకంగా ఉన్నవాటితో పాటు యూదు రచయితలు రాసినవి ఉన్నాయి.

మన దేశంలో అలాంటి ఉదంతాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల నెల్లూరులో సింహపురి పుస్తక మహోత్సవంపై దాడి చేయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. అక్కడున్న ప్రజలే వారిని తిప్పికొట్టారు. తిరుపతి పుస్తక మహోత్సవంలో కాషాయ మూకలు దాడులకు పాల్పడ్డాయి. అలాగే విశాలాంధ్ర స్టాల్ మీద దాడి చేశారు. చాలా సంవత్సరాల క్రితం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రం మీద దాడి చేశారు. చరిత్రలో యంత్ర విధ్వంసకుల గురించి చదివాం. కొన్నింటిని నాశనం చేస్తే తరువాత వేలాది యంత్రాలు వచ్చాయి, వస్తాయి. అలాగే పుస్తకాలను అడ్డుకుంటే భావజాల వ్యాప్తి ఆగుతుందా? పురాతన తక్షశిల విద్యాకేంద్రాన్ని ధ్వంసం చేసినంత మాత్రాన మన దేశంలో భావజాల వ్యాప్తి ఆగిందా! అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపాలని చూసే బాపతు గురించి వేరే చెప్పాలా? ఇలాంటి వారు అజ్ఞానాన్ని తప్ప విజ్ఞాన శాస్త్రాలను ప్రోత్సహిస్తారా? పరిశోధన, అభివృద్ధికి నిధులు కేటాయిస్తారా? దేశాన్ని మధ్యయుగాల నాటికి తప్ప ముందుకు తీసుకుపోతారా ?

మెత్తబడిన బువ్వ

కవిత్వం

నాకు గ్యావ తెలిసినప్పటి నుండి
అవ్వ ముబ్బుల్నే నిద్ర లేచేది
నిదరబోయిన ఆకిల్ని లేపి
శుభ్రంగా కడిగేసి బొట్టు పెట్టేది
రాతిరి పూసుకున్న బాసన్లకు తానం పోసి
వాటిని భద్రంగా శిక్కంలో శెక్కేది.

సూర్యుడు డ్యూటీకి ఎక్కక ముందే
పూట కోసం కోసెడు దూరం కూలికి పొయ్యేది
పగటి పూట ఎండిన పేగులకు మెత్తబడిన
బువ్వలో నీళ్ల పోస్కుని పిస్క తాగి
మా పేదరికాన్ని అవ్వ కొంగుచాటున దాచేది.

సూర్యున్ని చీకట్లు మింగేసిన తర్వాత
మెల్లంగ అవ్వ ఇంటికి చేరేసరికి
అయ్య సుతారి పని జేసి సుక్కేసుకొని
అచ్చి ఇల్లంతా ఈరంగం జేసేటోడు
అవ్వ పొద్దంతా చెమట చుక్కలు చిందిస్తే
రాత్రి మాత్రం అవ్వ కన్నీళ్లను కార్చేది
అవ్వ ఆరగించిన రోజుల కన్న కడుపును
ఆరబెట్టిన రోజులే ఎక్కువ.

అవ్వ చినిగిన చీరను కుట్టుకుంటూ
అవమానాల వంతెనను దాటుకుంటూ
అతుకుల సంసారాన్ని ఈదుతుండేది
మెడ మీద పిసరంత పసిడి లేకున్న
అవ్వ ఆయమన్న చీరను కట్టకున్న
ఎప్పుడూ నిరాశల నీడలను ఒంపుకోలేదు.

అవ్వ కూలీ చేసి కూడబెట్టిన కాసులతో
దసరా పండుగకు పట్టించిన అంగీని
ఇప్పటికీ నా అల్మరలో పదిలంగా దాచుకున్న
అవ్వకు అక్షరాల పోపడ తెల్వకున్నా
నాకు సదువుల సారాన్ని తాగించింది
అవ్వకు ఏమిచ్చి రుణం తీర్చుకోను
ఆమెకు సేవ చేయడంలో తరించడం తప్ప.

- తాటిపాముల రమేశ్,
సెల్ : 7981566031

మార్కెట్‌కు వచ్చిన బంగినపల్లి మామిడి

- 'బంగినపల్లి' టన్ను రూ.1.10 లక్షలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం

ఎన్‌టిఆర్ జిల్లా రెడ్డిగూడెం మండల కేంద్రం శివారు గ్రామం రాఘవపురంలో టన్ను మామిడి ధర రూ.1.10 లక్షలు పలికింది. రాఘవపురంలోని ఆంజనేయ మ్యాంగో మార్కెట్‌లో బంగినపల్లి రకం మామిడికి ఈ ధర వచ్చింది. ప్రస్తుత సీజన్‌లో మామిడికి అత్యధిక ధర ఇదే. తామర పురుగు కారణంగా ఎన్‌టిఆర్ జిల్లాలో మామిడి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చాలాచోట్ల మామిడి పూత రాలిపోయింది. దీంతో దిగుబడులు బాగా తగ్గాయి. ఈ నేపథ్యంలో డిమాండ్‌కు తగ్గట్లుగా మామిడి అందుబాటులో లేకుండా పోయింది. తామర పురుగు కారణంగా నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం ఆధ్వర్యంలో నేతలు ఇటీవల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వేసవిలో నిరంతరాయ విద్యుత్ సరఫరా

- అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వేసవికాలంలో అధిక వినియోగానికి తగినట్లు విద్యుత్ ఉత్పత్తి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. వేసవిలో విద్యుత్ వినియోగం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ఆర్‌డిఎస్ఎస్ పనుల పురోగతిపై సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. రానున్న వేసవి కాలంలో రైతులకు 9 గంటల నిరంతరాయ ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలని ఆదేశించారు. గృహ, వ్యాపార, పారిశ్రామిక వినియోగ అవసరాలకు ఇబ్బంది లేకుండా అందరికీ నిరంతరాయంగా అందించాలని చెప్పారు. డిమాండ్‌కు తగ్గట్లుగా ముందస్తు ప్రణాళికలతో సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగ డిమాండ్‌ను తీర్చడానికి ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. డిమాండ్ మేరకు రైతులకు అవసరమైనన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని అన్నారు. విద్యుత్ పంపిణీ సామర్థ్యాలను పెంచుకోవడం, నష్టాలను తగ్గించడం, సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌లను ఆధునీకరించడంపై అధికారులు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, డిస్కంల సిఎండిలు ఐ పృథ్వీతేజ్, ఎవికె భాస్కర్, కె సంతోషరావు, నెడ్‌క్యాప్ ఎండి ఎం కమలాకర్ బాబు, ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శి కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

10 వరకూ బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలచే నడపబడుతున్న బాలల సంరక్షణ కేంద్రాలను రిజిస్ట్రేషన్‌కు గడువు ఈ నెల 10వ తేదీ వరకూ పొడిగించినట్లు బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ సంచాలకులు ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం ఈ సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ విషయమై ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. కొందరు నోటిఫికేషన్ తమ దృష్టికి రాకపోవడంతో రిజిస్ట్రేషన్ గడువు పొడిగించాలని కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బాలల సంరక్షణ కోసం నడుస్తూ ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్ చేసుకోని సంస్థలు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం, ఇతర సమాచారం కోరకు http://wdcw.ap.gov.in వెబ్‌సైటిని సందర్శించాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ అనంతరం రిజిస్ట్రేషన్ పొందకుండా బాలల సంరక్షణ కేంద్రాలు నిర్వహిస్తే, ఆయా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

మొదటి అంతస్తు, రీజినల్ డ్రగ్స్ స్టోర్స్ బిల్డింగ్, ఎస్ఎంసి కాంపౌండ్, ఎన్‌హెచ్ 16 సర్వీస్ రోడ్, గుణదల, విజయవాడ-8, ఫోన్ నెం.8978680814, ఇమెయిల్: eeapmsidc.krishnadt@gmail.com

షార్ట్ టెండరు ప్రకటన నెం.08/ఇఇ/ఏపిఎంఎస్ఐడిసి డివిజన్/క్రిష్ణాజిల్లా/విజెఏ/ డిబి/2024-25, తేది.01.03.2025

దిగువ రెండు (02) పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా టెండర్లను ఆహ్వానిస్తున్నారు.
1) ఇసిహెచ్ఎస్ పాలీక్లినిక్, విజయవాడలోని మెడికల్ & ఐటి ఈక్విప్‌మెంట్ ప్రొక్యూర్‌మెంట్ & సప్లయ్.
2) క్రిష్ణా జిల్లాలోని సిహెచ్‌సి, గన్నావరం యొక్క మరమ్మత్తులు & రినోవేషన్. ఇతర వివరాలను వెబ్‌సైట్: www.tender.apeprocurement.gov.in లో 04.03.2025న ఉ.10.30గం.ల నుండి చూడవచ్చును.

సం/- కె.నాగార్జున రావు, బి.టెక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు

DIPRNo.3556PP/CL/ADVT/1/1/2021-22

కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్
(భారత ప్రభుత్వం చేపట్టడం)

सादर सेवा

లిమిటెడ్ ఇ-టెండర్ (సింగిల్ ప్యాకెట్ సిస్టమ్) ఆహ్వాన నోటీసు

పని పేరు : దక్షిణ మధ్య రైల్వే క్రింద విజయవాడ డివిజన్ యొక్క ట్రిపుల్ లైన్ సెక్షన్ విజయవాడ (బిజెడ్ఎ)- ఒంగోలు (ఓజిఎల్) లో ఫీడింగ్ సిస్టమ్‌తో ఫీడర్ మరియు ఎర్తింగ్ పనుల వద్ద 2×25కెవి కు సిస్టమ్ ఇప్పటికే ఉన్న 1×25కెవి యొక్క ఓహెచ్ఇ అప్ గ్రాడేషన్ కొరకు "డిజైన్, సరఫరా, ఎరిక్షన్, టెస్టింగ్ మరియు ప్రారంభించడం పనుల కొరకు డిజైన్ మరియు పునాది పనులు. **నోటీసు నం.: KR/CO/EL/BZA-OGL/T/12/25,** తేది : 04.03.2025, **పూర్తి గడువు :** 15 (పదిహేను) నెలలు. **అంచనా ఖర్చు :** రూ.1,01,75,17,084/- జిఎస్‌టి మినహాయించి. **ఇఎమ్‌డి :** 52,37,600/-. **టెండర్ ఆన్‌లైన్ సమర్పణ కొరకు చివరి తేది మరియు సమయం : 11.03.2025, 15.00 గం. వరకు.** టెండర్ ప్రారంభం : 11.03.2025, 15.30 గం. ఏదైనా దిద్దుబాటు/ సవరణ ఉంటే, ఐఆర్ఇపిఎస్ వెబ్‌సైట్‌లో మాత్రమే అప్‌లోడ్ చేయగలరు. **టెండర్ డాక్యుమెంట్స్ సమర్పణ :** ఐఆర్ఇపిఎస్ ద్వారా. మాన్యువల్ టెండర్లు ఆమోదించబడవు.

ఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్
(గతంలో ఫుల్లర్టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్)

SMFG IndiaCredit
Pragati Ki Nayi Pehchaan

కార్పొరేట్ ఆఫీసు: 10వ అంతస్తు, ఆఫీస్ నెం.101, 102 &103, 2 నార్త్ అవెన్యూ, మేకర్ మాక్సిటీ, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బంద్రా (ఈస్ట్), ముంబయి-400051

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 ("చట్టం") మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ("ది రూల్స్")యొక్క నిబంధనల క్రింద
దిగువ సంతకందారులు **ఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ (గతంలో ఫుల్లర్టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్) (ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్)** యొక్క అధికృత అధికారి గా రూల్ 3తో చదువుతూ చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద అధికారాలను వినియోగిస్తూ మరియు చట్టం క్రింద సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోపు సంబంధిత నోటీసు(లు)లో పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించుటకు దిగువ రుణగ్రహీత(ల)ను చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు(లు) జారీచేసినారు. దిగువ సంతకందారుడు న్యాయంగా నమ్మదగినది ఏమనగా రుణగ్రహీత(లు) డిమాండ్ నోటీసు(లు) స్వీకరించకుండా తప్పించుకుంటున్నారు, అందువలన రూల్స్ ప్రకారం సంతకంపెట్టి మరియు ప్రచురించడం ద్వారా నోటీసు ప్రభావం చూపుతుంది. డిమాండ్ నోటీసు(ల) విషయాలు దిగువన సంగ్రహించబడినాయి:

రుణగ్రహీత(ల) పేరు	డిమాండ్ నోటీసు తేది & మొత్తం	తాకట్టుపెట్టిన స్థిరాస్తుల వివరణ
1) ద్వారకా నల్లమోతు 2) నల్లమోతు ద్వారక (చట్టపరమైన వారసులు) 3) నల్లమోతు హర్ష (చట్టపరమైన వారసులు) 4) నల్లమోతు భాను శ్రీ (చట్టపరమైన వారసులు) 5) నల్లమోతు వెంకటేశ్వర రావు (చట్టపరమైన వారసులు) LAN -192420910615977	20 ఫిబ్రవరి, 2025 20 ఫిబ్రవరి, 2025 నాటికి రూ.21,36,388.42/- (రూపాయలు ఇరవైఒక లక్షల ముప్పైఆరువేల మూడువందల ఎనభై ఎనిమిది& నలభై రెండు పైసలు మాత్రమే)	ఇబ్రహీంపట్నం గ్రామం మరియు గ్రామ పంచాయతీ, ఇబ్రహీంపట్నం మండలం, ఎన్ఆర్ఓ ఇబ్రహీంపట్నం, కృష్ణ జిల్లా, పిన్‌కోడ్-521456 లోని ఆర్.ఎస్.నెం.233/ఏ లోని 72.00 చ.గ.లు లేదా 60.20 చ.మీ.ల విస్తీర్ణంలో నిర్మించియున్న పాత ఆర్.సి.సి.రూఫ్ బిల్డింగ్. సరిహద్దులుగా: తూర్పు: పంచాయతీ రోడ్, పడమర: పంచాయతీ రోడ్, ఉత్తరం: యర్రగుంట అబ్రహం ఆస్తి, దక్షిణం: నల్లమోతు సుబ్బారావు ఆస్తి.

రుణగ్రహీత(లు)కు సలహా ఇవ్వడమేమనగా డిమాండ్ నోటీసు(ల)కు కట్టుబడి ఉండాలి మరియు ఇక్కడ పై వాటిలో చెల్లంపులు తెలిసిన మేరకు తేది వరకు వర్తించే వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ చార్జీలు, వ్యయం మరియు ఖర్చులుతో ప్రచురణ తేది నుండి 60 రోజులలోపు దానిలో పేర్కొన్న డిమాండ్ చేసిన మొత్తం చెల్లించాలి. రుణగ్రహీత(లు) గమనించవలసింది ఏమనగా ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ సెక్యూర్డ్ క్రెడిటార్ మరియు రుణగ్రహీత(లు) ద్వారా తనాఖాపెట్టిన సెక్యూర్డ్ అస్సెట్(లు) కలిగి స్థిరాస్తి/ఆస్తులపై సెక్యూర్డ్ డెట్ రుణగ్రహీత(లు) ద్వారా పొందారు.
ఈ సందర్భంగా రుణగ్రహీత(లు) నిర్ణీత సమయంలోపట వారి పూర్తి అప్పులు విడిపించుకోవడంలో విఫలమైనారు, ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ దాని క్రింద మరియు తెలిసిన చెల్లంపులు చట్టం మరియు రూల్స్ క్రింద ఏదైన అందుబాటులో ఉన్న పరిహారం ప్రేరేపించి విక్రయం పద్ధతి ద్వారా ఎదావిధిగా బదిలీకి పరిమితి లేదు కాని సెక్యూర్డ్ అస్సెట్(లు) సహా స్వాధీనంచేసుకొనుటకు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అన్ని హక్కులు అధ్యాయనం చేసే హక్కు కలదు. విక్రయం లేదా బదిలీకి అమలుచేయడానికి ముందు సెక్యూర్డ్ అస్సెట్(లు) అటాచ్ మరియు/లేదా సీలుకు ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కూడా సాధికారిత కలదు. సెక్యూర్డ్ అస్సెట్(ల) యొక్క విక్రయానికి తరువాత, ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ చెల్లించవలసిన బకాయిలు కవర్ చేసుకొనుటకు తాకట్టుపెట్టిన ఆస్తులు విలువ సరిపోకపోతే, మిగిలిన బకాయిలు రీవకర్ చేసుకొనుటకు వేరుగా లీగల్ ప్రొసీడింగ్స్‌కు ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ వెళ్లే హక్కు కలదు. వేరే ఇతర చట్టం క్రింద ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్‌కు అందుబాటులో ఉన్న అన్ని ఇతర పరిహారాలు అదనంగా మరియు స్వతంత్రంగా ఈ పరిహారం.
రుణగ్రహీత(లు) శ్రద్ధ వహించవలసింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్ విడిపించుకొనుటకు మీకు అందుబాటులో ఉన్న సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13(8)కి అహ్వానించడమైనది మరియుచట్టంలోని సెక్షన్ 13(13)కి తదుపరిగా, రుణగ్రహీతలు ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ వారి వ్రాతపూర్వక అనుమతిలేకుండా ఏసెక్యూర్డ్ అస్సెట్(లు) విక్రయం, లీజు లేదా వేరేఏ ఇతరత్రములుగా (వాణిజ్యం యొక్క సాధారణ కోర్సు కాకుండా) సెక్యూర్డ్ అస్సెట్(ల) లావాదేవీలు లేదా బదిలీ చేయుట నుండి నియంత్రణ/నిషేధించడం అయినది మరియు సదరు చట్టం యొక్క సెక్షన్ 29 క్రింద పై వాటిని అనుసరించికపోతే నేరంగా శిక్షింపబడతారు. డిమాండ్ నోటీసు కాపీ దిగువసంతకందారుని వద్ద అందుబాటులో ఉండును మరియు రుణగ్రహీత(లు), వారు కోరుకుంటే, సాధారణ ఆఫీసు వేళలలో ఏదైన పనిదినాన దిగువ సంతకందారుడి నుండి ఇదే రకమైనది పొందవచ్చు.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
తేది: 04-03-2025

సం/- అధీకృత అధికారి, ఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ (గతంలో ఫుల్లర్టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్)

గుంటూరు జైలుకు పోసాని

- రిమాండ్ విధించిన నరసరావుపేట కోర్టు

కృష్ణమురళిని కోర్టుకు తీసుకువస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా, రాజంపేట అర్బన్

సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోసాని కృష్ణమురళిపై పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన టిడిపి నాయకులు కొట్టా కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఆయనను టూటౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. రాజంపేట పోలీసుల అదుపులో ఉన్న పోసానిని అరెస్టు చేసి పిటి వారెంట్‌పై నరసరావుపేట జిల్లా కోర్టులో హాజరు పరిచారు. కృష్ణమురళిని నరసరావుపేటకు తీసుకువస్తున్నారన్న సమాచారంతో మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైసిపి శ్రేణులు కోర్టు వద్దకు చేరుకున్నాయి. దీంతో కోర్టు ప్రాంగణంలో పోలీసులు భారీగా మోహరించారు. 2022 నవంబర్ 9 నుండి 2023 జనవరి 11 మధ్య సోషల్ మీడియా వేదికగా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లపై కృష్ణమురళి అసభ్యకర వ్యాఖ్యలు చేశారని, విభేదాలు సృష్టించేలా కుట్రపూరితంగా సందేశాలు పెట్టినందుకు చర్యలు తీసుకోవాలని టిడిపి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్ కుమార్ గతేడాది నవంబర్ 14న నరసరావుపేట టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం ఇదే అంశానికి సంబంధించి అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పోసానిని అప్పగించాల్సిందిగా పిటి వారెంట్ దాఖలు చేసి కోర్టు అనుమతితో సోమవారం నరసరావుపేట కోర్టులో హాజరుపర్చారు. కృష్ణమురళి ఆరోగ్య పరిస్థితి, పోలీసుల ప్రవర్తనపై న్యాయమూర్తి ప్రశ్నించగా సంతృప్తిగా ఉన్నట్లు ఆయన బదులిచ్చారు. తాను రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నానని, గొంతుకు సంబంధించి ఆపరేషన్ చేయించుకున్నానని చెప్పగా, వాటికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలు ఏమీ లేకపోవడంతో తక్షణ ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? అని న్యాయమూర్తి అడిగారు. ఏమీ లేవని కృష్ణమురళి బదులివ్వడంతో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌ఛార్జి ప్రధాన జూనియర్ సివిల్ న్యాయధికారి రెడ్డి ఆశీర్వాదం పాల్ ఈ నెల 13 వరకు రిమాండ్ విధించారు. దీంతో పోసానిని గుంటూరులోని జిల్లా జైలుకు తరలించారు. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లెలో నమోదైన కేసుతో విచారణ అనంతరం ఈ నెల 26వ తేదీన రైల్వేకోడూరు మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధిస్తూ రాజంపేట సబ్ జైలుకు తరలించిన విషయం తెలిసిందే.

బురద మట్టిలోనే కార్మికులు

- రోబోతో మట్టిని తొలగించేందుకు ప్రయత్నాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బిసి సొరంగంలో ప్రమాదం జరిగి పది రోజులైంది. 12 ఏజెన్సీలకు చెందిన రెస్క్యూ టీమ్‌లు మూడు షిఫ్టుల్లో దాదాపు 300 మందికిపైగా రాత్రి, పగలు నిరంతరం సహాయక చర్యలు కొనసాగిస్తున్నా.. ఉబికి వస్తున్న నీరు, బురద వల్ల కార్మికుల వెలికితీతకు ఆటంకంగా మారింది. టన్నెల్‌లో ప్రమాద ప్రదేశంలో ఉన్న మట్టిని తొలగించేందుకు కన్వేయర్ బెల్టు పనులను వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు. టిబిఎం మిషన్‌ను గ్యాస్ కట్టింగ్ ద్వారా తొలగించడం, తునకలను బయటకు పంపడం కష్టసాధ్యంగా మారింది. సొరంగంలో పనిచేయడం క్లిష్టంగా మారుతుండడంతో రోబోలను ఉపయోగించి మట్టిని తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పనులు జరిగితే కార్మికులను బయటకు తీసే అవకాశముంది. సొరంగం పనుల్లో కేంద్ర ప్రభుత్వ పాత్ర నామమాత్రంగానే కనిపిస్తోంది. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులున్నా.. ఎలాంటి సహాయ సహకారాలూ అందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

టిబిఎం దగ్గరనే పొంచి ఉన్న ప్రమాదం

సొరంగంలో టిబిఎం మిషన్ దగ్గర ప్రమాదం జరిగే అవకాశం ఉందని రెస్క్యూ బృందాలు అంచనా వేస్తున్నాయి. టిబిఎం మిషన్ దగ్గర చివర ఐదు మీటర్ల వరకు రివెట్మెంట్ ఉండదు. ఇప్పుడు జరిగిన ప్రమాదం టిబిఎం కంటే ముందు రివెట్మెంట్ లేకుండా వదిలేసిన దగ్గర నీరు ఉబికి వచ్చి టన్నెల్‌లో చేరింది. దీంతో టిబిఎం దగ్గర ఉన్న కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. అయితే 15 టన్నుల బరువు కలిగిన టిబిఎం మిషన్‌ను తొలగించడం అంత సులువు కాదు. సాంకేతికంగా ముందుకు వెళ్లాలని, ప్రమాద స్థలంలో రోబోలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. టిబిఎం మిషన్‌కు ముందే కన్వేయర్ బెల్టు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంతా సజావుగా జరిగితే బురదలో చిక్కుకున్న కార్మికులను మరో మూడు నాలుగు రోజుల్లో బయటకు తీసుకొచ్చే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

గాదెకు పల్లా శుభాకాంక్షలు

- కూటమికి గుణపాఠం : బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన గాదె శ్రీనివాసులు నాయుడుకు టిడిపి తరుపున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉందన్నారు. ఈ ఎన్నికల్లో టిడిపి లేక కూటమి అభ్యర్థి పోటీ చేయలేదని తెలిపారు. ఈ ఫలితాన్ని కూటమి ఓటమిగా అభివర్ణించడాన్ని ఖండించారు.

టిడిపి, జనసేన కూటమి పార్టీలకు ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చావు దెబ్బ తగిలిందని శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. విజ్ఞులైన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయులు కూటమి పార్టీకి గట్టి గుణపాఠం చెప్పారని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో హామీలిచ్చి ఓట్లేయించుకుని, అధికారంలోకి వచ్చిన అనంతరం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల టీచర్లు ఎన్నికల్లో పాల్గొన్న తీరు, వచ్చిన ఫలితం, ప్రభుత్వం పట్ల ఎంతటి వ్యతిరేకత ఉందో తేటతెల్లం చేసిందన్నారు.

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో ఈడల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడినది)
నమోదిత కార్యాలయం : 5వ అంతస్తు, టవర్ 3, వింగ్ బి, కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్డు, కుర్లా (ప), ముంబై-400070.
శాఖా కార్యాలయం చిరునామా : 4వ అంతస్తు, జానకి అవెన్యూ, నం.1-11-220/15, బృందావన్ కాలనీ, ప్లాట్ నం.2, బేగంపేట, హైదరాబాద్-500016.

nido HOME FINANCE

ఇ-వేలం- చట్టబద్ధమైన 15 రోజుల విక్రయ నోటీసు

సాధారణంగా ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు), సహ రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కి దీని ద్వారా నోటీసు ఇవ్వడమేమనగా నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో దీనిని పిలుస్తారు ఈడల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) (ఇకపై 'నిడో'గా సూచిస్తారు) కు అనుకూలంగా క్రింద పేర్కొన్న తనఖా పెట్టబడిన ఆస్తి "ఎక్కడ ఉంది ప్రాతిపదికన మరియు ఉన్నది ఉన్నట్లుగా ప్రాతిపదికన" స్థితి, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్స్ 8 మరియు 9తో చదువుతూ సర్ఫాసీ యాక్ట్ యొక్క నిబంధనల షరతులలో బకాయిల రికవరీ కొరకు "ప్రైవేటు ఒప్పందం" ద్వారా విక్రయించబడును. ఒకవేళ, మీకు ఆఫర్ ఉన్న సదరు ఆస్తి కొరకు రూ.8,00,000/- (ఎనిమిది లక్షల రూపాయలు మాత్రమే) కంటే ఎక్కువ మొత్తానికి, ప్రచురణ తేదీ నుండి 15 రోజులలోపు అధీకృత అధికారికి సమర్పించాలి. సర్ఫాసీ చట్టం, 2002 యొక్క సంబంధిత నిబంధనల ప్రకారం విక్రయం పేర్కొన్న విధంగా మనకు ఎలాంటి ఆఫర్ రాకపోతే ఇక్కడ పైన మేము ప్రైవేట్ ఒప్పందం క్రింద పేర్కొన్న ఆఫర్ ధర రూ.8,00,000/- (ఎనిమిది లక్షలు రూపాయలు మాత్రమే)తో కొనసాగుతాము.

క్ర. సం.	రుణగ్రహీత, సహ రుణగ్రహీత, హామీదారుల పేరు మరియు చిరునామా మరియు లోన్ అకౌంట్ నం.	సెక్యూర్డ్ అసెట్ వివరాలు
1.	కర్నాల గోవిందరావు (రుణగ్రహీత), అప్పాల నారాయణమ్మ కర్నేన (సహ రుణగ్రహీత), చిరునామా : హా.నం.44-15-156/3, రివాస్ కెనాల్ రోడ్డు, గుణదల, విజయవాడ-520004. ఎల్ఎఎన్ నం.: LVIJSTH0000017498	విజయవాడ 521108, కృష్ణ, ప్రసాదంపాడు గ్రామ పంచాయతీ, ఆర్ ఎస్ నం.76/1, 76/2, డో.నం.7-93/8లో సాయి భవాని ఎన్‌క్లేవ్ గ్రౌండ్ ఫ్లోర్, బేరింగ్ ఫ్లాట్ నం.జి.ఎఫ్.1 మొత్తం ఆ భాగం మరియు పార్సిల్ కొలత 24.0 చ.గ.లు. లేదా 20.06 చ.మీ.లు. అవిభక్త వాటా బయట 168.0 చ.గ.లు. లేదా 140.46 చ.మీ.లు. హద్దులు : ఉత్తరం : జె.కుటుంబ సుబ్బారావు ఆస్తి, దక్షిణం : జి.వి.రామారావు ద్వారా ఇతరులకు అమ్మబడిన ఆస్తి, తూర్పు : ఎస్.సౌమ్య ఆస్తి, పడమర : 18.0 అ.లు. వెడల్పు బజారు.

ప్రదేశం : విజయవాడ, తేది : 04.03.2025 — సం/- అధీకృత అధికారి, నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఈడల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా

విద్యార్థులపై కారెక్కిస్తారా?

- మంత్రి దారుణంపై భగ్గుమన్న బెంగాల్
- రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆందోళనలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
పశ్చిమ బెంగాల్‌లో అధికార టిఎంసి నేత, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బ్రాత్య బసు జాదవ్‌పూర్ యూనివర్శిటీలో ఆందోళన చేస్తోన్న విద్యార్థులపైకి కారెక్కించారు. ఈ ఘటనతో పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఎస్ఎఫ్ఐ పిలుపు మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. ఢిల్లీలో పశ్చిమ బెంగాల్ భవన్‌ను ఎస్ఎఫ్ఐ శ్రేణులు ముట్టడించాయి. విద్యాశాఖ మంత్రి బ్రాత్య బసును అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్, సిలిగురి, డార్జిలింగ్‌తో సహా ఉత్తర బెంగాల్‌లో వివిధ ప్రాంతాల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తోన్న ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలపై టిఎంసి విద్యార్థి సంఘం తృణమూల్ ఛత్ర పరిషత్, టిఎంసి గూండాలు దాడికి పూనుకున్నారు. మిడ్నాపూర్‌లోని విద్యాసాగర్ విశ్వవిద్యాలయంతోపాటు వివిధ యూనివర్శిటీల్లోకి బయట వ్యక్తులు చొరబడి దాడి చేశారు.

పశ్చిమ బెంగాల్‌లో జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం (జెయు) శనివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బ్రాత్య బసు పర్యటన సందర్భంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంలో విద్యార్థులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పశ్చిమ బెంగాల్ కళాశాల, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ల సంఘం (డబ్ల్యుబిసియుపిఎ) వార్షిక సర్వసభ్య సమావేశంలో బసు హాజరైన సందర్భంగా రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఆందోళన నిర్వహించాయి. మంత్రి బ్రాత్య బసు తిరిగి వెళ్తున్న సందర్భంగా ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ శ్రేణులపైకి కారును ఎక్కించారు. దీంతో పలువురు ఎస్ఎఫ్ఐ కార్యకర్తలను గాయాలయ్యాయి. విద్యార్థులను గాయపరిచిన మంత్రి బ్రాత్య బసును అరెస్టు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. మంత్రి వెళ్లిపోయిన కొద్దిసేపటికే వామపక్ష ఉపాధ్యాయ సంఘం కార్యాలయం దగ్ధం చేశారు. పోలీసులు రెండు సుమోటో కేసులు సహా ఏడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

యువతిపై గ్యాంగ్ రేప్

- ఇద్దరు అరెస్టు

ముంబయి : మహారాష్ట్రలోని పుణే జిల్లాలో కత్తితో బెదిరించి 19 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారం చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కోర్టు వీరికి ఈ నెల 7 వరకూ పోలీస్ కస్టడీ విధించింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన బాధిత యువతి పుణే జిల్లాలోని శిరూర్ తాలూకాలో ఒక గ్రామానికి బంధువుల ఇంటికి వచ్చింది. శనివారం రాత్రి 11 గంటల సమయంలో గ్రామంలో ఏకాంత ప్రదేశంలో బంధువుతో మాట్లాడుతుండగా ఇద్దరు వ్యక్తులు అక్కడకు ద్విచక్ర వాహనంపై చేరుకున్నారు. వీరిని అహల్య నగర్ జిల్లాలోని శ్రీగొండకు చెందిన 25 ఏళ్ల అమోల్ నారాయణ్ పోటే, బీడ్ జిల్లాలోని ధరూర్‌కు చెందిన 29 ఏళ్ల కిషోర్ రాంభావ్ కాలేగా గుర్తించారు. వీరిద్దరూ మహిళను, ఆమె బంధువును కత్తితో బెదిరించారు. మహిళతో అసభ్యంగా ప్రవర్తించాలని బంధువును బెదిరించి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. తరువాత యువతిపై అత్యాచారం చేసి, బంగారు ఆభరణాలు దోచుకుని అక్కడ నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై రంజన్‌గావ్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన పోలీసులు పోటే, కాలేను అరెస్టు చేశారు.

ఆన్‌లైన్ సమాచారం బ్లాక్ చేసే నిబంధనలపై మీ వైఖరేంటి?

- కేంద్రం స్పందనను కోరిన సుప్రీం

న్యూఢిల్లీ : అప్‌లోడ్ చేసిన వ్యక్తులను విచారించకుండా, వారికి ముందస్తు నోటీసులివ్వకుండా సోషల్ మీడియా వేదికల్లోని సమాచారాన్ని బ్లాక్ చేసేందుకు అధికారమిస్తున్న నిబంధనలను సవాలు చేస్తున్న పిటిషన్‌పై కేంద్రం స్పందనను సుప్రీం కోర్టు సోమవారం కోరింది. ఈ మేరకు కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖకు జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని బెంచ్ నోటీసులు జారీ చేసింది. సమాచార సాంకేతిక నిబంధనలు- 2009లోని కొన్ని నిబంధనలను సవాలు చేస్తూ సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్ దరఖాస్తు చేసిన పిటిషన్‌ను బెంచ్ విచారణకు స్వీకరించింది.

8, 9 నిబంధనల కింద ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు, వాస్తవానికి అత్యవసరమైన పరిస్థితుల్లో రూల్ నెంబర్ 9 కింద ప్రభుత్వం సదరు సమాచారాన్ని బ్లాక్ చేయొచ్చు. అత్యవసర నిబంధన కింద సమాచారాన్ని బ్లాక్‌చేయడానికి నెంబర్ 9ని ప్రభుత్వం ఏకపక్షంగా ఉపయోగిస్తోందని పిటిషన్ పేర్కొంది. ముందుగానే నోటీసులివ్వకపోవడం లేదా తమ వాదన వినిపించుకునే అవకాశం ఇవ్వకపోవడం వల్ల ఆన్‌లైన్ కంటెంట్ క్రియేటర్లు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు.

జనం పైకి దూసుకెళ్లిన కారు

- జర్మనీలో ఒకరు మృతి, పలువురికి గాయాలు

బెర్లిన్ : జర్మనీలోని మాన్‌హీమ్ నగరంలో ఒక ప్రధాన కూడలి వద్ద కారు జనంపైకి దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం 12:15 గంటల సమయంలో జరిగిందని, ఒక అనుమానితున్ని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన తరువాత పట్టణంలో భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. అలాగే ఈ ఘటన జరిగిన ప్రాంతానికి ప్రజలు దూరంగా ఉండాలని, ఇళ్లలోనుంచి బయటకు రావద్దని ప్రజలకు కాట్‌వార్న్ యాప్‌లో విజ్ఞప్తి చేశారు. అయితే ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందో వివరణ ఇవ్వలేదు. సాధారణంగా భారీ వర్షాలు, ఉగ్రవాద దాడులు, అగ్ని ప్రమాదాలు వంటి అత్యవస పరిస్థితులు గురించి సమాచారాన్ని తెలియజేయడానికి కాట్‌వార్న్ యాప్‌ను అధికారులు ఉపయోగిస్తారు. కాగా, గత నెలలో జర్మనీలోని మ్యూనిచ్ పట్టణంలోనే కారు జనంపైకి దూసుకెళ్లిన ఘటనలో సుమారు 30 మంది గాయపడ్డారు. ఈ ఘటనను ఇస్లామిక ఉగ్రవాద దాడిగా అనుమానిస్తూ పోలీసులు విచారణ చేస్తున్నారు.

స్వర్ణాంధ్ర విజన్ సాధనలో తొలి అడుగు వేశాం!

(మొదటి పేజీ తరువాయి)

ఎపి దేశీయ, ప్రపంచ మార్కెట్ అవసరాలను తీర్చడానికి గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతులకు కేంద్రంగా మార్చడానికి ఎపి అనువైందని సిఎం అన్నారు. ఈ ప్రాజెక్టు ఏడాదికి 25 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తుందని, ఏడాదికి 54 టన్నులకు పెంచుకునే అవకాశం ఉందని, 206 టన్నుల కార్బన్‌డైఆక్సైడ్ ఉద్గారాల తగ్గింపుతో పాటు, వాతావరణంలో ఏడాదికి 190 నుండి 195 టన్నుల ఆక్సిజన్ విడుదల అవుతుందని, ఎనిమిది నుండి పదిశాతానికి ఉద్గారాల తగ్గింపు సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరో ఫ్యూచర్స్ ఎనర్జీస్ ఎమ్‌డి, ఛైర్మన్ రాహుల్ ముంజాల్, గ్లోబల్ సిఇఓ శ్రీవాత్సవ్ అయ్యర్, రాక్‌మాన్ ఇండస్ట్రీస్ ఎమ్‌డి ఉజ్వల్ ముంజల్, సిఇఓ కౌశిక్ మన్నా, ఓమ్నియం సిఇఓ ఆర్నే బాలంటైన్ పాల్గొన్నారు.

జీవవైవిధ్యాన్ని సంరక్షించండి

- గిర్ అభయారణ్యాన్ని సందర్శించిన ప్రధాని మోడీ



సాసన్ : భూమిపై ఉన్న అపురూపమైన జీవవైవిధ్యాన్ని సంరక్షించడానికి ప్రపంచంలోని ప్రజలంతా కృషి చేయాలని ప్రధాని నరేంద్రమోడీ కోరారు. రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వడానికి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. వన్యప్రాణులను సంరక్షించడంలో దేశం చేస్తున్న కృషికి గర్వపడుతున్నామని అన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా ఆయన గుజరాత్‌లోని గిర్ అభయారణ్యాన్ని సోమవారం సందర్శించారు. సింహాల సఫారీకి వెళ్లారు. అక్కడ జరిగిన జాతీయ వన్యప్రాణుల బోర్డు సమావేశానికి అధ్యక్షత వహించారు. జునాగఢ్ జిల్లాలోని సాసన్‌లో అటవీ అతిథి గృహం సిన్హ్ సదన్‌లో ఆదివారం రాత్రి బస చేసిన ఆయన సోమవారం రాష్ట్ర అటవీ శాఖ నిర్వహించే సఫారీలో చేతిలో కెమెరా పట్టుకుని.. సింహాల ఫొటోలను బంధిస్తూ బిజీ బిజీగా కన్పించారు. ఈ పర్యటనలో ప్రధానితో పాటు కొంత మంది మంత్రులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు కూడా ఉన్నారు. ఈ సందర్శన విషయాన్ని, చిత్రాలను మోడీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. ఈ సందర్శన తరువాత సాసన్‌గిర్‌లోని గిర్ వన్యప్రాణుల అభయారణ్యం ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జాతీయ వన్యప్రాణుల బోర్డు (ఎన్‌బిడబ్ల్యూఎల్) ఏడో సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ బోర్డులో ఆర్మీ స్టాఫ్ చీఫ్, వివిధ రాష్ట్రాల సభ్యులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం పనిచేస్తున్న ఎన్‌జిఓల ప్రతినిధులు, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్లు, వివిధ రాష్ట్రాల కార్యదర్శులతో సహా 47 మంది సభ్యులు ఉన్నారు. ఈ సమావేశం తరువాత కొంత మంది మహిళా అటవీ సిబ్బందితో మోడీ సంభాషించారు.

ఈ సమావేశం తరువాత గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. గుజరాత్‌లో మాత్రమే ఉన్న ఆసియా సింహాలకు ఉద్దేశించిన ప్రాజెక్టు లయన్ కోసం రూ.2,900 కోట్ల నిధులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని పేర్కొంది. తొమ్మిది జిల్లాలోని 53 తాలుకాల్లో విస్తరించిన ఉన్న 30 వేల కిలోమీటర్ల పరిధిలో ఈ ఆసియా సింహాలు ఉన్నట్లు తెలిపింది. ఒక జాతీయ ప్రాజెక్టులో భాగంగా జునాగఢ్ జిల్లాలో న్యూ పిపాల్య వద్ద 20.24 హెక్టార్లలో నేషనల్ రిఫరల్ సెంటర్ ఫర్ వైల్డ్ లైఫ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. వన్యప్రాణుల సంరక్షణ ప్రయత్నాల్లో భాగంగా సాసన్‌లో వన్యప్రాణుల ట్రాకింగ్ కోసం హైటెక్ పర్యవేక్షణ కేంద్రం, అత్యాధునిక ఆసుపత్రిని కూడా ఏర్పాటు చేసినట్లు ఈ ప్రకటనలో గుజరాత్ ప్రభుత్వం తెలిపింది.

చిన్నారిపై అత్యాచారం

- నిందితుడిపై ఫోక్సో కేసు

ప్రజాశక్తి - కౌతాళం
మనవరాలి వయసున్న నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన ఘటన కర్నూలు జిల్లా కౌతాళం పోలీసు స్టేషన్ పరిధిలోని చూడి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..చూడి గ్రామం దళితవాడకు చెందిన దంపతులకు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్నారి ఇంటికి సమీపంలోని వ్యక్తి పిల్లలను ఆడిస్తూ వారితో చనువుగా ఉండేవాడు. ఈ క్రమంలో బట్టలు ఉతకడానికి తల్లి వెళ్లిపోవడంతో చిన్నారిని నిందితుడు తీసుకు వెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చిన్నారి కేకలు వేయడంతో తల్లి వచ్చి పాప పరిస్థితిని గమనించి వైద్యుని వద్దకు తీసుకెళ్లడంతో అసలు విషయం బయటపడింది. కౌతాళం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ అశోక్ కుమార్ తెలిపారు.

ఐదంతస్తుల లోపు భవన ప్లాన్లకు స్వీయ ధ్రువీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ఐదు అంతస్తులు లేదా 18 మీటర్లలోపు భవనాలకు స్వీయ ధ్రువీకరణతో అనుమతులు ఇవ్వనున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల నుండి ఎటువంటి అనుమతులూ అవసరం ఉండదని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ కార్యాలయం తెలిపింది. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేసింది. భవన యజమానులు రిజిస్టర్డ్ ఎల్‌టిపిలు, ఇంజనీర్లు, ఆర్కిటెక్టుల సమక్షంలో సరైన ధ్రువపత్రాలు సమర్పించి స్వీయ ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుందని అందులో పేర్కొన్నారు. దీనిపై గత నెలలో జిఓ ఇచ్చినా సాంకేతిక కారణాలతో ఆగిపోయిందని, సోమవారం నుండి అమల్లోకి వచ్చిందని పేర్కొంది. వాతావరణ ఆధారిత సంస్కరణలపై జాతీయస్థాయిలో గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధిశాఖతో ఎపి ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొంది. ఒప్పందంపై పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, ఎమ్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి సంతకాలు చేశారు. వేస్ట్‌మేనేజ్‌మెంట్ దీనిలో ప్రధాన అంశంగా ఉందని పట్టాభిరామ్ తెలిపారు.

అర్జెంటీనాలో వందకు పైగా ఆరోగ్య సంఘాల నిరసనలు, ఆందోళనలు

- అధ్యక్షుడి విధానాలను నిరసిస్తూ రాజధానిలో భారీ ప్రదర్శన

బ్యూనస్ ఎయిర్స్ : అధ్యక్షుడు జేవియర్ మిలె విధానాలను నిరసిస్తూ అర్జెంటీనాలోని వందకు పైగా హెల్త్ గ్రూపులు దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలకు దిగాయి. ఔషధాల కొరతకు కారణమవుతున్న ప్రభుత్వ విధానాలను వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సిబ్బంది కొరత చాలా తీవ్రంగా వుందని వారు పేర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగానికి చెందిన వందకు పైగా గ్రూపులు, సంస్థలు ఫిబ్రవరి 27వ తేదీన ఆందోళన నిర్వహించాయి. రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో పెద్ద ఎత్తున ప్రదర్శన చేపట్టారు. ఆరోగ్య వ్యవస్థకు తగిన రీతిలో నిధులు కేటాయించక పోవడం వల్ల పని పరిస్థితులు అధ్వానంగా మారుతున్నాయని, పైగా సిబ్బంది కూడా తీవ్రంగా కొరవడడంతో ప్రభుత్వ ఆస్పత్రులపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, రోగులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మిలె అధికారం చేపట్టిన నాటినుండి అర్జెంటీనా ఆరోగ్య సంరక్షణా వ్యవస్థ అనేక ఎదురు దెబ్బలు తింటోంది. ఆర్థిక భారాలను ప్రావిన్స్‌లపైకి నెట్టేయడం, ఆరోగ్య సంరక్షణా రంగాన్ని ప్రైవేటీకరించడం, బడ్జెట్‌లో తీవ్రమైన కోతలు ఇలా పలు చర్యలతో ఆయన ఆరోగ్య రంగాన్ని నిర్వీర్యం చేశారు. ఈ విధానాల కారణంగా ప్రాణాధార మందులకు కొరత ఏర్పడింది. వైద్య సిబ్బంది తగిన సంఖ్యలో లేరు, కేన్సర్‌కు వాడే మందులు, చికిత్సలు కూడా అందుబాటులో లేకపోవడంతో అటు వైద్య నిపుణుల్లో, ఇటు రోగుల్లో తీవ్ర అసహనం, ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకుంటున్నాయి. జాతీయ వ్యాక్సినేషన్ కార్యక్రమాలు కూడా దెబ్బ తింటున్నాయి. మానసిక ఆరోగ్య చికిత్సలు, వృద్ధులకు అవసరమైన వైద్య సేవలు ఏవీ కూడా అందుబాటులో వుండడం లేదు. గతంలో సమగ్ర వైద్య కార్యక్రమం కింద అందించే అనేక రకాలైన కీలకమైన మందులు, యాంటీ వైరల్స్, యాంటీబయోటిక్స్ వంటి వాటిని ఆరోగ్య శాఖ కుదించేసింది. దీంతో ఎయిడ్స్, టిబి వంటి వ్యాధులతో బాధపడేవారు బాగా ఇబ్బందులు పడుతున్నారు.

అమెరికాకు రుణపడి వున్నాం !

- జెలెన్స్కీ వీడియో సందేశం
- ఖనిజ ఒప్పందం కుదుర్చుకోవడానికి సిద్ధమేనని వెల్లడి

కీవ్ : రష్యాతో ఇన్నాళ్లుగా సాగిస్తున్న యుద్ధంలో తమకు అన్ని విధాలా మద్దతునిచ్చినందుకు అమెరికాకు రుణపడి వున్నామని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన సోమవారం వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. 'ఆఫ్‌కోర్స్... అమెరికా ప్రాధాన్యతను అర్థం చేసుకున్నాం. ఇన్నాళ్లుగా మాకు అందిన తోడ్పాటుకు మేం చాలా కృతజ్ఞులై వున్నాం." అని ఆయన అందులో పేర్కొన్నారు. శుక్రవారం వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో ట్రంప్‌తో భేటీ సందర్భంగా ఇరువురు మధ్య అనూహ్యమైన రీతిలో ఘర్షణ జరిగిన నేపథ్యంలో ఈ వీడియో పోస్ట్ విడుదల చేశారు. ఓవల్ ఆఫీసులో తలెత్తిన అసాధారణ పరిస్థితుల నేపథ్యంలో యూరప్ నుండి తాము స్పష్టమైన మద్దతును కోరుకుంటున్నామని జెలెన్స్కీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. " నిజమైన శాంతి నెలకొనాలంటే మాకు నిజమైన భద్రతా హామీలు కావాలి. ప్రధాన అంశమైన దీనిపై అందరూ సమైక్యంగానే వున్నారు. మొత్తంగా యూరప్ ఖండమంతా ఒకే వైఖరితో వుంది." అని జెలెన్స్కీ వ్యాఖ్యానించారు.

అమెరికాతో ఖనిజాల ఒప్పందం కుదుర్చుకోవడానికి ఉక్రెయిన్ సిద్ధంగా వుందని జెలెన్స్కీ ఆదివారం బ్రిటన్ మీడియాతో చెప్పారు. సంబంధిత పక్షాలు సిద్ధంగా వుంటే ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని చెప్పారు. లండన్‌లో ఆదివారం బ్రిటన్ ప్రధానితో సమావేశానంతరం హడావిడిగా రాత్రి పొద్దుపోయిన తర్వాత ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ విషయం ప్రకటించారు. ఆదివారం నాటి సదస్సులో యూరప్ మిత్రులందరూ జెలెన్స్కీకి మద్దతు ప్రకటించారు. భద్రతపై మరింత ఖర్చు పెట్టేందుకు పలువురు నేతలు అంగీకరించారు.ఈ ఖనిజ ఒప్పందం కుదిరినట్లైతే ఉక్రెయిన్‌లో యుద్ధానికి స్వస్తి చెప్పే దిశగా ఒక అడుగు ముందుకు పడినట్లవుతుంది. గతంలో ఏదైతే జరిగిందో అది కొనసాగించాలన్నది మా విధానం, ఈ విషయంలో మేం నిర్మాణాత్మకంగానే వున్నామని చెప్పారు. రష్యాతో యుద్ధం విరమింపజేసేందుకు ఒప్పందం కుదరడంలో సాయపడినట్లైతే అమెరికాకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలన్నది ప్రతిపాదన.

రష్యాపై సైబర్ దాడులకు తాత్కాలిక విరామం

వాషింగ్టన్ : రష్యాపై సైబర్ దాడులకు విరామం ఇవ్వాల్సిందిగా అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేత్ ఆదేశించారు. మాస్కోకు వ్యతిరేకంగా అమెరికా కార్యకలాపాలను మొత్తంగా పున: సమీక్షించే ప్రక్రియలో భాగంగా ఈ ఆదేశాలు జారీ అయ్యాయని భావిస్తున్నారు. ఎంతకాలం ఈ విరామం కొనసాగుతుందనేది స్పష్టం కాలేదు. భద్రతా కారణాల రీత్యా సైబర్ నిఘా ప్రణాళికలపై లేదా కార్యకలాపాలపై వ్యాఖ్యానించేది లేదని రక్షణ శాఖ సీనియర్ అధికారి వ్యాఖ్యానించారు.

నెల రోజుల కాల్పుల విరమణకు ఫ్రాన్స్, బ్రిటన్ ప్రతిపాదన

రష్యా, ఉక్రెయిన్ మధ్య ఒక నెల రోజుల పాటు కాల్పుల విరమణ ఒప్పందానికి ఫ్రాన్స్, బ్రిటన్‌లు ప్రతిపాదించాయని ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ తెలిపారు. ఫ్రాన్స్ వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ఈ ఒప్పందంలో భాగంగా వైమానిక, సముద్ర జలాల, ఇంధన సదుపాయాలకు సంబంధించి కాల్పుల విరమణ అమలు జరుగుతుందని కానీ తొలి దశలో భూతల పోరాటాన్ని ఇందులో చేర్చలేమని ఆయన వ్యాఖ్యానించారు. రాబోయే వారాల్లో ఉక్రెయిన్ గడ్డపై యురోపియన్ బలగాలు వుండబోవని స్పష్టం చేశారు. కాల్పుల విరమణ రెండో దశలో మాత్రమే యురోపియన్ పదాతి బలగాలు ఉక్రెయిన్‌లో మోహరించబడతాయని తెలిపారు.

హర్షవర్ధన్ (ఫైల్)

మణికంఠ (ఫైల్)

షేక్ అబ్దుల్లా (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట (కాకినాడ జిల్లా)
కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం జంక్షన్ సమీపంలోని 216 నంబరు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన రౌతుల హర్షవర్ధన్ (15), వేణుం మణికంఠ (17), షేక్ అబ్దుల్లా (15) కలిసి బూరుగుపూడి నుంచి ద్విచక్రవాహనంపై జగ్గంపేటకు బయలుదేరారు. రామవరం సమీపానికి వచ్చేసరికి భారీ సామగ్రిని తరలించే ట్రాలీని ఓవర్‌టేక్ చేయబోయి దానిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్, అబ్దుల్లా అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మణికంఠను స్థానిక సిహెచ్‌సికి తరలించినా ఫలితం లేకపోయింది.సమాచారం అందుకున్న జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. ట్రాలీ డ్రైవర్ పరారీలో ఉన్నారని, కేసు నమోదు చేశామని తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నిబంధనలకు విరుద్ధంగా గోదావరి-బనకచర్ల పథకం

- జిఆర్ఎంబి, కెఆర్ఎంబి నుంచి అనుమతులు పొందలేదు
- జల్‌శక్తి మంత్రికి తెలంగాణ సిఎం ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పునర్విభజన చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకానికి రూపకల్పన చేసిందని జల్‌శక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ పథకానికి సంబంధించి కేంద్ర జల సంఘం, గోదావరి నది యాజమాన్య బోర్డు (జిఆర్ఎంబి), కెఆర్ఎంబిల నుంచి ఎపి ప్రభుత్వం ఎటువంటి అనుమతీ పొందలేదని వివరించారు. జల్‌శక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ వివరాలను మీడియాకు వారు వివరించారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉన్న అపెక్స్ కౌన్సిల్‌లోనూ గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై ఎటువంటి చర్చా జరగలేదన్నారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడుకునే విషయంలో తాము ఏ మాత్రమూ రాజీపడబోమని చెప్పారు. గోదావరికి సంబంధించి తెలంగాణ వాటా నికర జలాలు తేల్చిన తర్వాతే ఎపి ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకోవాలని కేంద్రమంత్రిని కోరామని తెలిపారు. కృష్ణా నది పరివాహకంలో సుమారు 70 శాతం తెలంగాణలో ఉంటే కేవలం 30 శాతం మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లో ఉందన్నారు. కాబట్టి కృష్ణా జలాల్లో 70 శాతం వాటా తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని జల్‌శక్తి మంత్రిని విజ్ఞప్తి చేశామన్నారు. ఏళ్లుగా తాము నష్టపోతున్నామని, ఈ ఏడాది సైతం ఆంధ్రప్రదేశ్ తమకు కేటాయించిన మొత్తానికి మించి నీరు తరలించుకుపోయిందని ఆరోపించారు. ఇక ముందు తమ వాటాకు మించి కృష్ణా నది నీటిని ఎపి తరలించుకుపోకుండా చూడాలని జల్‌శక్తి మంత్రిని కోరామని చెప్పారు. కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించి వెంటనే టెలీ మెట్రీ యంత్రాలు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అందుకయ్యే మొత్తాన్ని తామే భరిస్తామని తెలియజేశామని చెప్పారు. గోదావరిపై తాము చేపట్టిన సీతారామ ఎత్తిపోతల, సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. గోదావరి నదిలో తెలంగాణకు సంబంధించి నికర జలాల వాటాలు తేల్చాలని, గోదావరిపై తెలంగాణ చేపడుతున్న ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని, అలా చేయకపోతే ఆయకట్టు స్థిరీకరణ పేరుతో తాము నష్టపోతామని, కృష్ణా డెల్టా ఆయకట్టును చూపి కృష్ణా జలాల్లో తెలంగాణకు నష్టం చేశారని ఆరోపించారు.

విశిష్ట అభివృద్ధి నమూనా అమలు

- కర్ణాటక అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో గవర్నర్

బెంగళూరు : కర్ణాటకలో విశిష్టమైన అభివృద్ధి నమూనాను అమలు చేస్తున్నామని ఆ రాష్ట్ర గవర్నర్ థాపర్‌చంద్ గెహ్లాట్ తెలిపారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ సంప్రదాయ ప్రసంగం చేశారు. రాష్ట్రంలో బెంగళూరు, మైసూరు వంటి నగరాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం కోసం సిద్ధరామయ్య ప్రభుత్వం చేపట్టిన కృషిని గవర్నర్ తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. ముఖ్యంగా బెంగళూరు నగరంలో 40.50 కిమీ పొడవు మెట్రో రైలు, రోడ్డుతో కూడిన డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌ను రూ.8,916 కోట్ల నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని గవర్నర్ తెలిపారు.

ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలి

- అంతర్జాతీయ సమాజానికి హమాస్ వినతి
- గాజాలోకి సాయం ఆపడంపై వెల్లువెత్తిన ఖండనలు
- కాల్పుల్లో ఇద్దరు పాలస్తీనియన్ల మృతి

గాజా : కాల్పుల విరమణ ఒప్పందం రెండో దశలోకి ప్రవేశించడానికి నిరాకరించడం ద్వారా ఇజ్రాయిల్ మళ్లీ గాజాలో పరిస్థితులు మొదటకు తీసుకురావాలని ప్రయత్నిస్తోందని హమాస్ విమర్శించింది. మొదటి కాల్పుల విరమణ ఒప్పందాన్నే పొడిగించాలని కోరింది. ఒప్పందాన్ని కుదుర్చుకునేలా ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుపై ఒత్తిడి తీసుకురావాల్సిందిగా అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. ఇజ్రాయిల్ సాగించే దుశ్చర్యలకు అంతర్జాతీయ దేశాలు మౌనం పాటిస్తున్నాయని, దీనివల్ల ప్రపంచ దేశాల భద్రత, సుస్థిరత ప్రమాదంలో పడతాయని హమాస్ సీనియర్ అధికారి వ్యాఖ్యానించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో కూడా జాతి నిర్మూలన యుద్ధం పునరుద్ధరించాలని ఇజ్రాయిల్ చూస్తోందని విమర్శించారు.

కొత్త కాల్పుల విరమణ ప్రతిపాదనను అంగీకరించేలా హమాస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు గాజాలోకి మానవతా సాయాన్ని వెళ్లనివ్వకుండా ఇజ్రాయిల్ ఆపేసింది. ఈ చర్యకు ప్రపంచవ్యాప్తంగా ఖండనలు వెల్లువెత్తాయి. ఈ చర్య మానవతా సహాయ చట్టం, కాల్పుల విరమణ ఒప్పంద నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని ఈజిప్ట్, ఖతార్, జోర్డాన్, టర్కీ విమర్శించాయి. ఇటువంటి చర్యలు గాజాలో శాశ్వత శాంతి స్థాపనకు జరిగే యత్నాలను తీవ్రంగా దెబ్బ తీస్తాయని టర్కీ ఒక ప్రకటనలో పేర్కొంది. గాజాలోకి రావాల్సిన సాయం ఆగిపోయినా, పాలస్తీనియన్లు మాత్రం ఇంకా ఆశతోనే వున్నారు. కాల్పుల విరమణ చర్చలు ముగియలేదని వారు భావిస్తున్నారు. మళ్లీ యుద్ధం తలెత్తదని, దౌత్యం ఫలిస్తుందని, సాయం అందుతుందని వారు ఆశిస్తున్నారు. ప్రస్తుతానికైతే పరిస్థితులు చాలా దారుణంగా వున్నాయని పేర్కొంటున్నారు. దక్షిణ గాజాలో ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడుల్లో ఇద్దరు పాలస్తీనియన్లు మరణించారు. ముగ్గురు గాయపడ్డారు

పేదరికంలోనే...

(మొదటి పేజీ తరువాయి)

పేదలు జాతీయ స్థాయిలో ఉండగా, రాష్ట్ర స్థాయిలో 7.71శాతం ఉన్నారని, పట్టణ ప్రాంతాల్లో జాతీయ స్థాయిలో 5.27శాతానికి గానూ రాష్ట్రంలో 2.20 శాతం పేదలు ఉన్నారని వివరించారు. అయితం, 2015-16 (0.053 ఎంపిఐ స్కోర్) తో పోలిస్తే 0.025 ఎంపిఐ స్కోర్‌కు (50శాతం) పేదరికం తగ్గిందని సర్వే నివేదికలో తెలిపారు.

అన్ని కీలకాంశాల్లోనూ వెనకబాటే

పేదరికాన్ని కొలబద్దలుగా ఉండే అన్ని కీలకాంశాల్లోనూ రాష్ట్రం వెనుకబాటులోనే ఉంది. పౌష్టికాహారంలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా, మన రాష్ట్రం పదవ స్థానంలో ఉంది. శిశుమరణాలను నివారించడంలో కేరళ మొదటి స్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ 11 వ స్థానంలోనూ, ప్రసూతి ఆరోగ్యంలో కేరళ మొదటిస్థానంలో ఉండగా రాష్ట్రం11వ స్థానంలో ఉంది. బడిలో పిల్లలను చేర్చడం, డ్రాప్ అవుట్లు లేకుండా చూడటం, గృహ వసతి, ఆరోగ్య సౌకర్యాలు, విద్యుత్, తాగునీరు తదితర వివిధ అంశాల్లోనూ మన రాష్ట్రం వెనకబాటులోనే ఉంది. ఒక్క దానిలో కూడా మొదటి స్థానంలో లేకపోవడం గమనార్హం.

మీ కోసం

వెల్లుల్లి పైపొట్టు సులభంగా రావాలంటే పాన్‌లో ఓ పదిసెకన్లు వాటిని వేడిచేయాలి.

జీవన సౌరభం

చేసే పనిలో అడ్డంకులు వస్తే ఆపాల్సింది పని కాదు.. ప్రయత్నించే విధానం.

సాలీడు గూడు

అమెజాన్ నదీ పరీవాహక ప్రాంతంలో సూర్యరశ్మి నేలను తాకనంత దట్టమైన అడవి ఉంది. ఆ అడవిలో చెట్టుకొమ్మల మధ్య చక్కని గూడు కట్టుకుంది సాలీడు. ఆ గూటిలో చిక్కుకున్న క్రిమి కీటకాలను తిని హాయిగా జీవిస్తోంది. ఇలా కాలం గడిచింది.

ఒకరోజు ఒక కప్ప పిల్ల సాలీడుని తినాలని అనుకుంది. ఆకు మీద నుంచి ఎగిరి సాలెగూడు మీద పడింది. అయితే అది సాలెగూడులో చిక్కుకుపోయింది. ఎంత ప్రయత్నించినా ఆ దారాల నుంచి బయటపడలేకపోయింది.

గూడు కదలడంతో ఎవరో తన గూట్లోకి వచ్చి చిక్కుకున్నారని, తినవచ్చని సాలీడు భావించింది. కానీ వచ్చి చూసేసరికి అది కప్ప పిల్ల. తినడానికి పనికొచ్చేది కాదు. కప్పపిల్ల విడిపించుకోడానికి తీవ్ర ప్రయత్నం చేసి, వీలుకాక నిశ్చలంగా ఉండిపోయింది. కప్పపిల్ల అవస్థ చూసి సాలీడు చాలా బాధపడింది. ఎంతో కష్టపడి కట్టుకున్న గూడును నోటితో కొరికి కప్ప పిల్ల ప్రాణాలను కాపాడింది.

'నీ గూటిలో నుంచి బయటపడటం నా వల్ల కాలేదు ఎంతో ప్రత్యేకమైన నీ గూటి రహస్యం చెప్పవా? అని అడిగింది కప్ప పిల్ల. దానికేం భాగ్యం చెప్తాను విను 'నా శరీరం రెండు భాగాలుగా విభజింపబడి ఉంటుంది. తలభాగం ఛాతీ భాగంతో కలసి ఉంటుంది. నాకు ఎనిమిది (8) కాళ్ళు ఉంటాయి. శరీరపు వెనక భాగం కింది వైపు పట్టుదారం తయారు చేసే గ్రంధులు ఉంటాయి. గ్రంధుల నుండి స్రవించే చిక్కటి జిగురు వంటి ద్రవపదార్థం గాలికి చల్లబడి దారంగా మారుతుంది. ఆ దారంతో చెట్టుకొమ్మల మధ్య చక్కగా వల లాగ గూడు అల్లుతాను. నాకు నమిలే అవయవాలు లేవు. నోటిలో స్రవించే విషం ఆహారన్ని జీర్ణం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది' అని చెప్పింది సాలీడు.

'నేను నిన్ను తినడానికి వచ్చానని తెలిసి కూడా నన్ను ఎందుకు రక్షించావు?' అని అడిగింది కప్పపిల్ల. 'ఆహార సంపాదన కోసం ఎవరి ప్రయత్నం వారిది. ఆ సమయంలో నా గూటిలో చిక్కుకున్నావు. అంత మాత్రం చేత నిన్ను ఆహారంగా తీసుకోలేను. నీ బాధ చూడలేక నీకు సహకరించాను' అంది సాలీడు. సాలీడు ఔదార్యానికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకుంది కప్పపిల్ల.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
ఆంగ్ల ఉపాధ్యాయులు,
జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,
లక్కవరపు కోట,
94945 24445.

నేను గీసిన బొమ్మ

ఎల్. మహేష్,
7వ తరగతి,
ఎస్. కె. వి. టీ. ప్రభుత్వ
ఉన్నత పాఠశాల,
రాజమహేంద్రవరం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఒత్తిడి వద్దే వద్దు...'పది'ని జయించు

నూతన సిబిఎస్‌సి సిలబస్‌తో పదో తరగతి పరీక్షలు మొదటి సారిగా మన రాష్ట్రంలో ఈనెల 17 నుంచి ప్రారంభంకానున్నాయి. పరీక్షల సమయంలో సాధారణంగా విద్యార్థులు ఒత్తిడికి గురౌతుంటారు. ఇది ఏమాత్రం సరికాదు. ప్రశాంతంగా ఉండాలి. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఉండాలి. తద్వారానే పరీక్షల్లో మంచిగా పరీక్షలు రాసి తద్వారా మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది. ఏడాదిపాటు చదివిన అంశాలే కాబట్టి అన్ని ప్రతిరోజూ అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠాలను చదువుకుంటూ వెళ్లటం ఉత్తమం. తద్వారా గతంలో చదివిన విషయాలను మళ్లీ ఒకసారి గమనంలోకి తెచుకోవటానికి అవకాశం ఉంటుంది. అందువల్ల పిల్లలూ ఎవ్వరూ ఒత్తిడికి గురికావద్దు. ప్రణాళికాబద్ధంగా కషిచేస్తే మంచి మార్కులతో విజయం సాధించటం సులభమే అవుతుంది. ఏడాదిలో కష్టపడి చదివింది ఎలాంటి తప్పిదాలకు తావీయకుండా 3.15 గంటల సమయంలో (పిఎస్, ఎన్ఎస్ పరీక్షలు 2 గంటలు మాత్రమే) పరీక్షల్లో సమర్థవంతంగా రాయగలిగినప్పుడే చక్కని ఫలితం చేజిక్కుతుంది. చిన్న తప్పిదాల కారణంగా ప్రతిభావంతులు సైతం ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశం కోల్పోతుంటారు.

జవాబులు ఇలా రాయాలి

ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలు విద్యార్థుల పరిశీలన, విశ్లేషణ, అవగాహన శక్తిని వెలికితీసేలా ఉంటాయి. అందుకే ప్రశ్నాపత్రాన్ని చదవడానికే పావుగంట సమయం ఇచ్చారు. సుమారు 75శాతం మంది ప్రశ్నాపత్రాన్ని తీసుకున్న 5 నిమిషాల్లోనే జవాబులు రాయటం మొదలెడుతున్నారు. ఇది సరికాదు. ముందుగా ప్రశ్నలను బాగా చదవాకే సమాధానాలు రాయటం ప్రారంభించాలి. సమాధాన పత్రాలతో కూడిన బుక్‌లెట్ ఇవ్వగానే ముందుగా ప్రతి పేజీకి ఎడమవైపు 2–2.5సెంటీమీటర్లు ఉండేలా మార్జిన్ వదలాలి.

తెలుగులో మూడు భాగాలుంటాయి. మొదటి భాగంలో 32 మార్కులు సులభంగా సాధించొచ్చు. వీటిలో పరిచిత పద్యాలు 21 ఉన్నాయి. వీటిలో 8 సాధన చేస్తే మంచి మార్కులు సాధించొచ్చు. పద్య భాగంలో కవి పరిచయం, గద్యంలో ప్రక్రియలు, లేఖ, కరపత్రం అంశాలు, ఛందస్సులో వృత్తపద్యాలపై ప్రశ్నలొస్తాయి. మారీచుడు, కైక, విశ్వామిత్రుడు, సుగ్రీవుడు, దశరథుడు వంటి అంశాలతోపాటు రామాయణం ప్రాశస్త్యం, తదితర అంశాలపై పట్టుసాధిస్తే మంచి మార్కులు సాధించొచ్చు.

హిందీ సబ్జెక్ట్‌లో తొలుత ప్రశ్నావళిని అవగాహన చేసుకొని ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. సెక్షన్–1లో 12 ప్రశ్నలు వ్యాకరణానికి సంబంధించినవి ఉంటాయి. పేరాగ్రాఫ్ పాసేజ్ చక్కగా చదివి జవాబులు రాయాలి. 13,14,15,16 ప్రశ్నల్లో కీలక పదాన్ని గుర్తించి సమాధానాన్ని తేలికగా వెదికి జవాబు రాయాలి. 17 ప్రశ్న కబీర్, మైథిలి, శరణగుప్తలో కవి పరిచయం వస్తుంది. 19వ ప్రశ్న సాఖీ పాఠంలోని 4 దోహాలలో ఒకటి తప్పనిసరిగా వస్తుంది. వీటిని జాగ్రత్త చదవడం ద్వారా మంచి మార్కులు పొందొచ్చు.

ఇంగ్లీషు ప్రశ్నాపత్రంలో మొత్తం మూడుసెక్షన్లు ఉంటాయి. ప్రశ్నా పత్రంలోని ప్రశ్నలు క్షుణ్ణంగా చదివి జవాబులు రాయాలి. కాంప్రహెన్షన్ ప్యాసేజ్‌లో ప్రశ్నలకు ఇచ్చిన టెక్స్ట్‌లోనే సమాధానాలు ఉంటాయి. దీంతో సులభంగానే 30 మార్కులు సాధించొచ్చు. సెక్షన్ బిలో గ్రామర్ అండ్ ఒకాబులరీలో యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, ప్రిపోజిషన్స్, డిక్షనరీ ఎంట్రీ, స్పెల్లింగ్ టెస్ట్, సిఫిక్స్–ప్రిఫిక్స్ వంటివి తేలికగా జవాబులు రాయొచ్చు. సెక్షన్ సిలో క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్ సొంతంగా రాయడం ద్వారా మంచి మార్కులు సాధించొచ్చు. సమాధానాలన్నీ ఒకేచోట క్రోనాజికల్ ఆర్డర్‌లో రాయాలి.

గణితశాస్త్రంలో మార్కుల సాధన సులభం. సంభావ్యత బహుపదులు, వాస్తవ సంఖ్యలు, నిరూపక రేఖాగణితం అధ్యాయాలపై ప్రత్యేక ప్రాక్టీసు చేయాలి. నిరూపక జామితి పాఠ్యాంశం నుంచి సెక్షన్ నాలుగు లేదా ఎనిమిది మార్కులకు, సాంఖ్యకశాస్త్రంలోని మీన్, మోడ్, మీడియన్‌లపై తప్పనిసరిగా ప్రశ్న ఉంటుంది. గ్రాఫ్‌పై సాధన చేస్తే మంచి మార్కులు సాధించొచ్చు.

భౌతిక రసాయన శాస్త్రంలో 50/50 మార్కులు సాధించొచ్చు. ఎస్సీఆర్టీ వారు అందించిన స్టడీమెటీరియల్‌ను సాధన చేయడం ద్వారా మంచి మార్కులు పొందొచ్చు. లోహాలు, అలోహాలు పాఠం నుంచి ప్రయోగం నేర్చుకుంటే సులభంగా ఎనిమిది మార్కులు పొందొచ్చు. మయోపియా, హైపర్ మెట్రోపియా దృష్టి లోపాలు, వాటిని సవరించే విధానం నేర్చుకోవాలి. ఇంద్రధనుస్సు ఏర్పడే విధానం కాంతి పరిక్షేపణ వంటి ప్రశ్నలు ప్రశ్నలు బాగా సాధన చేస్తే మంచి మార్కులు వస్తాయి. బొమ్మలు గీసేటపుడు స్పష్టతతో ఉంటే మంచి ఫలితాలు సొంతం చేసుకోవచ్చు. భౌతికశాస్త్రంలోని సమస్యల (ప్రాబ్లమ్స్)లో ప్రమాణాలను రాయడం మరిచిపోరాదు. ఉధాహరణకు సెంటీ మీటరు, గ్రాము, జౌలు, వాట్స్ తదితరాలు. జీవశాస్త్రంలో ప్రయోగాలకు చెందిన జవాబులను రాసేటప్పుడు సంబంధిత బమ్మలను కూడా తప్పక వేయాలి. గణితంలో ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలు రివిజన్ చేయాలి. టెక్స్ట్‌బుక్ చాప్టర్ చివరలో ఉండే సమస్యలను మరొక్కసారి రివిజన్ చేసుకోవాలి.

సాంఘిక శాస్త్రంలోని మ్యాప్ పాయింట్‌కు మంచి ప్రాధాన్యత ఇవ్వాలి. పైచార్టు, మ్యాప్ రీడింగ్ ప్రశ్నలను తప్పనిసరిగా రాయాలి. సమకాలీన అంశాల్లో మూస ధోరణులకు ప్రాధాన్యం తగ్గించి, సొంత అవగాహనతో నిత్య జీవిత ఉదాహరణలు అన్వయిస్తూ రాయాలి. ఎస్సీయారిటీ వారు ఇచ్చిన ప్రశ్నాపత్రాలు ప్రాక్టీస్ చేయాలి.సమాచార నైపుణ్యాలపై ఆర్థశాస్త్రంలోని మొదటి మూడు పాఠాలలోని సమాచార పట్టికలు, బార్‌గ్రాఫ్‌ను అధ్యయనం చేస్తే మంచి మార్కులు సాధించొచ్చు.

ప్రశ్నాపత్రంలో బాగా వచ్చిన ఏ ప్రశ్నకైనా ముందుగా జవాబు రాయొచ్చు. ఆ ప్రశ్న నంబరును ఎడమవైపు మార్జిన్‌లో తప్పక వేయాలి. ప్రశ్నల నంబర్లు తప్పుగా వేయడం, మరిచిపోవడం చేసేవారు 1శాతం వరకూ ఉంటారు.

ఈ జాగ్రత్తలు పాటించండి

- ఒత్తిడికి గురికాకూడదు.
- తక్కువ సమయంలో రివిజన్ చేసుకోవాలి
- కొత్త అంశాలు నేర్చుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి
- ఆహారం, నిద్ర, వ్యాయామానికి తగినంత సమయాన్ని కేటాయించాలి
- ఎన్సీఆర్టీ ప్రశ్నలనిధి. మాదిరి పశ్నా పత్రాలు ప్రాక్టీస్ చేయాలి
- ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి
- సెల్‌ఫోన్, టివి, కంప్యూటర్లకు దూరంగా ఉండాలి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఎర్ర సిరా ఉండే (బాల్)పెన్ను వాడకూడదు. నీలం బ్లూ, నలుపు సిరా ఉండే వాటినే ఉపయోగించాలి.
- పెద్ద అక్షరాలతో, మరీ ఎక్కువ మార్జిన్ వదిలి భారీగా పేజీలు నింపడం వల్ల ప్రయోజనం శూన్యం.
- ప్రతి పుటకు 20–25 వాక్యాలు రాస్తే మేలు.
- జవాబులను వ్యాసంలా కాక బుల్లెట్ పాయింట్ల రూపంలో రాయాలి.
- రాయాల్సినవన్నీ పూర్తయ్యాకే ఐచ్ఛిక (ఛాయిస్) ప్రశ్నలు రాయడానికి ప్రయత్నించాలి.
- కొట్టివేతలు, దిద్దివేతలు ఉండరాదు. బ్రాకెట్‌లో ఒకటి రాసి, మళ్లీ కొట్టివేసి బయట రాయటం మంచిది కాదు.
- సాధ్యమైనంత వరకు 10–15 నిమిషాలు ముందే పరీక్ష రాయటం పూర్తిచేయాలి.
- రాసిన జవాబులు, ప్రశ్నల నంబర్లను మరోసారి పరిశీలించుకోవాలి.

ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయండి... విజయాన్ని సాధించండి. అభినందనలతో

– ఎస్.పి.మనోహర్ కుమార్,
యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి,
సెల్ : 9490762412

ఆస్కార్ విజేతలు వీరే..

ప్రపంచ సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూసిన ఆస్కార్ అవార్డుల సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. లాస్ ఏంజెలెస్ డాల్బీ థియేటర్‌లో జరిగిన 97వ అకాడెమీ అవార్డుల వేడుకకు హాలీవుడ్ ముఖ్య తారాగణంతో పాటు, సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపొందిన 'అనోరా'కు ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటి, స్క్రీన్‌ప్లే, ఎడిటింగ్ విభాగాల్లో వరుసగా నాలుగు అవార్డులను సొంతం చేసుకుంది. 'ది బ్రూటలిస్ట్'లో నటనకు గానూ ఉత్తమ నటుడిగా అడ్రియన్ బ్రాడీ.. 'అనోరా'లో నటనకు మైకీ మ్యాడిసన్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. సీన్ బేకర్ (అనోరా) ఉత్తమ దర్శకుడిగా అవార్డు సొంతం చేసుకున్నారు. 'ఎ రియల్ పెయిన్' చిత్రానికి కీరన్ కైల్ కల్కిన్ ఉత్తమ సహాయ నటుడిగా.. 'ఎమిలియా పెరెజ్'లో నటనకు జోయా సాల్డానా ఉత్తమ సహాయ నటిగా ఆస్కార్ అందుకున్నారు.

గతేడాది బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన 'డ్యూన్ : పార్ట్2' ఉత్తమ సౌండ్, విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో ఆస్కార్‌ను సొంతం చేసుకుంది. ఇక లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో మన దేశం నుంచి నామినేషన్‌లో నిలిచిన 'అనూజ' చిత్రం ఆస్కార్ రేసులో నిలవలేకపోయింది. ఆ కేటగిరిలో 'ఐయామ్ నాట్ ఏ రోబో' ఉత్తమ లఘు చిత్రంగా అవార్డును గెలుచుకుంది.

విజేతలు వీళ్లే..

ఉత్తమ చిత్రం – అనోరా, ఉత్తమ నటుడు – అడ్రియన్ బ్రాడీ (ది బ్రూటలిస్ట్), ఉత్తమ నటి – మైకీ మ్యాడిసన్ (అనోరా), ఉత్తమ దర్శకత్వం – అనోరా (సీన్ బేకర్), ఉత్తమ సహాయ నటుడు – కీరన్ కైల్ కల్కిన్ (ది రియల్ పెయిన్), ఉత్తమ సహాయ నటి – జోయా సాల్డానా (ఎమిలియా పెరెజ్), ఉత్తమ స్క్రీన్‌ప్లే – అనోరా (సీన్ బేకర్), ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే – కాన్క్లేవ్ (పీటర్ స్ట్రాగన్), ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ – వికెడ్ (పాల్ తేజ్‌వెల్), ఉత్తమ మేకప్, హెయిల్‌స్టైల్ – ది సబ్‌స్టాన్స్, ఉత్తమ ఎడిటింగ్ – అనోరా (సీన్ బేకర్), ఉత్తమ సినిమాటోగ్రఫీ – ది బ్రూటలిస్ట్ (లాల్ క్రాలే), ఉత్తమ సౌండ్ – డ్యూన్: పార్ట్2, ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ – డ్యూన్ :పార్ట్2, ఉత్తమ ఒరిజినల్ సాంగ్ – ఎల్ మాల్ (ఎమిలియా పెరెజ్), ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ – ఐయామ్ స్టిల్ హియర్ (వాల్టర్ సాల్లెస్– బ్రెజిల్),ఉత్తమ ఒరిజినల్ స్కోర్ – ది బ్రూటలిస్ట్ (డానియల్ బ్లమ్‌బెర్గ్), ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ – వికెడ్, ఉత్తమ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ – ఐయామ్ నాట్ ఏ రోబో, ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్– ది, ఓన్లీ గర్ల్ ఇన్ ది ఆర్కెస్ట్రా, ఉత్తమ డాక్యు మెంటరీ ఫీచర్ ఫిల్మ్ – నో అదర్ ల్యాండ్, ఉత్తమ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ – ఫ్లో, ఉత్తమ యానిమేటెడ్ షార్ట్‌ఫిల్మ్ – ఇన్ ది షాడో ఆఫ్ ది సైప్రెస్.

ఆసీస్ గండం గట్టెక్కితేనే...

- ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియాకు కఠిన పరీక్ష
- నేడు ఆస్ట్రేలియాతో సెమీఫైనల్ మ్యాచ్
- మ. 2.30గంILల నుంచి

దుబాయ్: ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో హ్యాట్రిక్ విజయాలతో సెమీస్‌కు చేరిన టీమిండియా నేడు కఠిన పరీక్షను ఎదుర్కోనుంది. గ్రూప్–ఎలో వరుసగా మూడు విజయాలతో సెమీస్‌కు చేరిన టీమిండియా.. గ్రూప్–బిలో టాప్–2లో ఉన్న ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగే తొలి సెమీఫైనల్లో తలడనుంది. ఆసీస్ జట్టు కూడా గ్రూప్–ఎలో ఓటమి చవిచూడనే జట్టే అయినా.. ఆ జట్టుకు స్టార్ ప్లేయర్ల గైర్హాజరీ వేధిస్తోంది. అలా అని ఆ జట్టును తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఇంగ్లండ్ 350పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన ఆసీస్.. ఎక్కువగా బ్యాటర్లపైనే ఆధారపడి ఉంది. లీగ్ దశలో భాగంగా దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్‌తో మ్యాచ్‌లు వర్షంతో రద్దు కావడంతో ఆ జట్టు ఈ గ్రూప్‌లో 4పాయింట్లతో 2వ స్థానంలో నిలిచింది. దీంతో ఆసీస్‌ను ఓడించాలంటే టీమిండియా చెమటోడ్చాల్సి ఉంది.

దుబాయ్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో టీమిండియా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. గ్రూప్–ఎలో బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లతో ఘన విజయం సాధించిన టీమిండియా.. ఆదివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై సమిష్టిగా రాణించింది. ఇక ఆస్ట్రేలియా విషయానికొస్తే.. మెగా టోర్నీల్లో ఆ జట్టును తక్కువగా అంచనా వేయకూడదు. గత వన్డే ప్రపంచ కప్ ఫైనల్లో భారత్‌ను చిత్తుచేసి టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. అదీ మన స్వదేశీ పిచ్‌లపైనే. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆసీస్ జట్టు గ్రూప్ స్టేజ్‌ను దాటడం కష్టమేనని అభిప్రాయపడ్డ క్రీడా నిపుణుల అంచనాలను తలక్రిందులు చేస్తూ.. ఆ జట్టు సెమీస్‌కు చేరడమే ఇందుకు ఒక ఉదాహరణ. స్టార్ పేసర్లు స్టార్క్, హేజిల్‌వుడ్, కమిన్స్‌తోపాటు మిచెల్ మార్ష్ దూరమైనా.. ఆ జట్టు అద్భుతంగా ఆడుతోంది. ఆసీస్ జట్టులో స్పెషలిస్ట్ స్పిన్నర్ ఆడమ్ జంపాపైనే ఎక్కువగా ఆధారపడి బరిలోకి దిగుతోంది.

ఆసీస్‌ను తక్కువ అంచనా వేయొద్దు

ఈసారి ఆస్ట్రేలియా ప్రధానంగా బలమైన బ్యాటింగ్ లైనప్‌తో ఛాంపియన్ ట్రోఫీ బరిలోకి దిగింది. భారత్‌పై దూకుడుగా ఆడే ట్రావిస్ హెడ్ ఫామ్‌లో ఉన్నాడు. మాథ్యూ షార్ట్ కూడా నిలకడగా ఆడుతున్నాడు. కానీ, గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలిగాడు. ట్రావిస్ హెడ్ మాదిరిగా దూకుడుగా ఆడే జేక్‌తో భారత బౌలింగ్‌కు ప్రమాదం తప్పదనేది క్రికెట్ విశ్లేషకుల అంచనా. మిడిలార్డర్‌లో లబుషేన్, జోష్ ఇంగ్లిస్, అలెక్స్ కేరీ అత్యంత ప్రమాదకరమైన బ్యాటర్లు. గ్లెన్ మ్యాక్స్‌వెల్‌తో పాటు కెప్టెన్ స్టీవ్ స్మిత్ ప్రమాదకర బ్యాటర్లు. ఈ క్రమంలో టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీని చేజిక్కించుకోవాలంటే ఆసీస్ జట్టును ఓడించి ఫైనల్‌కు చేరాల్సి ఉంది. గత నాలుగు ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీల్లో భారత్ 2–1 ఆధిక్యతలో ఉంది. ఒక మ్యాచ్‌లో ఆసీస్ విజయం సాధించగా.. మరో మ్యాచ్ ఫలితం రాలేదు.

జట్లు(అంచనా)...

భారత్: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, కోహ్లి, కెఎల్ రాహుల్(వికెట్ కీపర్), శ్రేయస్, హార్దిక్, అక్షర్, జడేజా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్, షమీ.

ఆస్ట్రేలియా: స్మిత్(కెప్టెన్), షార్ట్, హెడ్, లబూషేన్, ఇంగ్లిస్(వికెట్ కీపర్), క్యారీ, మ్యాక్స్‌వెల్, ద్వార్షిస్, ఎల్లిస్, జంపా, జాన్సన్.

నిరుద్యోగిత 5.8 శాతమే!

- 2047 నాటికి 2శాతానికి తగ్గిస్తాం

సోషియో ఎకనామిక్ సర్వేలో వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

రాష్ట్రంలో 5.8 శాతం మాత్రమే నిరుద్యోగత ఉన్నటు సోషియో ఎకనామిక్ సర్వేలో ప్రభుత్వం పేర్కొంది. 2047 నాటికి దీనిని రెండు శాతానికి తగ్గించనున్నట్లు పేర్కొన్నారు. దీనిని పరిగణలోకి తీసుకుంటే రోజువారీ కూలీ పనులను చేసుకునే వారిని కూడా నిరుద్యోగుల జాబితా నుంచి మినహాయించారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో పాటు వివిధ రంగాకు సంబంధించి బ 2047వ సంవత్సరానికి భారీ లక్ష్యాలను ఈ నివేదికలో ప్రభుత్వం పేర్కొంది. జిఎస్‌డిపి ఇప్పుడు 180 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2047 నాటికి ఏకంగా 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడాన్ని లక్ష్యంగాపేర్కొన్నారు. తలసరి ఆదాయం కూడా ఇప్పుడు 3,400 డాలర్లుగా ఉండగా, 2047 నాటికి 42 వేల డాలర్లకు చేరుకుంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళా కార్మికులు, ఉద్యోగుల సంఖ్య 45.8 శాతంగా ఉండగా, 2047 నాటికి 80 శాతానికి పెరుగుతుందని వివరించారు. సాధారణ ఉద్యోగుల వాటా 40 శాతం నుంచి 90 శాతానికి చేరుకుంటుందని, నైపుణ్య ఉద్యోగుల శాతం కూడా ఇప్పుడు 20 నుంచి 30 శాతంగా ఉండగా, 2047 నాటికి 95 శాతానికి చేరుకుంటుందని వివరించారు. రాష్ట్ర జిఎస్‌డిపిలో ఎంఎస్ఎంఇ, స్టార్టప్ పరిశ్రమల వాటా 30 శాతం ఉండగా, అది 2047 నాటికి 60 శాతానికి, పునరుత్పాదక విద్యుత్ వాటా 30 శాతం నుంచి 75 శాతానికి చేరుకుంటుందని నివేదికలో పొందుపరిచారు. జిఎస్‌డిపిలో ఎగుమతుల వాటా 20.7 బిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 450 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని పేర్కొనడం విశేషం. వ్యవసాయ ఉత్పత్తుల వృద్ధి మూడు నుంచి నాలుగు శాతంగా ఉండగా, 2047 నాటికి ఏడాదికి ఎనిమిది శాతం చొప్పున పెరుగుతుందని పేర్కొన్నారు. ఇక పర్యాటక రంగంలో రాష్ట్రం ఇప్పటివరకు తొలి పది స్థానాల్లో చోటు దక్కించుకోలేదు. అయితే 2047 నాటికి తొలి మూడు స్థానాల్లో ఉండేలా లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు సోషియో ఎకనామిక్ సర్వే నివేదికలో పొందుపరిచారు.

12.94 శాతానికి చేరిన వృద్ధి!

- తయారీ రంగంలో కొంత వెనుకబాటు
- అయినా జాతీయ సగటుకన్నా ఎక్కువ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 12.94 శాతం వృద్ధి నమోదైనట్లు సోషియా,ఎకనామిక్ సర్వేలో ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర ప్రణాళిక శాఖ రూపొందించిన ఈ నివేదికను శాసనసభలో సోమవారం ప్రవేశపెట్టారు. దాదాపు 450 పేజిల నివేదికను వృద్ధి గణాకాంలతో నింపివేశారు. ప్రస్తుత ధరల మేరకు జిఎస్‌డిపి గత ఏడాది 14.22 లక్షల కోట్లుగా ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 16.06 లక్షల కోట్లకు చేరుకున్నట్లు నివేదికలో ప్రకటించారు. ఇది 12.94 శాతమని తెలిపారు.

అదే సమయంలో జాతీయ వృద్ధి మాత్రం 9.7 శాతానికి పరిమితమైనట్లు పేర్కొన్నారు. జివిఏ (గ్రాస్ వాల్యూ ఏడెడ్) కూడా 2010–11 ధరల మేరకు గత ఏడాది వ్యవసాయ రంగంలో మైనస్ 4.98 శాతం వృద్ధి ఉన్నట్లు చూపించగా, ఈ ఏడాది ఏకంగా 11.46 శాతం వృద్ధి నమోదైనట్లు నివేదికలో చూపించడం విశేషం.

పరిశ్రమల సెక్టార్‌లో వృద్ధి శాతం గతేడాదికన్నా తగ్గినట్లు తేల్చారు. నాలుగు రంగాల్లో గనులు క్వారీ రంగంలో 2.7 శాతం వృద్ధి నమోదుకాగా, తయారీ రంగంలో 13.83 శాతం నుంచి 5.32 శాతానికి వృద్ధి తగ్గిపోయినట్లు కనిపించింది. విద్యుత్, గ్యాస్ , నీటి రంగంలో గతేడాది మాదిరిగానే వృద్ధి నమోదుకావడం విశేషం. నిర్మాణ రంగంలో గతేడాది 10.03 శాతం వృద్ధి ఉండగా, ఈ ఏడాది స్వల్పంగా తగ్గి 9.55 శాతానికి చేరుకున్నట్లు తేలింది.

సర్వీస్ సెక్టార్‌కు సంబంధించి వాణిజ్యం, హెూటల్స్ విభాగంలో వృద్ధి తగ్గిపోవడం గమనార్హం. కమ్యూనికేషన్ విభాగంలో వృద్ధి గతేడాదికన్నా సగంపైన తగ్గుముఖం పట్టినట్లు తేలింది. ఇక మైక్రో ఎకనామిక్ రంగంలో వ్యవసాయం, పారిశ్రామిక, సర్వీసెస్ రంగాల్లో వృద్ధిని పరిశీలిస్తే వ్యవసాయంలో భారీ వృద్ధిని చూపించారు. గతేడాది 3.49 శాతంగా ఉన్న వృద్ధి ఈ ఏడాది ఏకంగా 15.86 శాతానికి పెరిగిపోయినట్లు చూపించడం విశేషం. నిధుల పరంగా మాత్రం గతేడాది 4.48 లక్షల కోట్లు జివిఏగా ఉండగా, అది ఈ ఏడాదికి 5.19 లక్షల కోట్లకు మాత్రమే పెరిగింది. పారిశ్రామిక రంగంలో 7.42 శాతం నుంచి 6.71 శాతానికి తగ్గినట్లు చూపించారు. సేవారంగంలో మాత్రం స్వల్ప పెరుగుదలను పేర్కొన్నారు.

తలసరిపైనా భారీగానే

ఇక తలసరి ఆదాయంపైనా భారీగానే వృద్ధిని చూపించడం విశేషం. గత ఏడాది 8.2 శాతం వృద్ధితో 2,37,951 రూపాయలను తలసరిగా చూపించగా, ఈ ఏడాది 12.9 శాతం వృద్ధితో 2,68,653 రూపాయలుగా చూపిండం విశేషం. ఇదే జాతీయ స్థాయిలో వృద్ధి కేవలం 8.7 శాతం మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారు.

మెరిసిన మూనీ

యుపిపై గుజరాత్ జెయింట్స్ ఘన విజయం
మహిళల ప్రిమియర్ లీగ్

లక్నో: మహిళల ప్రిమియర్ లీగ్‌లో గుజరాత్ జెయింట్స్ భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. యుపి వారియర్స్‌తో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 81పరుగుల తేడాతో యుపి వారియర్స్‌ను చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 186పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. అనంతరం యుపి జట్టును 105పరుగులకే ఆలౌట్‌చేసింది. గుజరాత్ బౌలర్లు కశ్వీ గౌతమ్, తనూజ కన్వార్‌కు మూడేసి, డోటిన్‌కు రెండు, మేఘ్నా సింగ్, గార్డినర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ గెలుపుతో గుజరాత్ జట్టు 2వ స్థానానికి ఎగబాకింది. అంతకుముందు ఓపెనర్ బెత్ మూనీ ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగింది. యుపి వారియర్స్‌తో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జెయింట్స్ మహిళల నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 186పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఓపెనర్ బెత్ మూనీ(96నాటౌట్; 59బంతుల్లో 17ఫోర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌కి తోడు హర్లిన్ డియోల్(45; 32బంతుల్లో 6ఫోర్లు) బ్యాటింగ్‌లో రాణించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌కు శుభారంభం దక్కలేదు. హేమలత(2) నిరాశపరిచింది. ఆ తర్వాత మూనీ–హర్లిన్ కలిసి 2వ వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత కెప్టెన్ గార్డినర్(11) నిరాశపరిచినా.. డోటిన్(17) ఫర్వాలేదనిపించింది. యుపి వారియర్స్ బౌలర్లలో సోఫీ ఎక్లేస్టోన్‌కు రెండు, హెన్రీ, దీప్తి శర్మ, క్రాంతి గౌడ్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. ఢిల్లీ క్యాపిటల్స్ మహిళలు 10పాయింట్లతో నాకౌట్‌కు చేరుకోగా.. ప్లే–ఆఫ్ బెర్త్ కోసం మిగిలిన నాలుగుజట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

మహిళల ప్రిమియర్ లీగ్ పాయింట్ల పట్టిక

జట్లు	ఆ	గె	ఓ	పా	నె.ర.
ఢిల్లీ క్యాపిటల్స్	**7**	**5**	**2**	**10**	**+0.48**
గుజరాత్ జెయింట్స్	6	3	3	6	+0.35
ముంబయి	5	3	2	6	+0.16
బెంగళూరు	6	2	4	4	-0.24
యుపి వారియర్స్	6	2	4	4	-0.78

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68